# ప్రాణాలు ప్రభువుకు - ప్రసాదం పాలెగాళ్ళకు



ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం
(APCLC)
కర్నూలు జిల్లా



K.E. సోదరులు రాక్‌వుడ్ స్కూలు కాంపౌండు స్థలము కొనుక్కొని వేసుకున్న షాపులు



S.V. నాగిరెడ్డి ఈ రాక్‌వుడ్ బంగ్లాను లీజుకు తీసుకొని అద్దెకిచ్చినాడు



T.G. వెంకటేశ్ లీజుకు తీసుకున్న రాక్‌వుడ్ బంగ్లా కాంపౌండు స్థలము,
దానిలో వేసుకున్న షాపులు

# ప్రార్థనలు ప్రభువుకు -
# ప్రసాదం పాలెగాళ్ళకు

(కర్నూలు పట్టణంలోని బాప్టిస్టు క్రైస్తవ చర్చి
ఆస్తుల దురాక్రమణలపైన నివేదిక)


ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం
(APCLC)
కర్నూలు జిల్లా

| | | |
|---|---|---|
| ప్రచురణ కర్త | : | ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘం<br>(APCLC) |
| ప్రతులు | : | 2,000 |
| ప్రతులకు | : | పి. రాజసాగర్<br>టీచర్, ఇందిరా నగర్<br>ఆత్మకూరు - 518422<br><br>యు.జి. శ్రీనివాసులు<br>ఆదర్శ విద్యాపీఠం<br>21/224-4, మండిగిరి<br>ఆదోని - 518301 |
| ప్రచురణ తేదీ | : | 1-12-1996 |
| ప్రతులు | : | 2000 |

# ప్రార్థన ప్రభువుకు - ప్రసాదం పాలెగాళ్లకు

## ముందుమాట

కర్నూలు నగరంలోని బాప్టిస్టు క్రైస్తవ చర్చి ఆస్తులు కొన్ని సంవత్సరాలుగా అన్యాక్రాంతం అవుతున్నాయి. 'మత వ్యాప్తి, సంఘసేవ' అనే లక్ష్యాలకోసం వినియోగించటానికి అమెరికన్ మిషనరీలు సేకరించిన ఈ ఆస్తులు ఆరెండు లక్ష్యాలతోను నిమిత్తం లేని వ్యాపార ప్రయోజనాల కోసం అన్యాక్రాంతం అవుతున్నాయి. ఇప్పటికే కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తి ప్రైవేట్ వ్యక్తుల చేతిలోకి పోయింది. అందులో ప్రముఖులు ఆళ్లగడ్డ ముఠానాయకుడు భూమానాగిరెడ్డి మామగారు, మన రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ మంత్రి అయిన ఎస్.వి. సుబ్బారెడ్డి కుటుంబీకులు, మరొక ముఠానాయకుడు, మాజీ మంత్రి అయిన కె.ఇ.కృష్ణమూర్తి సోదరులు, పరిశ్రమలను నడపడంలోను ముంచి మూత వేయించడంలోనూ జిల్లాలో తమకుతామే సాటి అయిన 'టి.జి.' కుటుంబీకులు, నేతిమిఠాయి వ్యాపారానికి ప్రసిద్ధిగాంచిన విశ్వహిందు పరిషత్ నాయకుడు జి. పుల్లారెడ్డి.

ప్రజోపయోగాలకు పనికి వచ్చే విలువయిన పట్టణప్రాంత భూములు ప్రైవేట్ వ్యక్తుల పరం కావడం బాధాకరమే కాక అన్యాయంకూడా. ఈబదలాయింపు చట్టం దృష్టిలో చెల్లదనీ, ఇది సామాన్య బాప్టిస్టు క్రైస్తవులకు మిషనరీల లక్ష్యాలకు ద్రోహం చేయడమేననీ కర్నూలు జిల్లా బాప్టిస్టు క్రైస్తవ ఆస్తుల పరిరక్షణ సంఘం కొంత కాలంగా ఆందోళన చేస్తూఉంది. కోర్టులోకేసువేసింది, బయటగొడవ చేస్తూఉంది. ఆ సంస్థ కోరిక మేరకు,

ఈ ఆస్తుల బదలాయింపును, దానికి సంబంధించిన చట్టాలను వివరంగా పరిశీలించి దానిలోని తప్పొప్పులను నిగ్గుతేల్చే నివేదిక ప్రచురించాలని మేము నిర్ణయించుకున్నాము. ఆ ప్రయత్నం ఫలితమే ఈ చిన్న ప్రచురణ.

దేశసంపద కొద్దిమంది చేతులలో కేంద్రీకృతమయి సమాజం ఉమ్మడి ప్రయోజనాలను దెబ్బ తీయకుండ చూడాలనీ, అది ప్రభుత్వం బాధ్యత అనీ భారత రాజ్యాంగంలోని ఒక ఆదేశిక సూత్రం అయిన ఆర్టికల్ 39 అంటుంది. దేశ సంపద మీద అందరికీ సమాన హక్కులుండాలన్న సమసమాజ ఆదర్శానికి ఇదొక బలహీనమయిన ప్రత్యామ్నాయం. అంతకు మించి భారత రాజ్యాంగం ఆర్థిక సమానత్వాన్ని గురించి ఆదేశించ లేదు. కానీ ఈ కనీస ప్రజాతంత్ర సూత్రం సహితం మన దేశంలో నిజాయితీగా అమలు కావడంలేదు.

ఈ దృష్టితోనే మేము బాప్టిస్టు క్రైస్తవ ఆస్తుల పరిరక్షణ సంఘం విన్నపాన్ని స్వీకరించాము. వారి అభిప్రాయాలతో అన్ని విషయాలలోను మాకు ఏకీభావంఉండక పోవచ్చును. అయితే సమాజసంపద కలిగినవారి సొత్తుగా మిగిలి పోకూడదన్నప్రజాతంత్ర ఆకాంక్ష పట్ల మాకున్న సానుభూతి దృష్ట్యా ఈ అన్వేషణ చేపట్టాము. ఆ ఆకాంక్షకు మా ప్రయత్నం ఏమేరకయిన తోడ్పడితే మేము సంతోషిస్తాము.

ఈ ప్రచురణలో చట్టాలు, చట్ట పరమైన నియమాల ప్రస్తావన కొంచెం ఎక్కువగాఉందనిపించ వచ్చును. చట్టాలతో సంబంధం లేకుండానే, కర్నూలు నగర భూములు ఆళ్లగడ్డ ఫాక్షనిస్టులకు కె.ఇ ముఠాకు చెందడానికి వీలులేదనీ అవి పేదప్రజలకే చెందాలనీ ప్రకటించవచ్చును. మాకు అభ్యంతరమేమిలేదు. అయితే చట్టాలకూ ప్రజాతంత్ర ఆ కాంక్షలకు మధ్య విరోధం ఏమీలేదు. గతకాలంలో సమాజంలో ముందు కొచ్చిన ప్రజాతంత్ర ఆకాంక్షల ఛాయలు అనేక రూపాలలో చట్టాలలో కనిపిస్తాయి. అవి చట్టాలలోని పాజిటివ్ అంశం. వాటిని సరిగ్గా వ్యాఖ్యానించుకొని, వాటినే ఆ చట్టాల సారాంశంగా ఎంచి

కోర్టులోను, కోర్టుల బయటవాదించడం ప్రజాతంత్ర ఆకాంక్షలను సాధించడానికీ నిలబెట్టడానికీ ఉపయోగపడుతుంది. దానికి కొంచెం ఓపిక, కొంచెం అధ్యయనం కావాలి. అయినా ఈ రోజు మనకున్న ప్రజాతంత్ర ఆకాంక్షలు ఏనాడయినా వ్యవస్థిత హక్కుల రూపం - అంటే చట్టాల రూపం - తీసుకోవాలనేకదా మనం కోరుకునేది! కాబట్టి ప్రజా ఉద్యమకారులకు చట్టాలంటే మామూలుగా ఉండే అసహనాన్ని కొంచెం పక్కన పెట్టి ఈ నివేదికను చదువ వలసిందిగా కోరుతున్నాం శాసన సంవాదం ఆస్తి పరులకు వదిలిపెట్టి, ఉద్యమకారులు రాజకీయ ఆందోళనకు పరిమితం కావడం తమను తాము కుదించి వేసుకోవడమే అవుతుంది.

1 డిసెంబరు 1996 ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం

# I

ఆంధ్ర ప్రదేశ్‌లో క్రైస్తవ మతం బాగా వ్యాప్తి చెందింది. హైందవ కులవ్యవస్థ అతినీచమయిన స్థాయికి నెట్టి, మానవతనే నిరాకరించిన మాల మాదిగ తదితర దళిత కులాలను క్రైస్తవం ఆకర్షించింది. క్రైస్తవ ప్రచారకులు, బోధకులు, మిషనరీలు దళిత ప్రజానీకాన్ని తమ వారిగా ఎంచి, వారిని క్రైస్తవంలోకి ఆహ్వానించి, సమాజంలో గౌరవంలేని వారికి దేవుని ఎదుట గౌరవం కల్పించి, చదువు ఉద్యోగ అర్హతలు కలిగించారు. ఆత్మస్థైర్యాన్ని ఆత్మాభిమానాన్నీ అందించారు. సమాజంలో వాళ్ల స్థాయిని కూడ కొంత మేరకు పెంచారు.

'ఇదంతా మతం మార్పిడికోసమే చేసార'ని హైందవ మతాభిమానులు క్రైస్తవ మిషనరీలను, ప్రచారకులను దూషిస్తుంటారు. ఇది నూటికి నూరుపాళ్ళు నిజమనలేం. క్రైస్తవంలో తప్ప మోక్షమార్గం లేదని నిజాయితీగానే నమ్మిన వాళ్ళు ప్రచారకులలో చాలామంది ఉండే ఉంటారు. పతితులకు సేవ చేయడం క్రైస్తవ ధర్మం అన్న బైబిల్ సూక్తిని నమ్మిన వాళ్లు కూడా ఉండి ఉంటారు. మత వ్యాప్తి ద్వారా ప్రపంచంలో క్రైస్తవ మతాధిపత్యాన్ని నెలకొల్పాలని ఆశించిన వారు సహితం ఉండి ఉండవచ్చును. వాళ్ళ లక్ష్యం ఏదయినా వాళ్లు హైందవ సమాజంలోని అంటరానికులాలకు చేసిన మేలు గణనీయమైనది. భారతీయ సమాజ ప్రజాస్వామీకరణకు అది చాలా తోడ్పడింది. ఇప్పటకీ తోడ్పడుతూ ఉంది.

ఈ కృషికోసం పాశ్చాత్య మత సంస్థలు, క్రైస్తవ భక్తులు, సంఘసేవాతత్పరులైవ వ్యక్తులు పెద్ద మొత్తంలో డబ్బు సహాయంచేసారు. అన్ని క్రైస్తవ మతశాఖలూ ఈ రకమైన ధన సహాయం పొందాయి. ఈడబ్బుతో వారు భారత దేశంలో అనేక చర్చిలు నిర్మించారు. పాఠశాలలు నెలకొల్పారు. ఆస్పత్రులు కట్టారు. ఈ పాఠశాలలు, ఆస్పత్రులు కేవలం క్రైస్తవ మతం పుచ్చుకున్న వారికే కాక అందరికీ ఉపయోగపడ్డాయి. ప్రజలందరి శరీర

ఆరోగ్యానికీ మానసిక వికాసానికీ తోడ్పడ్డాయి. భారత దేశాన్ని ఒక ఆధునిక దేశంగా రూపొందించడంలో 'మిషన్‌స్కూళ్ళు' 'మిషన్ ఆస్పత్రుల' పాత్ర స్వల్పమైనదికాదు.

ఈ క్రమంలో క్రైస్తవ మత సంస్థలు పెద్ద ఎత్తునే ఆస్తులు సంపాదించాయి. భూములు చాలా కొన్నారు, భవనాలు నిర్మించారు. ఆస్పత్రి భవనాలు, స్కూలు బిల్డింగులు, వాటికి అనుబంధంగా విశాలమైన ఆవరణలు, ఆటస్థలాలు వెలిసాయి.

క్రైస్తవ మత వ్యాప్తి,సంఘసేవ (మిషనరీల భాషలోనే చెప్పాలంటే, ఆధ్యాత్మిక చింతన కోసం దేవాలయాలు, మనోవికాసం కోసం పాఠశాలలు, శరీర స్వస్థత కోసం ఆస్పత్రులు' నెలకొల్పే లక్ష్యం) ప్రధాన ప్రేరక శక్తిగా ఉన్నన్నాళ్లు ఈ ఆస్తులు భద్రంగానే ఉన్నాయి. పాశ్చాత్య మిషనరీలయినా, భారత దేశీయులయివ మతాధిపతులు లేక ప్రబోధకులయినా వాటిని స్వంతం చేసుకోవాలన్న ఆలోచన చేయలేదు (అక్కడక్కడ ఒకటి రెండు మినహాయింపులుంటే ఉండవచ్చు.)

కానీ కాలక్రమంలో కొన్ని మార్పులు జరిగాయి. అధికంగా పట్టణ ప్రాంతాలలో ఉన్న క్రైస్తవ ఆస్తుల మార్కెట్ ధర విపరీతంగా పెరిగింది. ఒక్కొక్క ఊరిలో ఈ ఆస్తుల వెల ఈ రోజు కోట్ల రూపాయలకు చేరుకుంది. మరొకవైపు పాశ్చాత్య మిషనరీలు వెళ్లి పోవడంతో వీటి నిర్వహణ బాధ్యత, వీటిపైన హక్కు, అధికారం భారతదేశస్తుల హస్తగతం అయింది. స్వాతంత్ర్యానంతరం పాశ్చాత్యదేశాల నుండి నిధులు రావడం సన్నగిల్లింది కాబట్టి దేశంలోని క్రైస్తవ ఆస్తుల నిర్వహణ కష్టతరమయి పోయిందని వాళ్లు వాదించసాగారు. 'నిర్వహించలేని ఆస్తులు అమ్ముకోవడం ఉత్తమం' అనే అభిప్రాయానికి ప్రాచుర్యం లభించింది. సహేతుకంగా కనిపించే ఈ ఆలోచన నిజానికి వాస్తవంకాదు. అయితే మొత్తంగా దేశ సాంఘిక రాజకీయ రంగాలలో పెరుగుతున్న అవినీతి ప్రభావం చర్చిల నిర్వాహకులపైన కూడా పడింది.

క్రమంగా, క్రైస్తవ మతప్రచారం కోసం, సంఘసేవ కోసం (ముఖ్యంగా విద్యావైద్య రంగాలలో) ఉద్దేశించబడిన భూములు వ్యాపార వేత్తల పాలయ్యాయి. మన పట్టణాలనిండా ఉన్న భూబకాసురుల వాత పడ్డాయి. ప్రజావసరాల కోసం ఉపయోగపడగల అత్యంత విలువయిన పట్టణప్రాంత భూములు ప్రైవేట్ ఆస్తులయ్యాయి. వాటిని తెగనమ్మిన క్రైస్తవ ప్రబోధకులకూ నిర్వాహకులకూ సరయిన హక్కేదీలేదని కొనుక్కున్న బకాసురులకు తెలుసును కాబట్టి వాళ్లు చాలా వరకు కారు చవగ్గా కొన్నారు. అమ్మే వారికది స్వంత ఆస్తి కాదు కాబట్టి ఎంత దొరికితే అంతే చాలని చవగ్గా అమ్ముకున్నారు.

రాష్ట్ర వ్యాపితంగా అన్ని క్రైస్తవ మత శాఖల భూములు ఈ విధంగా దళిత క్రైస్తవ ప్రజానీకానికి గాని సంఘసేవా కార్యకలాపాలకు గానీ మత సంస్థలకుగానీ దక్కకుండ ప్రైవేట్ వ్యాపారుల ఆస్తులుగా మారిన క్రమాన్ని వివరంగా పరిశీలిస్తే చాలా ఆసక్తికరమైన విషయాలు బయటపడతాయి. సమాజ సంపద కొద్దిమంది చేతిలో కేంద్రీకృతమై సమిష్టి ప్రయోజనాలకు విఘాతం కలిగించకుండా చూడాలన్న రాజ్యాంగ ఆదేశిక సూత్రానికి పూర్తిగా విరుద్ధమైన చిత్రం కనబడుతుంది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సర్వేచేయడం చాలా పెద్దపని అవుతుంది. ఈ నివేదిక కేవలం కర్నూలు పట్టణానికీ అందులోని బాప్టిస్టు క్రైస్తవ ఆస్తులకూ సంబంధించినది మాత్రమే. ఈ ఆస్తి ప్రస్తుత ధరలలో 40 కోట్ల రూపాయల విలువచేస్తుందని అంచనా. అందులో చాలా భాగం క్రమంగా అన్యాక్రాంతం అయింది. ఈ భూమిని, బిల్డింగులను చాలా చవగ్గా పొందిన వారు బాంబులగడ్డగా పేరుపొందిన ఆళ్ళగడ్డ ఫాక్షనిస్టులలో ప్రధాన వర్గం నాయకుడయిన ప్రస్తుత నంద్యాల ఎం.పి. భూమానాగిరెడ్డి మామగారు ఎస్.వి. సుబ్బారెడ్డి (రాష్ట్రక్యాబినెట్‌లో వ్యవసాయశాఖ మంత్రి) కుటుంబీకులు, పడమటి కర్నూలు జిల్లాలో కోట్ల విజయభాస్కర రెడ్డికి ప్రత్యర్థి ఫ్యాక్షన్ నాయకుడైన కె.ఇ. కృష్ణమూర్తి సోదరులు, మూతపడిన

రాయలసీమ పేపర్ మిల్లు మాజీయజమాని టి.జి. వెంకటేశ్ గుప్త వంశస్తులు, రాష్ట్ర వ్యాపితంగా నేతి మిఠాయి పుల్లా రెడ్డిగా పేరు గాంచిన జి. పుల్లారెడ్డి ఆయన పుత్రరత్నాలు.

కర్నూలు పట్టణంలో బాప్టిస్టు చర్చి భూములు కొనుక్కున్నది వీరు మాత్రమే కాదు. చాలామంది క్రైస్తవ పాస్టర్లు, టీచర్లు కూడ అయిదు సెంట్లు చొప్పున ఇండ్ల స్థలాలు కొన్నారు. కానీ చర్చి ఆస్తులు అమ్ముకోదలచుకున్న వారందరూ మొదట కొంత ఆస్తిని ఒక ఫాక్షనిస్టుకో లేక ఒక కోటీశ్వరుడికో అమ్మారు. ఎందుకంటే ఆ తరువాత వేరే ఎవరికి అమ్ముకున్నా ఆ అమ్మకాన్ని ప్రశ్నించే వాళ్ళకు వీళ్ళే సమాధానం చెప్తారు. అసలు ప్రశ్నించడానికే ఎవరూ సాహసించరు. ఫాక్షనిస్టులతో గొడవ పెట్టుకుంటే బాంబులేస్తారని భయం. కోటీశ్వరులతో గొడవ పెట్టుకుంటే సబ్‌కోర్టు నుండి సుప్రీంకోర్టుదాకా లాగుతారని భయం. ఈ భయంవల్ల ఆ అమ్మకంపైన ఎవరు కోర్టు కెక్కరు. కాబట్టి మీరు ఒక ఎకరం చర్చి భూమి అమ్ముకోదలచు కుంటే అందులో 15సెంట్లు భూమానాగిరెడ్డి బావ మరిదికో కె.ఇ. కృష్ణమూర్తి తమ్ముడికో అమ్మండి. లేకపోతే కోటీశ్వరులయిన టి.జి. కుటుంబీకులకు అమ్మండి. మీ తొందర వాళ్ళకు తెలుసును కాబట్టి వాళ్ళు రూపాయవస్తువును పదిపైసలకు అడుగుతారు. అయినా ఫరవాలేదు. వస్తువు మీదయితేకదా మీరు ధర గురించి బాధ పడడానికి! ఆ తరువాత మిగిలిన 85 సెంట్లు మీరు ప్లాట్లు చేసి మామూలు జనానికి, బంధుమిత్రులకు అమ్ముకోవచ్చును. మీరు ఈ పని చేయటం మొదలు పెట్టిన తరువాత ఎవరెవరో వచ్చి చర్చి భూములు కొంచెం కొంచెం ఆక్రమించు కొని కట్టెలడిపోలు, కూల్‌డ్రింక్ షాపులు, ఇంకా ఏవేవో అంగళ్ళు నెలకొల్పుతారు. వాళ్ళ దగ్గర ఏ ఫాక్షనిస్టో కిరాయి వసూలు చేసుకుంటారు.అయినా మీదేం పోయింది? ఆ ఆస్తి మీదయితే కదా?

చర్చి భూములు అన్యాక్రాంతమైతే క్రైస్తవులు బాధపడాలేమో గానీ అది ప్రజలందరి సమస్య ఎందుకయిందని ఎవరయినా అడగ వచ్చును. పౌరహక్కుల సంఘానికి ఎందుకు పట్టిందని అడగవచ్చును. ఈ భూములు

చాలా విలువయిన పట్టణ భూములు. అవి అనేక ప్రజావసరాలకు ఉపయోగపడగలవు. ఆటస్థలాలుగా, పార్కులుగా ఉపయోగపడగలవు. స్కూళ్ళ కోసం, ఆస్పత్రుల కోసం, బలహీన వర్గాల ఇళ్ళ కాలనీల కోసం ఉపయోగపడగలవు. అటువంటి పట్టణ ప్రాంత భూములు ఒక చారిత్రక దశలో క్రైస్తవ మిషన్ల ఆస్తులయ్యాయి. మతవ్యాప్తి కోసం, స్కూళ్ళు, ఆస్పత్రులు, హాస్టళ్ళ ద్వారా సంఘసేవ చేయడంకోసం ఇవి ఉపయోగపడాలని వీటిని కొనుక్కున్న మిషనరీలు ఉద్దేశించారు. మతవ్యాప్తి కంటె సంఘసేవ కోసమే బాప్టిస్టు మిషనరీలు తమ ఆస్తులను ఎక్కువగా ఉపయోగించారు.

ఈ 'మతపరమైన, సేవాపరమైన' లక్ష్యం ఉండబట్టే ఈ భూములకు, ఆస్తులకు, సీలింగ్ చట్టంలోనూ ఆదాయపుపన్ను చట్టంలోను మినహాయింపులు ఇచ్చారు. ఆ లక్ష్యాల కోసం ఉపయోగపడుతున్నట్టయితేనే సీలింగ్ నుండి మినహాయింపు ఉంటుందనీ లేకపోతే సిలింగ్ వర్తిస్తుందనీ పట్టణ భూపరిమితి చట్టం సెక్షన్ 19(1)(4) స్పష్టంచేస్తుంది. అప్పుడది ప్రభుత్వం చేతిలోకి పోతుంది. ప్రజలు ప్రభుత్వంపైన ఒత్తిడి తెచ్చి ఆభూమి ప్రజోపయోగాలకు వినియోగపడేటట్లు చూడగలుగుతారు. కనీసం ఆ అవకాశమైనా ఉంటుంది. పట్టణ ప్రాంత భూమి కొందరి చేతిలో కేంద్రీకృతం గాకుండ సామాన్య అవసరాలకు ఉపయోగపడేటట్లు చూడడం పట్టణభూపరిమితి చట్టం ప్రకటిత లక్ష్యాలలో ఒకటి. లేదా, ఆ ఆస్తులు మిషన్ ఆస్తులుగానే ఉంటూ మిషన్ లక్ష్యాలకే వినియోగించబడేటట్టయితే, అవి సంఘసేవకు వినియోగించబడిన మేరకు విద్య, వైద్య రంగాలలో ప్రజల సామాన్య అవపరాలు తీర్చ గలుగుతాయి. ఆ ఆస్తులు అటు సీలింగ్ చట్టం ద్వారా ప్రభుత్వపరము కాకుండ, మిషన్ లక్ష్యాలయిన సంఘసేవకు ఉపయోగపడకుండ ప్రైవేట్ వ్యాపారస్తుల చేతిలోకి పోవడం విలునయిన ప్రజాసంపద దుర్వినియోగం కావడం తప్ప వేరే ఏమీకాదు.

మత వ్యాప్తి ఒక ప్రజావసరమా అన్న విషయంలో అభిప్రాయభేదాలకు తావుఉండవచ్చు. కానీ మిగిలిన సేవాలక్ష్యాల విషయంలో అభిప్రాయభేదాలకు

తావులేదు. క్రైస్తవ మత సంస్థలకు విదేశీడబ్బు సహాయం నిలిచిపోవడంవల్ల ఈ లక్ష్యాలను నెరవేర్చడం కష్టమయిపోయిందనే వాదన నిజమయినట్టయితే, నిర్వహించడం సాధ్యం కాని భూములు, ఆస్తులు, ఇతర రూపాలలో ప్రజావసరాలకు ఉపయోగపడాలి తప్ప ధనవంతుల ప్రైవేట్ ఆస్తిగా మారడం సబబుకాదు. అవి క్రైస్తవ ఆస్తులు కాబట్టి, క్రైస్తవులు అధికంగా దళితపేదలు కాబట్టి, వాటిని క్రైస్తవుల ఉమ్మడి ప్రయోజనాలకు వినియోగించాలని వాదించవచ్చును. దళిత క్రైస్తవులు కొందరు ఆ వాదనే చేస్తున్నారు. లేదా, క్రైస్తవమిషనరీలు తమ సంఘసేవను ఏ రోజూ కేవలం క్రైస్తవులకే పరిమితం చేయలేదు కాబట్టి, నిర్వహించలేని క్రైస్తవ ఆస్తులను మతంతో సంబంధం లేకుండ సామాన్య ప్రజాప్రయోజనాలకు మరలించాలని వాదించవచ్చును. ఏది ఏమయినా అవి ఫాక్షనిస్టుల ప్రైవేట్ ఆస్తులుగానూ, నేతిమితాయి షాహు కార్ల స్వంత ఆస్తులుగానూ మారడం సరయినది కాదు. అసలే అనేక ప్రజావసరాలకు భూములు లేని మన పట్టణప్రాంతాలలో విస్తారమైన ఈ భూములు కోటీశ్వరుల ప్రైవేట్ ఆస్తులుగామారడం ప్రజాప్రయోజనాలకు భంగకరమైనది.

పౌరహక్కుల సంఘం ఈ విషయంలోఆసక్తి తీసుకోవడానికి గల కారణం, క్రైస్తవేతర ప్రజలను కూడ ఆసక్తి తీసుకొమ్మని అడగడానికిగల కారణం, ఇది.

చట్టం దృష్టిలో కర్నూలులో జరిగిన బాప్టిస్టు క్రైస్తవ ఆస్తుల అమ్మకం చెల్లు తుందా అనే ప్రశ్నను ఈ నివేదికలో వివరంగా చర్చించాము. దీనిపైన కర్నూలు సబ్‌కోర్టులో, హైదరాబాద్‌లోని భూమికబ్జాదారుల కోర్టులో, మద్రాసు హైకోర్టులో, కేసులు నడిచాయి, నడుస్తున్నాయి. విక్రయించబడిన క్రైస్తవ ఆస్తుల యజమాని ఎవరు, ఆస్తుల అమ్మకం విషయంలో ఆయజమానిపైన ఉండే పరిమితి ఏమిటి అనే విషయాన్ని ఈ కోర్టులు చర్చించాయి, చర్చిస్తున్నాయి. ప్రామాణికమైన తీర్పు ఇంకా వెలువడలేదు. కొన్ని పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి.

ఈ ఆస్తుల యజమాని ప్రాపర్టీ అసోసియేషన్ ఆఫ్ బాప్టిస్ట్‌చర్చిస్ (పిఎబిసి) అని తీర్మానించడంలో తటపటాయించవలసిన అవసరం లేదని మా అభిప్రాయం. వారు తప్ప వేరే ఎవ్వరు చేసిన అమ్మకాలయినా చెల్లనేరవు. కర్నూలు పట్టణంలో అమ్మకానికి గురయిన బాప్టిస్టు క్రైస్తవ ఆస్తులలో అధికభాగం పిఎబిసి అమ్మినవి కావు. యజమాన్య హక్కులు లేని కొందరు వ్యక్తులు అమ్మినవే. వాళ్ళు కర్నూలు ఫీల్డ్ అసోసియేషన్ అనే యాజమాన్య హక్కులు లేని సంస్థ పేరు మీద పవర్ ఆఫ్ అటార్నీలు (అది కూడ అక్రమంగా) పుట్టించి అమ్మకం చేపట్టారు. ఆ అమ్మకాలేవీ చెల్లవు.

అయితే పిఎబిసి కి ఉండే యాజమాన్య అధికారం కూడ సంపూర్ణం కాదు. చట్టం కళ్ళలో పిఎబిసి అనేది ఒక కంపెనీ. కంపెనీలకు వ్యవస్థాపక లక్ష్యాలు (Memorandum of Association), వ్యవస్థాపక నియమాలు (Articles of Association) ఉంటాయి. పిఎబిసి కి కూడ ఉన్నాయి. కంపెనీలు తమ వ్యవస్థాపక లక్ష్యాల వెలుగులో, వ్యవస్థాపక నియమాలకు అనుగుణంగా చేపట్టే చర్యలు మాత్రమే చట్టం దృష్టిలో చెల్లుబాటవుతాయి. పిఎబిసి లక్ష్యాలు దానినొక ట్రస్టీగా గుర్తిస్తాయి. అది క్రైస్తవ మత వ్యాప్తినీ సంఘసేవనూ లక్ష్యంగా పెట్టుకొని ఒక ట్రస్టీగా బాప్టిస్టు క్రైస్తవ ఆస్తుల, నిర్వహణ చేపట్టాలి. ఈ లక్ష్యానికి అనుబంధంగా సాగే క్రయవిక్రయాలు మాత్రమే చట్టం కళ్ళలో చెల్లుబాటవుతాయి. ప్రతీ అమ్మకాన్నీ ఆ దృష్టితో సమర్థించగలగాలి. కర్నూలు లోనయినా వేరే ఊళ్ళలోనయినా పిఎబిసి చేపట్టిన అమ్మకాలలో కొన్ని మాత్రమే ఈ గీటు రాయికినిలుస్తాయి.

దీనికి సంబంధించిన వివరాలు దిగువ అధ్యాయాలలో ఇస్తాము.

మా నివేదికను మేము ఈ చర్చతో ముగించడం లేదు. ఈ సమస్య ఒక్క కర్నూలుకే పరిమితమయినది కాదు. కేవలం బాప్టిస్టు చర్చిలకు మాత్రమే పరిమితం అయినది కాదు. ఇతర పట్టణాలలోను ఇతర క్రైస్తవ శాఖలలోను ఈ సమస్య ఏదో ఒక రూపంలో ఉంది. ఈ క్రైస్తవ ఆస్తులు

కొన్ని వేల కోట్ల రూపాయల విలువ చేస్తాయి. అందులో కొంత భాగం ప్రార్థనా స్థలాలు, వాటి ఆవరణలు కాగా అధికభాగం ప్రజావసరాలకు ఉపయోగపడుతున్న స్కూళ్ళు, ఆస్పత్రి భవనాలు, వాటి ఆవరణలు, వాటికి అనుబంధంగా ఉన్న ఖాళీస్థలాలు. ఈ భూమి, ఈ భవనాలు ప్రైవేట్ వ్యక్తుల స్వంత ఆస్తిగా మారకుండ చూసే బాధ్యత ప్రభుత్వం పైన ఉంది. అమ్ముకున్న ఒక్కొక్క ఆస్తి మీద ఎవరోఒకరు కోర్టులో దావా వేయడం, అటువంటి దావాలు సివిల్ కోర్టుల్లో సంవత్సరాల తరబడి నలగడం, ఒక్కొక్కసారి దావా వేసిన వారు డబ్బులు తీసుకొని ప్రతివాదితో కుమ్మక్కు కావడం, లేదా తామే దొంగచాటుగా ఇంకొన్ని ఆస్తులు అమ్ముకోవడం, జరుగుతూ ఉంది. ఈ ఆస్తులను సివిల్ దావాల ద్వారా కాపాడడం జరిగేపనికాదు. ప్రభుత్వం జోక్యం చేసుకోవలసిన అవసరం ఉంది. ముస్లిం మత ఆస్తులకు వక్ఫ్‌బోర్డు ఉన్నట్టు క్రైస్తవ మత ఆస్తులకు కూడ రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవ మత సంప్రదాయాలకు అనుగుణ్యమైన ఒక పాలన సంస్థను ఏర్పాటు చేసి చర్చి ఆస్తుల నిర్వహణను ఆ బోర్డుకు అప్పగించాలి. ఇప్పటికి జరిగిన అమ్మకాలను పట్టణ భూపరిమితి చట్టం క్రింద రద్దుచేసే అవకాశం ప్రభుత్వానికి ఉంది. వాటిని రద్దు చేసి ఆ భూమిని కూడ స్వాధీనం చేసుకొని ఆ బోర్డుకు అప్పగించవచ్చును.

ఈ సూచనను చివరి అధ్యాయంలో వివరిస్తాము.

## II

బాప్టిస్టు క్రైస్తవ చర్చి ఈశాన్య రాష్ట్రాలలో, ఆంధ్రప్రదేశ్‌లో, తమిళనాడులో బాగా వ్యాప్తి చెందింది ఎక్కువగా ఆంధ్రప్రదేశ్‌లో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ఆ చర్చి కొనుగోలు చేసిన భూమి పట్టణ ప్రాంతాలలోనే 645 ఎకరాలుంది. ఈ భూమి హైదరాబాద్, నెల్లూరు, కర్నూలు, వరంగల్, ఒంగోలు, గుంటూరు, నల్గొండ, బాపట్ల, కంభం, నరసరావుపేట, వినుకొండ, ఉదయగిరి, కావలి, చిలకలూరిపేట, జనగాం, మధిర,

కోవూరు, దొనకొండ, దర్శి, గురజాల, మార్కాపురం, పొదిలి, సత్తెనపల్లి, సూర్యపేట, నందికొట్కూరు, తిరువూరు, కందుకూరు, కనిగిరి, గురజాలలలో ఉంది. ఇవన్నీ జిల్లా కేంద్రాలు, లేక డివిజన్ కేంద్రాలు, లేక తాలూకా కేంద్రాలు, లేక పెద్దమండల కేంద్రాలు. ప్రస్తుత ధరలలో ఈ 645 ఎకరాల వెల 1,000 కోట్ల నుండి 2,000 కోట్ల రూపాయలదాకా ఉంటుంది. ఈ భూమే కాక బలమైన రాతి కట్టడాలయిన చర్చి, స్కూలు, ఆస్పత్రి భవనాలనేకం ఉన్నాయి. ఈ పట్టణ ప్రాంత ఆస్తులే కాక గుంటూరు, నెల్లూరు, ప్రకాశం, వరంగల్, ఖమ్మం, కర్నూలు, కృష్ణ జిల్లాలలో 291 గ్రామాలలో కూడ బాప్టిస్టు చర్చికి భూములు, కట్టడాలు ఉన్నాయి.

ఇదంతా 1974 నాటి విషయం. ఇప్పుడు ఇందులో చాలా భాగం అన్యాక్రాంతం అయివుంది. అన్యాక్రాంతం అయిన భూములు, ఆస్తులు, 'మత ప్రచారం, సంఘసేవ' అనే ఏ లక్ష్యాలతోనయితే మిషనరీలు వాటిని తొలినాడు కొన్నారో అందుకోసం ఉపయోగపడడంలేదు. పోనీ సామాన్య క్రైస్తవుల చేతిలోకి పోయాయా అంటే అది కూడ లేదు. సాధారణ ప్రజాప్రయోజనాల కోసం మునిసిపాలిటీవారో లేక ఇతర ప్రభుత్వ శాఖవారో కొనుగోలు చేసి సద్వినియోగం చేస్తున్నారా అంటే అదీలేదు. ఎక్కువ భాగం ధనవంతులయిన హైందవ ఆధిపత్యకుల వ్యాపారస్తుల చేతిలోకి పోయింది. క్రీస్తు సువార్త ప్రచారంతో గానీ పంఘు సేవతోగానీ సంబంధం లేని వ్యాపారులకు వ్యవహారాలకు ఉపయోగపడుతూ ఉంది.

ఇది ఏ విధంగా జరిగింది? అసలు ఈ ఆస్తుల యజమాని ఎవరు? వారి యాజమాన్య హక్కు ఏపాటిది ? ఇష్టమొచ్చినట్టు అమ్ముకునే హక్కు వారికి ఉందా? వారు ఇష్టమొచ్చినట్టు అమ్ముకుంటుంటే క్రైస్తవ ప్రజానీకం ఏం చేస్తున్నారు? సువార్త ప్రచారం కోసం, సంఘసేవ కోసం మిషనరీల చేతిలోకిపోయిన సామాజిక పంపద ఈ విధంగా కొద్దిమంది స్వంత ఆస్తిగా మారుతుంటే సమాజం ఏంచేస్తూ ఉంది? ప్రభుత్వం ఏంచేస్తూ ఉంది?

ఈ ఆస్తుల చరిత్ర కొంచెం చెప్పుకుందాం.

అమెరికన్ బ్యాప్టిస్ట్ ఫారిన్ మిషన్ సొసైటీ (ఎబిఎఫ్ఎంఎస్) కి చెందిన మిషనరీలు 1813 లో దక్షిణ భారత దేశానికి వచ్చారు. వారి కేంద్రం మద్రాసు. తమిళ ప్రాంతంలో కూడ వారు కృషి చేసారు కానీ వాళ్ళు ప్రధానంగా దృష్టి పెట్టింది మద్రాసు రాష్ట్రంలోని తెలుగు మాట్లాడే ప్రాంతాల మీద 'సువార్త సేవా కార్యక్రమాలు' నెల్లూరు, కర్నూలు పట్టణాలలో మొదలు పెట్టి కాలక్రమంలో ప్రస్తుత నెల్లూరు, కర్నూలు, ప్రకాశం, గుంటూరు, కృష్ణ, ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాలకు వ్యాపింప జేసారు. కర్నూలు పట్టణంలో బాప్టిస్టు మిషనరీల సంఘసేవ 1876లో మొదలయింది. 1890లో ఒక అనాధబాలల వసతి గృహం, సవర్ణ హైందవ బాలికలకు ఒక పాఠశాల (కాస్ట్ గరల్స్ హై స్కూల్) 1902లో కోల్స్ మెమోరియల్ ఉన్నత పాఠశాల, 1913లో కోల్స్ సెంటెనియల్ చర్చి, 1920లో చేతివృత్తులలోనూ, వ్యవసాయంలోనూ శిక్షణ ఇచ్చే రాక్‌వుడ్ మెమోరియల్ స్కూలు, 1924లో బాలికల కోసం ఎమిలీకోల్స్ మెమోరియల్ హై స్కూల్, 1969లో కోల్స్ మెమోరియల్ జూనియర్ కళాశాల, 1971లో ఎస్‌టిబిసి డిగ్రీ కాలేజి, ఆ తరువాత బాలురకొకటి, బాలికల కొకటి ఎలిమెంటరీ స్కూళ్ళు (1972 లేక 1973) స్థాపించారు. వీటిలో ఒక్కటి (కోల్స్ సెంటెనియల్ చర్చి) తప్ప మిగిలినవన్నీ విద్యాసంస్థలే. ఏ ఒక్కటీ క్రైస్తవులకు మాత్రమే పరిమితం కాదు. ఈ పాఠశాలలన్నిటికీ వసతి గృహాలు, ఆట స్థలాలు, పూదోటలు అనుబంధంగా ఉన్నాయి. ఈ పాఠశాలలకు మంచి విద్యాసంస్థలుగా పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. ఈ సమాజసేవలో కృషి చేసిన మిషనరీలు బాగ్స్, ఆర్థర్ స్టాంటన్, గిబ్సన్, రాక్‌వుడ్‌లు, దాతలయిన అక్కర్‌మాన్ కోల్స్, ఎమిలీ కోల్స్, మొదలయిన వారు పాఠశాలల పేర్లలో చిరస్థాయిగా నిలిచిపోయారు.

ఇతర పట్టణాలలో కూడ ఇదే రకమైన 'సువార్త వ్యాప్తి, సంఘసేవ' కొనసాగాయి.

భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత మిషనరీల కార్యకలాపాలకు కొంత బ్రేక్ పడింది. భారత ప్రభుత్వం వారిపైన నిషేధమేమీ పెట్టలేదు. అంతకు పూర్వం బ్రిటిష్ పాలకులు అన్ని సందర్భాలలో వారిని ఆదరించనూ లేదు. అయినప్పటికీ కొంత తేడా వచ్చింది. మరొక వైపు, మిషనరీలు గతంలో అధికంగా దృష్టి పెట్టిన విద్యావైద్య రంగాలను రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలననుసరించి భారత ప్రభుత్వం తన బాధ్యతగా స్వీకరించింది. అనేక మిషన్ సంస్థలను భారత ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నడపసాగింది. విద్యాసంస్థల విషయానికొస్తే, ఆంధ్రప్రదేశ్‌లో చర్చిలకు అనుబంధంగా ఉన్న విద్యాసంస్థలు తప్ప మిగిలిన మిషన్ స్కూళ్ళన్నీ 1957 లో పంచాయితి సమితుల చేతులలోకి పోయాయి. ఉదాహరణకు కర్నూలు జిల్లాలోని 100 స్కూళ్ళల్లో 15 మాత్రమే చర్చి చేతిలో మిగిలాయి.

అయినప్పటికీ 1974 నాటికి బాప్టిస్టు చర్చిల చేతిలో, పైన పేర్కొన్నట్టు, అపారమైన వెల గల భూములు, భవనాలు మిగిలి ఉన్నాయి. 1974 లో అమెరికన్ మిషనరీలు భారత దేశాన్ని విడిచి పెట్టి వెళ్ళి పోవాలని నిర్ణయించుకున్నారు. అప్పటి వరకు వాళ్ళ ఆధీనంలో ఉన్న ఆస్తులను, వాటి నిర్వహణను, ఎవరికి అప్పగించి పోవాలి అన్న ప్రశ్న వచ్చింది.

అప్పటికే బాప్టిస్టు చర్చిలకు సంబంధించి ఒక నిర్మాణం ఏర్పడి ఉంది. ప్రతీ చర్చినీ ఒక 'సంఘం' అంటారు. ఒక చర్చి పరిధిలో కొన్ని గ్రామాలు ఉంటాయి. గ్రామాలలో పాస్టర్లు లేని చిన్న చర్చిలు ఉంటాయి. వీటిని 'సభలు' అంటారు. ఇవన్నీ 'సంఘం' లో భాగమే.

సాధారణంగా ప్రతి చర్చికి అనుబంధంగా ఒక స్కూలు ఉంటుంది. ఆ చర్చి పరిధిలో నివసించే బాప్టిస్టు క్రైస్తవులంతా ఆ 'సంఘం' సభ్యులే. ఈ సంఘం చర్చికి పాస్టర్‌ను నియమిస్తుంది. చర్చి నిర్వహణకు అవసరం అయిన ఇతర అధికారులను కూడ నియమిస్తుంది. కొన్ని సంఘాలు కలిసి ఒక ఫీల్డ్ (తెలుగు లో 'పొలము') ఏర్పడుతుంది. ఉదాహరణకు కర్నూలు ఫీల్డు

(పాలము) లో ప్రస్తుత కర్నూలు జిల్లా లోని డోన్, కర్నూలు, నందికొట్కూరు, కోడుమూర్, పత్తికొండ, ఎమ్మిగనూరు తాలూకాలలోని చర్చిలు (పంఘాలు) అన్నీ ఉన్నాయి.

పాలము జనరల్ బాడీనీ 'సమాజం' అంటారు. ఒక్కొక్క సంఘం (అంటే ఒక్కొక్క చర్చి) సంబంధిత పాలము సమాజానికి ప్రతినిధులను ('రాయబారులను') ఎన్నకుంటుంది. నూటికి ఇద్దరు చొప్పున, మొత్తం ఆరుగురిని మించకుండ ఒక్కొక్క పంఘము పాలము సమాజమునకు రాయబారులను పంపిస్తుంది. ఇందులో ఇద్దరు గ్రామీణ సభలనుండి వస్తారు. వారు కాక ప్రతీ పాస్టరు, ప్రతీ రిటైర్డు పాస్టరు, చర్చిఅనుబంధ స్కూళ్ళ ఉపాధ్యాయులు పాలము సమాజము శాశ్వత సభ్యులుగా ఉంటారు. ప్రతీ సంఘము పాలము పమాజమువకు సంవత్సర వందా చెల్లించవలసి ఉంటుంది. పాలము సమాజం సమావేశము 3 నెలల కొకసారి జరుగుతుంది. సంవత్సరానికి ఒకసారి ఎన్నికలు జరుగుతాయి.

ఈ పాలము సమాజముల పైన తెలుగు బాప్టిస్టు సంఘముల చర్చిల సమావేశం (ఎస్‌టిబిసి) ఉంటుంది. దీని జనరల్ కౌన్సిల్‌కు రాష్ట్రంలోని ప్రతీ పాలము సమాజం నుండి ఎన్నుకోబడిన డెలిగేట్లు వస్తారు. ఈ ఎన్నిక మూడేళ్ళ కొకసారి జరగాలి. ఈ ఎస్‌టిబిసి అనేది తెలుగు బాప్టిస్టుల అత్యున్నత సంస్థ.

కర్నూలు పాలము సమాజము 1945 లో ఒక సొసైటీగా రిజిస్టర్ అయింది. 'దేవుని సువార్తను వ్యాపింపజేయుట, పాఠశాలలు స్థాపించుట' దాని ముఖ్యలక్ష్యాలు అందు కోసం పాలములోని ప్రతి చర్చికి పాస్టర్లను నియమించడం, పాఠశాలలకు టీచర్లను నియమించడం, దాని కోసం డబ్బు పోగుచేయడం, క్రైస్తవుల 'నైతిక, ఆత్మీయ, మానసిక' జీవితాభివృద్ధిని కాపాడడం, దాని అనుబంధ లక్ష్యాలు. ఈ పమాజానికి అధ్యక్ష ఉపాధ్యక్ష తదితర పాలనావర్గం బాధ్యులు ఉంటారు. ఒక కార్యనిర్వాహక కమిటీ, ఒక

కాపర్లకమిటీ, ఒక నామకరణ కమిటీ, ఒక మదింపు కమిటీ, ఒక ఆడిట్ కమిటీ, ఒక ప్రాపర్టీ కమిటీ ఉంటాయి. ఈ కమిటీలలో పాస్టర్లే మెజారిటీగా ఉంటారు.

పాలము సమాజం ఆస్తులేవి అమ్మే విషయం స్పష్టంగా లేదుగానీ, ఉండే ఆస్తి పాస్తులను 'సేకరించి భద్రపరుచుట, ఉపయోగించుట, విక్రయించుట, పూచీవహించుట' పాలము సమాజానికి ఉండే అధికారాలని దాని నియమావళిలో ఈ మధ్యనే రాసుకున్నారు (నిబంధన 12(3)). అయితే సమాజము జనరల్‌బాడీ తీర్మానము మేరకు మాత్రమే ఈ క్రయవిక్రయాలు కార్యనిర్వాహక కమిటీ చేపట్ట వచ్చునని నిబంధన13(9) అంటుంది. 1980 తరువాత, కర్నూలు పాలములోని (అంటే కర్నూలు జిల్లాలోని) అన్ని చర్చిల ఆస్తులు పాలము సమాజం ఆస్తులేననీ వాటిని ఇష్టప్రకారం పాలము సమాజం అమ్ముకోవచ్చుననీ, క్రయవిక్రయాల కోసం ఎవరికయిన పవర్ ఆఫ్ అటార్నీలు ఇయ్యవచ్చుననీ పాస్టర్లు దబాయించసాగారు. కర్నూలులో జరిగిన అమ్మకాలు అత్యధికంగా ఈ రకంగానే జరిగాయి. ఈ వాదన చెల్లుతుందా? చెల్లదు. పాలము సమాజంలోని సంఘములు (చర్చిలు) చెల్లించే వార్షికచందాలు, పాలము సమాజము కొనుగోలు చేసే ఆస్తులు (ఏవైయినా ఉంటే) మాత్రమే పాలము సమాజం ఆస్తులు. మిషనరీలు సేకరించి పోయిన ఆస్తులపైన పాలము సమాజమునకు హక్కులు లేవు. మిషనరీలు ఉన్నప్పుడూ లేవు. ఆ తరువాత కూడ లేవు. ఇది ఎందువల్లనో దిగువ చూద్దాం.

పాలము సమాజముల కూడిక అయిన తెలుగు బాప్టిస్టు సంఘముల సమావేశం (ఎస్‌టిబిసి) బాప్టిస్టు క్రైస్తవుల అత్యున్నత సంస్థ అని చెప్పాము. అయితే చర్చి ఆస్తులపైన దీనికి ఉన్న అజమాయిషీ కూడ స్వల్పమే ఎస్‌టిబిసి జనరల్ కౌన్సిల్‌లో ప్రతీ పాలము సమాజం నుండి ఎన్నుకోబడిన ప్రతినిధులుంటారు. అందులో సగం సంఖ్య నామినేటెడ్ ప్రతినిధులు కూడ

ఉంటారు. ఎస్‌టిబిసి కి యధావిధిగా ఒక పాలక వర్గం, కార్యనిర్వాహక వర్గం, వివిధ కమిటీలుంటాయి, వాటిలో ఒకటి ప్రాపర్టీ కమిటీ (ఆస్తుల కమిటీ). బాప్టిస్టు చర్చిల ఆస్తుల క్రయవిక్రయాలకు సంబంధించి సూచనలు రూపొందించి జనరల్ కౌన్సిల్‌కు సమర్పించడం ఈ ప్రాపర్టీ కమిటీ పని. జనర్ కౌన్సిల్ ఆ సూచనలను పరిశీలించి తన అభిప్రాయం తెలియజేస్తూ మిషన్ నిర్వాహకులయిన అమెరికన్ బాప్టిస్టు ఫారెన్ మిషన్ సొసైటీకి పంపిస్తుంది. వారు దానిపైన నిర్ణయం తీసుకున్న తరువాత ఆ విషయాన్ని ప్రాపర్టీ కమిటీకి తెలియజేస్తే, ఆ ప్రకారం క్రయవిక్రయాలు చేయడం ప్రాపర్టీ కమిటీ బాధ్యత. కాబట్టి పాలము సమాజములకు కాదుకదా, వాటి అత్యున్నత సంస్థ అయిన ఎస్‌టిబిసి కి సహితం తొలినాడు బాప్టిస్టు క్రైస్తవ ఆస్తులపైన యజమాన్య హక్కు లేదు. దాని బాధ్యత 'సువార్త ప్రచారం, సమాజ సేవ' అనే లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని చర్చి వ్యవహారాలు నిర్వహించడం మాత్రమే. ఆస్తులపైన యాజమాన్యం ఉండేది అమెరికన్ బాప్టిస్టు ఫారెన్ మిషన్ సొసైటీకి మాత్రమే.

ఇది 1974 దాకా ఉన్న పరిస్థితి.

1974 లో అమెరికన్ మిషనరీలు శాశ్వతంగా భారత దేశం విడిచి పెట్టి వెళ్లిపోయారు. పోయేటప్పుడు తాము సంపాదించి పెట్టిన బాప్టిస్టు క్రైస్తవ ఆస్తులను ఏం చేయాలనే ప్రశ్న వాళ్ల ముందుకు వచ్చింది. ఒక్కొక్క చర్చి పరిధిలోవున్న ఆస్తులను ఆ చర్చి కమిటీ పేరిట రిజిస్టర్ చేసి పోవచ్చును. లేదా ఒక పాలము (ఫీల్డ్) పరిధిలో ఉన్న ఆస్తులను ఆ పాలము సమాజము (ఫీల్డ్ అసోసియేషన్) పేరిట రిజిష్టర్ చేసి పోవచ్చును. లేదా మొత్తంగా రాష్ట్రంలో ఉన్న ఆస్తులన్నిటినీ ఎస్‌టిబిసి పేరిట రిజిస్టర్ చేసి పోవచ్చును. ఎక్కడికక్కడ ఆస్తుల నిర్వహణ బాధ్యత స్థానిక సంస్థల చేతిలో ఉండడమే మంచిదని మిషనరీలు భావించినట్టున్నారు. అయితే నేరుగా చర్చిలకు గానీ పాలము సమాజాలకు గానీ వాటిని అప్పగించి రిజిస్టర్ చేసేటట్టయితే

ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ ఫీజు పెద్ద మొత్తములో చెల్లించవలసి ఉంటుంది. ఎస్‌టిబిసి పేరిట రిజిస్టర్ చేసినా అంతే. ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసి ఉండవచ్చునేమో, కానీ అమెరికన్ మిషనరీలు నేరుగా ఆ పనిచేయకుండ ట్రస్టీ స్వభావం గల కంపెనీని ఏర్పాటు చేసి ఆస్తులన్నీ దానికి అప్పగించి పోయారు. అదే పిఎబిసి.

అమెరికన్ బాప్టిస్టు ఫారెన్ మిషన్ సొసైటీ అమెరికాలో ఒక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా రిజిస్టర్ అయివుంది. దాని భారతదేశ శాఖ మద్రాసులో ఒక విదేశీ కంపెనీగా భారత కంపెనీల చట్టం కింద రిజిస్టర్ అయివుంది. కాబట్టి ఇక్కడ ఎస్‌టిబిసితో నిర్మాణపరంగా ముడిపడి ఉన్న మరొక కంపెనీని నెలకొల్పి తమ కంపెనీని ఆ కంపెనీలో విలీనం చేసేస్తే, ఖర్చు లేకుండ ఆస్తుల బదలాయింపు జరిగిపోతుందని వాళ్లు ఆలోచించారు. ఆ కొత్త కంపెనీ లక్ష్యాలలోనే, ఆ ఆస్తిని కాలక్రమంలో ఆయాప్రాంతాలలో ఏర్పడే స్థానిక బాప్టిస్టు సమావేశాలకు బదలాయించాలని రాసేస్తే, ఈ కేంద్రీకరణ కూడ క్రమంగా పోతుందని ఆశించారు.

ఇందుకోసం వారు తమ 'శ్రేయోభిలాషులు' సభ్యులుగాగల ప్రాపర్టీ అసోసియేషన్ ఆఫ్ బాప్టిస్ట్ చర్చిస్ (పిఎబిసి) అనే ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని మద్రాసులో రిజిస్టర్ చేయించారు. ఎస్‌టిబిసి ప్రాపర్టీ కమిటీ సెక్రెటరీ అయిన రెవరెండ్ పులుకూరి సదానందం ఈ పిఎబిసి మొదటి సెక్రెటరీ. పిఎబిసి నియమాల ప్రకారమే దాని సభ్యులలో ఎస్‌టిబిసి అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కోశాధికారి ఉంటారు. (ఇంకా ఇతరులు 17 మంది కూడ ఉంటారు)

ఈ విధంగా కృత్రిమంగా ఏర్పడిన పిఎబిసి అనే కంపెనీతో ఎ.బి.ఎఫ్.ఎం.ఎస్. యొక్క భారతదేశ శాఖను మద్రాసు హైకోర్టులో వేసిన అమాల్గమేషన్ (విలీన) పిటిషన్ ద్వారా 1974 లో విలీనం చేసారు. ఖర్చులేకుండ తమ విస్తారమయిన ఆస్తులను తెలుగు బాప్టిస్టుల చేతిలో పెట్టి అమెరికా మిషనరీలు వారి దేశం వెళ్లిపోయారు. ఆ తరువాత బాప్టిస్టు క్రైస్తవ చర్చిల ఆస్తులు అమ్ముకునే హక్కు ఉన్నది పిఎబిసికి మాత్రమే. అదయినా ఏమేరకు ఉందో దిగువ చూద్దాము. వేరే ఎవ్వరికీ - వాళ్ల పొలము సమాజము ప్రతినిధులుగానీ, ఎస్‌టిబిసి కార్యనిర్వాహక వర్గం గానీ, సకల బాప్టిస్టు క్రైస్తవులు ఏకగ్రీవంగా సంతకం చేసి ఇచ్చిన పవర్ ఆఫ్ అటార్నీ గ్రహీతలేగానీ - ఆ హక్కులేదు. అమెరికా మిషనరీలు ఆ ఆస్తులను తెలుగు బాప్టిస్టులకు అప్పగించింది పిఎబిసి ద్వారానే తప్ప వేరే ఏ రకంగానూ కాదు. పిఎబిసి షేర్ హోల్డర్లయిన ఎస్‌టిబిసి కార్యనిర్వాహక అధికారుల ద్వారానే బాప్టిస్టు క్రైస్తవ ఆస్తులపైన బాప్టిస్టు క్రైస్తవులకు అజమాయిషీ ఉంటుంది. వేరే ఏ రకంగానూ ఉండదు.

పిఎబిసి ఏర్పడిన సంగతి, చర్చి ఆస్తులన్నీ దానిలో విలీనం అయిన సంగతి తమకు తెలియనే తెలియదని కర్నూలు పొలము సమాజం ప్రతినిధులు ఆ తరువాతి కాలంలో కోర్టు ముందు వాదించారు. అది నిజమయ్యే అవకాశం లేదు. పొలము సమాజాలే ఎస్‌టిబిసి జనరల్ కౌన్సిల్‌కు ప్రతినిధులను పంపిస్తాయి. ఆ జనరల్ కౌన్సిల్ ఎన్నుకునే ఎస్‌టిబిసి పాలకవర్గం పిఎబిసి సభ్యులు (షేర్ హోల్డర్లు) అవుతారు. పైగా ఎస్‌టిబిసి లోనూ పిఎబిసిలోనూ 1980 తరువాత కొట్లాటలు వచ్చి చీలికలు ఏర్పడ్డాయి. కోర్టు కేసులు నడిచాయి. ఇరువర్గాల నాయకులు పై నుండి కింది దాకా గ్రూపులు కట్టారు. ఒకరినొకరు దూషించుకుంటూ ప్రచారం చేసుకున్నారు. సమాంతర జనరల్ కౌన్సిళ్లు నిర్వహించారు. ఇదంతా జరుగుతుండగా పిఎబిసి అనేది ఒకటి ఉందనే కర్నూలు పొలము సమాజం పాస్టర్లకూ ప్రతినిధులకూ తెలియలేదంటే నమ్మడం కష్టం.

## III

పిఎబిసి కయినా తన నిర్వహణలోని బాప్టిస్టు ఆస్తుల అమ్మకం విషయంలో ఏపాటి అధికారం ఉంది?

పిఎబిసి ఒక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ. ఒక కంపెనీ కార్యకలాపాలకు గీటురాయి దాని వ్యవస్థాపక లక్ష్యాల జాబితా (మెమొరాండం ఆఫ్ అసోసియేషన్), దాని వ్యస్థాపక నియమాల జాబితా (ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్). ఈ లక్ష్యాలకు, వ్యవహార నియమాలకు లోబడి మాత్రమే కంపెనీ తన వ్యవహారాలు నిర్వహించాలి. కంపెనీకి లక్ష్యాలు దేశానికి రాజ్యాంగం లాంటివని చట్టం అంటుంది. అంటే అవి అనుల్లంఘనీయం అని అర్థం. లక్ష్యాల జాబితాను అతిక్రమించి ఒక కంపెనీ ఏపని చేసినా అది చెల్లదు. కంపెనీ అనేది ప్రైవేట్ వ్యక్తి లాంటిది కాదు - తన ఆస్తిని తాను ఏమయినా చేసుకోవచ్చునని వాదించడానికి. 'అది పిఎబిసి ఆస్తి. పిఎబిసి అమ్మింది, నేను కొనుక్కున్నాను' అంటే సరిపోదు. ఆ అమ్మకం పిఎబిసి వ్యవస్థాపక లక్ష్యాలకు అనుగుణంగా ఉంటేనే ఆ అమ్మకం, ఆ కొనుగోలు చెల్లుతాయి. లేకుంటే చెల్లవు.

పిఎబిసి లక్ష్యాలేమిటి?

చట్టం కంపెనీల లక్ష్యాలలో రెండు రకాలను గుర్తిస్తుంది. వీటిని ప్రధాన లక్ష్యాలు, అనుబంధ లక్ష్యాలు అంటారు. ప్రధాన లక్ష్యాలు కంపెనీ వ్యవహారాలను నిర్దేశిస్తాయి. వాటి కోసమే ఆ కంపెనీ పనిచేయాలి. వాటి వెలుగులోనే తన లావాదేవీలు నిర్వహించాలి. అనుబంధలక్ష్యాలు ప్రధాన లక్ష్యాలకు అనుబంధమైనవి. అవి స్వతంత్రమైన లక్ష్యాలు కావు. అనుబంధ లక్ష్యాల పేరిట కొత్త లక్ష్యాలు ప్రవేశపెట్టడానికి వీలు లేదని చట్టం అంటుంది. వాటిని స్వతంత్ర లక్ష్యాలుగా ఎంచి వ్యవహరించడాన్ని చట్టం ఒప్పుకోదు.

పిఎబిసి లక్ష్యాలలో ప్రధాన లక్ష్యాలు, అనుబంధ లక్ష్యాలు విడివిడిగా పేర్కొనబడ్డాయి. మొదటివి ఆర్టికల్ 3(A) లో రెండవ లక్ష్యాలు 3(B) లో పేర్కొనబడ్డాయి. 'చర్చి ఆస్తులను అమ్మడానికి, కుదువ పెట్టడానికి, అద్దెకు ఇవ్వడానికి, వేరే ఏరకంగానయినా అన్యాక్రాంతం చేయడానికి, పిఎబిసికి అధికారం ఉందని ఆర్టికల్ 3(B)(F) అంటుంది. అంటే ఈ అధికారం అనుబంధ లక్ష్యాలలో చేర్చబడింది. ఈ 'అమ్ముకోవడం, కుదువ పెట్టడం' అనేది సంస్థ ప్రధాన లక్ష్యాలలో ఒకటి కాదు. అది ప్రధాన లక్ష్యాలకు అనుబంధంగానే సాగాలి. అంటే ప్రధాన లక్ష్యాల సాధనకు అవసరం అయిన మేరకే ఆస్తులను అమ్ముకునే హక్కు పిఎబిసికి ఉందని దాని వ్యవస్థాపక లక్ష్యాల జాబితా స్పష్టం చేస్తుంది.

మరయితే పిఎబిసి ప్రధాన లక్ష్యాలు ఏమిటి? తెలుగు బాప్టిస్టు సంఘముల సమావేశానికి (ఎస్‌టిబిసికి) చెందిన చర్చిలు ద్వారా జరిగే 'సువార్త వ్యాప్తి, సంఘసేవ' లకు తోడ్పడడం; ఇతర బాప్టిస్టు, బాప్టిస్టేతర చర్చిల ఆధ్వర్యంలో జరిగే 'సువార్త వ్యాప్తి, సంఘసేవ' లకు తోడ్పడడం, ప్రత్యేకించి స్కూళ్లు, హాస్టళ్లు, ఆస్పత్రులు, పరిశ్రమలు, అనాధ శరణాలయాలు, శరణార్థుల సహాయ కార్యక్రమాలు మొదలయిన వాటికి ఆర్థికంగాను, ఇతరత్రా తోడ్పడడం; కంపెనీ లక్ష్యసాధనకోసం ఆస్తులు సేకరించి వాటి విషయంలో ట్రస్టీగా లేక ప్రతినిధిగా వ్యవహరించడం; చర్చిలు, శ్మశాన వాటికలు, ఆస్పత్రులు, స్కూళ్లు, కాలేజీలు, అనాధశరణాలయాలు మొదలయిన వాటికి అవసరం అయ్యే కట్టడాలు నిర్మించడం; ఇవి పిఎబిసి ప్రధాన లక్ష్యాలలో ముఖ్యమైనవి అని ఆ సంస్థ వ్యవస్థాపక లక్ష్యాలలోని ఆర్టికల్ 3(A) అంటుంది.

ఈ ప్రధాన లక్ష్యాలకు అనుబంధంగా చేపట్టగల మరికొన్ని పనులను 3(B) వివరిస్తుంది. అందులో ఆస్తులు అమ్మడం, లీజు ఇవ్వడం, కుదువ పెట్టడం మొదలయినవి ఉన్నాయి. అంటే ప్రధాన లక్ష్యాలకు తోడ్పడడం కోసం, వాటి అవసరాల కోసం, జరిగే అమ్మకాలు మాత్రమే చెల్లుతుంది తప్ప ఆస్తులను అమ్మి వ్యాపారం చేయడం పిఎబిసికి ఒక స్వతంత్ర లక్ష్యం కాజాలదు. అంతేకాదు ప్రధాన లక్ష్యాల సాధనతో నిమిత్తం లేని అమ్మకాలు - అవి వ్యాపార రీత్యా ఎంత లాభసాటిగా ఉన్నప్పటికీ, ఇతరత్రా ఎంత హేతుబద్ధంగా కనిపించినప్పటికీ - చెల్లదు.

ఇప్పటి వరకు వివిధ కోర్టులలో జరిగిన వాదనలలో ఈ విషయం స్పష్టంగా బయటకు రాలేదు. పిఎబిసి చర్చి ఆస్తుల క్రయవిక్రయాలలో సహేతుకమైన వ్యాపార నియమాలను అనుసరించిందా లేక విచ్చల విడిగా వ్యాపారం చేసిందా అన్న అంశం చర్చకు వచ్చిందే తప్ప, అసలు పిఎబిసి చర్చి ఆస్తుల అమ్మకాన్ని ఏ పరిధిలో చేపట్టవచ్చునన్న విషయం చర్చకు రాలేదు. ఆ పరిధి ఏమిటో ఆ సంస్థ వ్యవస్థాపక లక్ష్యప్రకటన చెప్తుంది. పిఎబిసికి తన ఆధ్వర్యంలో ఉన్న చర్చి ఆస్తులను లాభసాటిగా అమ్మిడబ్బు పోగుచేసుకునే స్వేచ్ఛ లేదు. అమ్ముకునే అధికారం, లీజుకు ఇచ్చే అధికారం దానికి ఉన్నాయి. అయితే ఆ అధికారం అనుబంధ లక్ష్యాలలో ఉంది. అదొక స్వతంత్ర వ్యవహారం కావడానికి వీలులేదు. అదే దాని వ్యాపారం కావడానికి అసలే వీలులేదు. ప్రధాన లక్ష్యాలైన సువార్త ప్రచారం, సంఘసేవ (స్కూళ్ళు, హాస్టళ్ళు, ఆస్పత్రులు, అనాథ శరణాలయాల నిర్వహణ) కు అనుబంధంగా, మాత్రమే ఆస్తుల అమ్మకం, లీజు, జరగాలి.

చెప్పుకోదగ్గ విషయం ఏ మిటంటే పిఎబిసి వ్యవస్థాపక లక్ష్యాలలో ఆస్తుల అమ్మకంపైన పరిమితులు ఉన్నాయి గానీ కొనుగోలు పైన లేవు. ఆస్తులను కొనుక్కోవడం, దానంగా తీసుకోవడం, దానంగా తీసుకున్న ఆస్తులకు ట్రస్టీగా వ్యవహరించడం, పిఎబిసి ప్రధాన లక్ష్యాలలోనే ఉన్నాయి. కానీ ఆస్తులను అమ్మే అధికారం మాత్రం ప్రధాన లక్ష్యాలలో పేర్కొనబడలేదు.

అది అనుబంధ లక్ష్యాలలోనే ఉంది. దీనిని బట్టి ఈ కంపెనీ సంస్థాపకుల ఉద్దేశ్యం స్పష్టంగా అర్థం అవుతుంది. పిఎబిసిని ఏర్పాటు చేసింది 'సువార్తప్రచారం, సంఘసేవ' అనే రెండు లక్ష్యాల సాధన కోసం. దాని కోసం కొంత ఆస్తిని పిఎబిసి కి ఇవ్వడం జరిగింది. ఆ ఆస్తిని అది సద్వినియోగం చేయాలి. అంటే సువార్త ప్రచారం కోసం, సంఘసేవ కోసం వినియోగించాలి. ఈ లక్ష్యం ఇంకింత బాగా నెరవేర్చడానికి పిఎబిసి తన ఆస్తులను పెంచుకునే ప్రయత్నం చేయాలి. దానాలు కోరాలి. స్వీకరించాలి. చందాలు సేకరించి భూములు, భవనాలు కొనాలి. అంతే తప్ప క్రయవిక్రయ వ్యాపారం చేయకూడదు. అది లాభసాటి వ్యాపారమే అయినా, దానివల్ల మిగులే వచ్చినా, ఆస్తుల క్రయవిక్రయ వ్యాపారం పిఎబిసి కర్తవ్యాలలో ఒకటి కాదు. ఆస్తులను 'సువార్త ప్రచారం కోసం, సంఘసేవ కోసం' వినియోగించాలి. అందుకోసం ఆస్తులు పెంచుకోవాలి. దానాలు స్వీకరించాలి. చందాలు సేకరించాలి. 'సువార్త ప్రచారం, సంఘసేవ'ల కోసం ఉపయోగపడుతున్న సంస్థల నిర్వహణకు తాను ట్రస్టీగా వ్యవహరించాలి. అదే పిఎబిసి కర్తవ్యం.

అయితే తన ఆస్తులను తన ప్రధాన లక్ష్యాల కోసం సమర్థవంతంగా వినియోగించడం కోసమే అప్పుడప్పుడు కొంత భాగాన్ని అమ్మడం, లేదా లీజుకు ఇవ్వడం అనివార్యం కావచ్చు. నిర్వహణ ఖర్చులకు ఇతరత్రా వచ్చే ఆదాయం సరిపోకపోయినప్పుడు కొంత భూమిని, లేక బిల్డింగులను లీజుకు ఇయ్యవలసిరావచ్చు. పాడయిపోతున్న ఆస్తిని వదిలించుకోవడం కోసం అమ్మడమో లేక లీజుకు ఇవ్వడమో చేయవచ్చును. వినియోగంలో పెట్టలేని ఆస్తులను దురాక్రమణ నుండి కాపాడడానికి కూడ అన్యమార్గం లేకపోతే అటువంటి చర్యలు చేపట్టవలసి రావచ్చును. దీనికి కావలసిన స్వేచ్ఛ కంపెనీకి అవసరం అవుతుంది. తన ప్రధాన లక్ష్యాలను సమర్థవంతంగా నెరవేర్చడం కోసమే అది అవసరం. అందువల్ల కంపెనీ వ్యవస్థాపకులు దీనిని ఆర్టికల్ 3(B)లో ఒక అనుబంధ లక్ష్యంగా చేర్చారు. అయితే అమ్మకాన్నే ఒక స్వతంత్ర వ్యవహారంగా చేపట్టడానికి వీలులేదు. క్రయవిక్రయ వ్యాపారం చేయడానికి

అసలే వీలులేదు. అమ్మకం ఎప్పుడు చేసినా సంస్థ ప్రధాన లక్ష్యంతో దానిని అనుసంధానం చేసి చూడాలి. ఆ రకంగా చూసినప్పుడు అది సమర్ధనీయమయితేనే ఆ అమ్మకం చెల్లుబాటవుతుంది. లేకపోతే కాదు. పిఎబిసి 1974 తరువాత చేసిన అమ్మకాలను ఈ దృష్టితో చూడవలసి ఉంటుంది. అమ్ముడు పోతున్నది విలువయిన ప్రజా ఆస్తులు కాబట్టి ఇది మరీ అవసరం. అప్పగించిన ఆస్తులతో వ్యాపారంచేసి తద్వారా వచ్చిన లాభాలతో సువార్త ప్రచారం , సంఘసేవ నిర్వహించాలన్నదే పిఎబిసి వ్యవస్థాపకులయిన మిషనరీల ఉద్దేశ్యం అయివుంటే ఆ సంస్థ లక్ష్య ప్రకటన భిన్నంగా ఉండేది. ఆ ఉద్దేశ్యానికి తగినట్లు ఉండేది. కానీ ఇప్పుడున్న పిఎబిసి వ్యవస్థాపక లక్ష్యాల ఉద్దేశ్యం అది కాదు.

మామూలు కంపెనీల విషయంలో అనుబంధ లక్ష్యాలకు ప్రధాన లక్ష్యాలకూ మధ్యనున్న సంబంధాన్ని చట్టంగానీ కోర్టులు గానీ మరీ ఇంత 'స్ట్రిక్ట్' గా వ్యాఖ్యానించవు. ఎందుకంటే మామూలు కంపెనీల విషయంలో ఈ నియమాల ఉద్దేశ్యం షేర్ హోల్డర్ల ప్రయోజనాలను కాపాడడం మాత్రమే. కంపెనీ అనేది ఒకరి స్వంత ఆస్తి కాదు. అది నలుగురి పెట్టుబడితో నడిచే సంస్థ. కాబట్టి దానిని నడిపించే వారిపైన చట్టం నిఘావేసి ఉంచుతుంది. ఏ మార్గదర్శక లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని షేర్‌హోల్డర్లు కంపెనీలో వాటాలు తీసుకుంటారో ఆ లక్ష్యాలను నిర్వాహకులు అధిగమించి నడుచుకోవడాన్ని చట్టం అనుమతించదు. అయితే షేర్‌హోల్డర్ల ప్రయోజనాలకు దెబ్బ తగలదనుకున్నప్పుడు కోర్టులు చట్టాన్ని కొంత ఉదారంగానే వ్యాఖ్యానిస్తాయి.

కానీ పిఎబిసి ఒక సాధారణ కంపెనీ కాదు. అది ఒక ట్రస్టీ దాని వ్యవస్థాపక లక్ష్యాలను చదివితే ఈ విషయం సులభంగానే అర్ధం అవుతుంది. తెలుగు బాప్టిస్టు సంఘముల సమావేశం అయిన ఎస్‌టిబిసి నిర్వహించే కార్యకలాపాలకు పిఎబిసి ఒక ట్రస్టీగా వ్యవహరిస్తుంది. ఎస్‌టిబిసి 'సువార్తప్రచారం, సంఘసేవ' అనే బాప్టిస్టు క్రైస్తవ కార్యకలాపాలను

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా నిర్వహించే అత్యున్నత సంస్థ. ఈ కార్యకలాపాల కోసం మిషనరీలు ఇచ్చిపోయిన ఆస్తులను దానికి అనుగుణంగా నిర్వహించే ట్రస్టీ పాత్ర పోషించే సంస్థ పిఎబిసి. పిఎబిసి వ్యవస్థాపక లక్ష్యాలను వ్యాఖ్యానించుకుంటే వాటి అర్థం ఇదేనని స్పష్టం అవుతుంది.

పిఎబిసిని ట్రస్టీగా అర్థం చేసుకున్నట్లయితే, దాని లక్ష్య ప్రకటనను గానీ, అందులో ప్రధాన లక్ష్యాలకు అనుబంధ లక్ష్యాలకూ మధ్యనున్న సంబంధాన్ని గానీ వ్యాఖ్యానించడంలో 'ఔదార్యానికి' తావు వుండదు. ట్రస్టీలు తాము నిర్వహించే ట్రస్ట్ లక్ష్యాలకు భిన్నంగా పోవడానికి ఎట్టి పరిస్థితిలోనూ వీలు లేదు. ఇక్కడ చట్టం కాపాడేది కేవలం కంపెనీ షేర్ హోల్డర్ల ప్రయోజనాలను కాదు. ట్రస్ట్ లబ్ధిదారుల ప్రయోజనాలను కూడ కాపాడాలి. అందువల్ల ట్రస్టీల విషయంలో చట్టం మరింత కఠినంగా వ్యవహరిస్తుంది. పిఎబిసి అనే ఈ ట్రస్టీకి అప్పగించిన బాధ్యతకు లబ్ధిదారులు క్రైస్తవ మతం, సంఘసేవను అందుకునే ప్రజానీకం. సువార్త ప్రచారం, సంఘసేవ అనే లక్ష్యాలే లబ్ధిదారులు. వాటిని కాపాడడం చట్టం కర్తవ్యం. ఎందుకంటే ఈ ఆస్తిని మిషనరీలు ఇచ్చిపోయింది వాటి కోసం. వాటికి భిన్నమైన ప్రయోజనాల కోసం ఈ ఆస్తిని వినియోగిస్తే అది ఎట్టి పరిస్థితిలోనూ చెల్లదు. వాటితో నిమిత్తం లేని కారణాలు ఈ ఆస్తుల నిర్వహణలో చోటు చేసుకోవడానికి వీలు లేదు.

ఇచ్చిన ఆస్తులను కాపాడుకొని, పెంచుకోగలిగితే పెంచుకొని, సువార్త ప్రచారానికీ, సంఘసేవకు వినియోగించమనీ, దానికొక అనుబంధ కర్తవ్యంగా అవసరమైన మేరకు మాత్రం ఆ ఆస్తుల అమ్మకం లేక లీజు చేపట్టవచ్చుననీ ట్రస్ట్ లక్ష్యాలు చెప్తుండగా లాభసాటి అమ్మకాన్ని ఒక స్వతంత్ర లక్ష్యంగా ఎంచుతామని ట్రస్టీలు అనడానికి వీలులేదు. ట్రస్టీలు చేసే ప్రతీ అమ్మకాన్నీ ఈ దృష్టితోనే చూడాలి: అంతే తప్ప అమ్మకానికి సంబంధించిన సాంకేతిక నియమాలన్నింటినీ పాటించినట్లయితే ఆ అమ్మకం చెల్లుతుందని వాదించడానికి వీలు లేదు.

# IV

కర్నూలు పట్టణంలో బాప్టిస్టు క్రైస్తవ ఆస్తుల అమ్మకాలు జరిగిన క్రమాన్ని వివరించడం, ఆ అమ్మకాలు ఏమేరకు చెల్లుబాటు అవుతాయో చర్చించడం ఈ నివేదిక ముఖ్య లక్ష్యం. అయితే దానికి నేపధ్యంగా రాష్ట్రంలో బాప్టిస్టు చర్చి ఆస్తుల నిర్వహణలో 1979 తర్వాత నెలకొన్న సంక్షోభాన్ని తెలుసుకోవాలి.

1974లో చర్చి ఆస్తులు పిఏబిసి చేతిలోకి వచ్చి చేరిన వెంటనే అమ్మకాలు మొదలయ్యాయి. రాష్ట్ర వ్యాపితంగా జరిగాయి 1974 నుండి 1979 వరకు పిఏబిసికి డాక్టర్ యల్.ఎఫ్. నోల్(Dr L.F. Knoll) అధ్యక్షునిగా, రెవరెండ్ పి. సదానందం కార్యనిర్వాహక డైరక్టర్‌గా వ్యవహరించారు. డా॥ నోల్ అమెరికా దేశస్థుడు. 1974లో జరిగిన రెండు కంపెనీల అమాల్గమేషన్‌కు ముందు ఎబిఎఫ్ఎంఎస్ బాధ్యుడు. అమాల్గమేషన్ ఫలితంగా సకల బాప్టిస్టు క్రైస్తవ ఆస్తుల నిర్వహణ బాధ్యత పొందిన పిఏబిసికి ఆయన అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. అమాల్గమేషన్ జరిగిన వెంటనే, అంటే 1974 ఆగస్ట్ 5న, ఆయన అధ్యక్షతన జరిగిన పిఏబిసి మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం ఒక తీర్మానం చేసింది. దొనకొండ, గుంటూరు, దర్శి, గురజాల, వరంగల్, జనగాం, కందుకూరు, కనిగిరి, కావలి, మార్కాపురం, నెల్లూరు, ఒంగోలు, సూర్యాపేట, వినుకొండలలోని బాప్టిస్టు క్రైస్తవ ఆస్తులను అమ్మివేయడానికీ, అందుకోసం ఒక స్పెషల్ కమిటీని నియమించడానికీ, ఈ తీర్మానం మేనేజ్‌మెంట్ కమిటీకి అధికారం ఇచ్చింది. ఆ స్పెషల్ కమిటీ కూడ వెంటనే నియమించబడింది. దాని సభ్యులు డా॥ నోల్, రెవరెండ్ పి. సదానందం, రెవరెండ్ కె.సి. జార్జి, రెవరెండ్ విక్టర్ ఇమ్మాన్యువల్, శ్రీ ఎస్. బెంజమిన్ గారలు వీరి ఆధ్వర్యంలో ఎటువంటి కలహాలు లేకుండ పెద్ద ఎత్తున అమ్మకాలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లోని పై పట్టణాలలోనే కాక, మద్రాసు నగరంలో కూడ బాప్టిస్టు చర్చి ఆస్తులను పెద్ద ఎత్తున అమ్మారు. ఈ అమ్మకాలు ఎందుకు చేపట్టవలసి వచ్చింది?

"పిఎబిసి ఆధ్వర్యంలో అనేక కాలేజీలు, స్కూళ్ళు, హాస్టళ్లు, అనాధ శరణాలయాలు, ఆస్పత్రులు, క్లినిక్‌లు, పరిశ్రమలు, శరణార్థుల పునరావాస కార్యక్రమాలు నడుస్తున్నాయి. ఇది కాక ఇప్పటికి ఉన్న బాప్టిస్టు చర్చిల నిర్వహణ చూసుకోవాలి. కొత్త వాటిని చేపట్టాలి, సువార్త ప్రచారం చేపట్టాలి."

"అందువల్ల పిఎబిసి పైన పెనుభారం పడింది. పూర్వం ఎబిఎఫ్ఎంఎస్‌కు విదేశీ సహాయం లభించేది. అయితే విలీనం జరిగిన తరువాత పిఎబిసి తన కాళ్లపైన తాను నిలబడవలసి వచ్చింది. వనరులు సమీకరించుకోవలసి వచ్చింది. అందుకోసం తన ఆస్తులు అమ్ముకోవలసివచ్చింది. ఈ అమ్మకం ట్రస్ట్ ఆదాయాన్ని పెంచేటట్టయితే అమ్ముకోవడంలో తప్పు లేదు."

"నిరుపయోగంగా ఉన్న చర్చి ఆస్తులను దురాక్రమణదారుల బారి నుండి ఎట్లా కాపాడాలి అనే సమస్య డా॥ నోల్ ముందుకు వచ్చింది. దానికి తోడు పట్టణ భూపరిమితి చట్టం వేటును తప్పించుకోవలసి వచ్చింది. ఉపయోగించకుండ ఖాళీగా పడిఉన్న జాగాలను సంఘవ్యతిరేక శక్తులు ఆక్రమించుకుంటున్నారన్న వార్తలు చెవినపడిన డా॥నోల్ తదితర మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, ఆస్తులను రక్షించడానికి వేరే మార్గం లేదని భావించి, వాటిని అమ్మివేసి ట్రస్ట్ ఆదాయానికి జమ చేయాలని నిర్ణయించుకున్నారు. అమ్మకపోతే అవి దురాక్రమణదారుల పాలవుతాయి. పైగా, త్వరలో రాబోతున్న పట్టణ భూపరిమితి చట్టాన్ని గురించి కూడ వాళ్ళు భయపడ్డారు."

ఈ విధంగా, 1974 నాటి ఆ తీర్మానం సహేతుకమయినదేనని జస్టిస్ పున్నయ్య అభిప్రాయపడ్డారు. కంపెనీ పిటిషన్ 31/86 లో మద్రాసు హైకోర్టు ఆయనను ఆర్బిట్రేటర్‌గా నియమించింది. తన ఆర్బిట్రేషన్ రిపోర్టులో ఆయన ఈ మాటలు అన్నారు. 1974 నాటి తీర్మానంలో

కర్నూలు పట్టణానికి చెందిన బాప్టిస్టు చర్చి ఆస్తుల అమ్మకానికి అనుమతి లేదు కాబట్టి ఈ అభిప్రాయంతో ప్రస్తుత నివేదికకు ప్రమేయం లేదు. అయినప్పటికీ ఈ అభిప్రాయాన్ని పరిశీలించడం సమస్యను అర్థం చేసుకోవడానికి పనికి వస్తుంది.

పిఎబిసి వ్యవస్థాపక లక్ష్యాల ప్రకారం ఆస్తుల అమ్మకం ఆషామాషీగా చేపట్టగల వ్యవహారం కాదు. అది మత ప్రచారానికీ సంఘసేవకూ అనుబంధంగా మాత్రమే జరగాలి. అటువంటప్పుడు నిరుపయోగంగా ఉన్న ఆస్తులను సద్వినియోగం చేయడం సరయిన పద్ధతి అవుతుంది తప్ప 'దురాక్రమణ -దారుల బారి నుండి కాపాడడానికి అమ్మివేయాలి' అని నిర్ణయించడం సవ్యమైన నిర్ణయం కాదు. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో అమ్మడం తప్ప గత్యంతరం లేక పోవచ్చు. కానీ హోల్‌సేల్‌గా అమ్మకం చేపట్టడానికి అది సరయిన కారణం కాగలదా? దురాక్రమణదారుల బారి నుండి ట్రస్ట్ ఆస్తులను కాపాడడానికి ఉత్తమమైన మార్గం, వాటిని ట్రస్ట్ లక్ష్యాల కోసం వినియోగించడం. దానికి మార్గాలేవీ అన్వేషించకుండ అమ్మివేయడమే గతి అని మేనేజ్‌మెంట్ కమిటీ నిర్ణయించడం ఎంత వరకు సబబు? పైగా ఇది ఒక్క ఊరిలో ఒక్క ఎకరం భూమిని గురించి చేసిన తీర్మానం కాదు. 14 ఊర్లలో డజన్ల ఎకరాల భూమి గురించి టోకున ఒకేసారి చేసిన తీర్మానం. ఈ భూమి అంతటినీ వినియోగంలో పెట్టే మార్గం లేనేలేదని మేనేజ్‌మెంట్ కమిటీ వెలిబుచ్చిన అభిప్రాయాన్ని తరచి చూడవలసిన అవసరం లేదా?

పట్టణ భూపరిమితి చట్టం విషయం కూడ అంతే. ట్రస్ట్ లక్ష్యాలకు ఉపయోగపడుతున్న, లేక అవసరం అయిన భూములకు ఆ చట్టం మినహాయింపు ఇస్తుంది. కాబట్టి ఉపయోగంలో పెట్టడమే ఆ భూములను కాపాడుకోవడానికి సరయిన మార్గం. నిజానికి ప్రైవేట్ ఆస్తిపరులు చాలా మంది ఈ మినహాయింపును వాడుకొని తమ ఆస్తులను కాపాడుకోవడానికి

ట్రస్ట్‌లు ఏర్పాటు చేసుకుంటుండగా, ఒక ట్రస్ట్ తన ఆస్తులు కాపాడుకోవడానికి అమ్ముకోవడమే మార్గం అనడం హాస్యాస్పదం! ఈ మినహాయింపు గురించి 1974 లో ఒకవేళ అనుమానం ఉన్నా 1976 నాటికి ఆ చట్టం రూపం తీసుకుంది కాబట్టి ఆ తరువాతయినా ఈ మిష మీద జరిగిన అమ్మకాలు ఆగివుండాలి. కానీ 1979 దాకా డా॥ నోల్ దొరగారి ఆధ్వర్యంలో అమ్మకాలు సాగుతూనే ఉన్నాయి.

'ట్రస్ట్ ఆదాయాన్ని పెంచేటట్టయితే అమ్ముకోవడంలో తప్పులేదు' అన్న పున్నయ్యగారి అభిప్రాయం చాలా సందేహాస్పదమైనది. అది ఈ ట్రస్ట్ కుండే ప్రత్యేక లక్ష్యాలనూ వ్యవస్థాపక లక్ష్య ప్రకటననూ లెక్కలోకి తీసుకోని అభిప్రాయం. పిఐబిసికి మిషనరీలు భూములిచ్చింది అమ్ముకొని ఆదాయం పెంచుకొమ్మని కాదు. సువార్త ప్రచారానికీ, స్కూళ్లు, హాస్టళ్లు, ఆస్పత్రులు, అనాధశరణాలయాలు నిర్మించడానికి వినియోగించమని. ఈ అవసరాలన్నిటికీ భూములు కావాలి. ఇచ్చిన భూములు అమ్మేసుకుంటే మళ్లీ అవసరం వచ్చినప్పుడు కొనుక్కోవడం కష్టం.

ఆస్తులు అమ్ముకోవడం కంటే ట్రస్ట్ లక్ష్యాలకోసం సద్వినియోగం చేయడమే సమస్యకు సరయిన పరిష్కారం అని అంటే, ఆస్తులను సద్వినియోగ పరచడానికి పిఐబిసి దగ్గర డబ్బులు లేవనీ, అసలు ఇప్పటికే ఉన్న చర్చిలు, స్కూళ్ళు, ఆస్పత్రులు వగైరాలను నడపడానికి డబ్బులు లేకపోవడం కూడ ఈ అమ్మకాలకు ఒక కారణం అనీ పిఐబిసి ప్రతినిధులు ఆనాడు వాదించారు. ఈ వాదనను పున్నయ్యగారు తన రిపోర్టులో ఉటంకించారు. ఉటంకించడమే కాదు, పరీక్షించకుండ ఆమోదించారు కూడ.

ఈ వాదనను పరీక్షించడానికి పున్నయ్యగారు పిఐబిసికి ఉండే ఆదాయ వనరుల గురించి వారిని అడగవలసింది. సంపాదనకు పిఐబిసికి ఏయే వనరులున్నాయి? వాటి నుండి ఎంత ఆదాయం వస్తుంది? ఆస్తులు నిర్వహణ

ఖర్చు ఎంత అవుతుంది? ఒక వేళ తక్కువపడితే ఎంత ఆస్తి అమ్ముకోవలసి ఉంటుంది? ఈ ప్రశ్నలేవీ అడగకుండ, వీటి సమాధానాలను లెక్కలోకి తీసుకోకుండ పున్నయ్యగారు అమ్మకపు తీర్మానాన్ని ఆమోదించడం విచిత్రమే. అసలు విదేశీ డబ్బు సహాయమయినా ఆగిపోవలసిన అవసరం ఏ ముండింది? క్రైస్తవ సంస్థలకు వచ్చే విదేశీ నిధులపైన భారతప్రభుత్వం నిషేధం ఎప్పుడూ పెట్టలేదే. అమెరికా మిషనరీలు వెళ్ళి పోయినంత మాత్రాన అవి ఆగిపోవలసిన అవసరం ఏముంది? ప్రయత్నం చేస్తే సాధించడం కష్టమయ్యేదా? నిజానికి ఈ మధ్య కాలంలో కేవలం క్రైస్తవ సంస్థలకే కాక ఎవ్వరికయినా మనబోటి దేశాలలో సంఘసేవ చేయడానికి విదేశీ నిధులు పొందడం చాలా సులభం అయింది. మరి క్రైస్తవ సంస్థ అయిన పిఎబిసికి ఏం కష్టం వచ్చింది?

ప్రతి చర్చికి అనుబంధంగా కొంత వ్యవసాయ భూమి ఉంటుంది. అది హిందూ గుడుల మాన్యం లాంటింది. అంతే కాక, ప్రతి క్రైస్తవ ఉద్యోగి తన జీతంలో పదవ వంతు (దశమభాగం) చర్చికి చందాగా ఇవ్వాలి. ఇది కూడ చర్చికి ఆదాయంలో భాగం. అంతేకాక చాలా సేవాసంస్థలకు మిషనరీలో విడిగా డిపాజిట్లు నెలకొల్పారు. ఇదంతా కాక ఈ మధ్యకాలంలో అన్ని మిషన్‌స్కూళ్ళకూ ఆస్పత్రులకూ ప్రభుత్వ గ్రాంట్‌లు వస్తున్నాయి. నిర్వహణ ఖర్చులకు ఇవన్నీ చాలవా?

ట్రస్ట్ లక్ష్యాల పట్ల పిఎబిసి పాలక వర్గంలో ఆసక్తి లోపించడమే ఆస్తులు అమ్ముకోవాలన్న నిర్ణయానికి అసలు కారణమా? తెలుగు బాప్టిస్టు క్రైస్తవుల వ్యవహారాలపైన అజమాయిషి చేసిన ఆఖరి అమెరికన్ డా॥ నోల్. ఆయన గురించి కర్నూలుకు చెందిన ఒక బాప్టిస్టు క్రైస్తవ మేధావి వెలిబుచ్చిన అభిప్రాయాన్ని ఈ సందర్భంగా ఉటంకించక తప్పదు. ''డాక్టర్ నోల్ ధనిక వర్గానికి చెందిన వ్యక్తి. ఆయనకు పేదలంటే ప్రేమ లేదు'' అని ఆయన అంటారు. మిషనరీల ప్రకటిత లక్ష్యాలలో ఒకటయిన సంఘసేవ పట్ల ఈ

కారణంగా ఆయనకు ఆసక్తి లేకుండపోయిందా? అందువల్లనే ఈ దిక్కుమాలిన వాళ్లకోసం ఇంకొన్ని స్కూళ్ళు, ఆస్పత్రులు కట్టి అష్టకష్టాలు పడి వాటిని నడిపేకంటే ఆస్తులు అమ్మకొని డబ్బులు పోగుచేసి పిఎబిసి అకౌంట్‌లో జమచేసి, ఇప్పటికి ఉన్న సంస్థలను నడపడంతో సరిపెట్టుకోవడం ఉత్తమం అని ఆయన భావించాడా? లేకపోతే నిజంగానే సంఘసేవా కర్తవ్య నిర్వహణ అంత కష్టం అయి పోయిందా? కనీసం అమ్మిన ఆస్తుల ద్వారా వచ్చిన డబ్బులతో కొత్తగా స్కూళ్ళుగానీ ఆస్పత్రులు గానీ కట్టిన దాఖలాలు లేవే? అంత డబ్బా అప్పటికి ఉన్న సంస్థల నిర్వహణకే సరిపోయిందా? దీనికి సంబంధించిన ఆధారాలేవి చూపించకున్నప్పటికీ 1974 నాటి తీర్మానం ప్రకారం జరిగిన అమ్మకాలు సబబయినవేనని జస్టిస్ పున్నయ్యగారు భావించడం సరయినదేనా?

ఆయన పిఎబిసిని చర్చి ఆస్తుల ట్రస్టీగా గుర్తించినప్పటికీ, అమ్మకాల సవ్యతను నిర్ణయించేటప్పుడు ట్రస్ట్ వ్యవహారాల నిర్వహణకు సంబంధించిన ప్రమాణాలనెక్కడా లెక్కలోకి తీసుకోలేదు. ఒక సాధారణ కంపెనీని చూసినట్టే చూసారు.

పిఎబిసి 1974 నుండి చేపట్టిన అన్ని అమ్మకాలకూ ఈ చర్చ వర్తిస్తుంది. 1979 లో డా॥ నోల్ పిఎబిసి అధ్యక్షునిగా పదవీ విరమణ చేసారు. ఆయన స్థానంలో 1979 జులై 1న రెవరెండ్ బి.ఆర్ మోజెస్‌ను అధ్యక్షునిగా ఎన్నుకోవడం జరిగింది. ఆ తరువాత పిఎబిసి మేనేజ్‌మెంట్ కమిటీ మరికొన్ని ఆస్తుల అమ్మకానికి సంబంధించిన తీర్మానాలు చేసింది (నెం.46/79 నుండి 64/79 దాకా).

అయితే అప్పటి నుండి ఎస్‌టిబిసిలోను పిఎబిసిలోను గొడవలు మొదలయ్యాయి. దీనిలో తప్పొప్పులు నిర్ణయించడం ఈ నివేదిక పరిధిలోని విషయంకాదు.. అయితే ఈ ఘర్షణ ప్రభావం చర్చి ఆస్తుల అమ్మకంపైన పడింది. కాబట్టి దీనిలోని ప్రధాన ఘట్టాలను వివరించక తప్పదు.

ఎస్‌టిబిసి తెలుగు బాప్టిస్టు క్రైస్తవుల అత్యున్నత సంస్థ అని చెప్పాము. ఈ ఎస్‌టిబిసి పాలక మండలికి చెందిన అధ్యక్ష, ఉపాధ్యక్ష తదితర బాధ్యులు అయిదుగురు చర్చి ఆస్తుల సంరక్షణ చేయవలసిన పిఎబిసిలో సభ్యులని కూడ చెప్పాము. ఎస్‌టిబిసిలో మొదటి సంక్షోభం వచ్చింది. ఎస్‌టిబిసిని ఎవరు తమ చేతిలో పెట్టుకుంటే వారే పిఎబిసిని కూడ తమ చేతిలో పెట్టుకోవచ్చు. అంటే చర్చి ఆస్తుల అజమాయిషీని తమ గుప్పిట్లో ఉంచుకోవచ్చు. ఎస్‌టిబిసికి చెందిన అయిదుగురు బాధ్యులేకాక పిఎబిసిలో ఇంకొక 17 మంది ఉంటారు. అయితే పెత్తనం మాత్రం వీళ్ల చేతిలోనే ఉంటుంది. ఈ పరిస్థితి ఎస్‌టిబిసిలో గ్రూపులకు దారితీసింది. ఒక గ్రూపు బాపట్ల కోర్టులో ఒక గ్రూపు కావలి కోర్టులో సూట్లు దాఖలు చేసి అవతలి పక్షం జనరల్ కౌన్సిల్‌ను సమావేశపరచరాదని తాత్కాలిక ఇంజంక్షన్ తీసుకున్నారు. దాని వల్ల ఎస్‌టిబిసి జనరల్ కౌన్సిల్ సమావేశపడడం అసాధ్యం అయిపోయింది. అధిష్ఠాన వర్గం ముఠాకొట్లాటలకు దారిసుగమం అయింది.

మైనారిటీ గ్రూపు ఎస్‌యుఆర్‌ఎఫ్ (సమావేశం ఐక్య పుర్నిర్మాణవేదిక) పేరిట ఎస్‌టిబిసికి పోటీ సంస్థను స్థాపించింది. ఈ మైనారిటీకి పిఎబిసి అధ్యక్షుడు రెవరెండ్ బి.ఆర్. మోజెస్ ప్రోత్సాహం లభించింది. ఆయనే ఎస్‌యుఆర్‌ఎఫ్ అధ్యక్షుడయ్యాడు. అది అనుచితం అని ఆయన అనుకోలేదు. మరొక వైపు ఆయన పిఎబిసి మేనేజ్‌మెంట్ కమిటీ అమ్మివేయాలని తీర్మానించిన ఆస్తుల విక్రయం కోసం తన సన్నిహితులయిన వారికి పవర్ ఆఫ్ అటార్నీలు ఇవ్వసాగాడు. ఈ సన్నిహితులలో చీలిక సంస్థ అయిన ఎస్‌యుఆర్‌ఎఫ్ కార్యదర్శి ఒకరు ఈ రకంగా పవర్ ఆఫ్ అటార్నీలు పొందినవారు విలువయిన పట్టణప్రాంత మిషన్ భూములను ఇళ్ల స్థలాలుగానే కాక పెట్టుబడిదార్లకూ వ్యాపారస్తులకూ తమ చిత్తానికి తోచినట్టు అమ్ముకోసాగారు. మోజెస్‌గారు స్వయంగా కూడ లీజు ఒప్పందాలు, విక్రయ ఒప్పందాలు చేయసాగాడు.

అధ్యక్షుడు చేస్తున్న పని చూసి గాభరాపడిన పిఎబిసి మేనేజ్‌మెంట్ కమిటీ 1980 సెప్టెంబర్ 25న అమ్మకాలను నిషేధిస్తూ ఒక తీర్మానం చేసింది. నవంబర్ నెలలో ఇరువర్గాలకూ సయోధ్యకుదిరి ఒక పెద్ద మనుషుల ఒప్పందం చేసుకొన్నారు. కోర్టులో దాఖలు చేసిన దావాలను ఉపసంహరించుకోవాలనీ ఆస్తుల అమ్మకాలు నిలిపివేయాలనీ ఈ ఒప్పందం సారాంశం. కానీ ఇది అమలు కాలేదు. ఎవరి పాటికి వారు ఎప్పటిలాగే వ్యవహరించసాగారు.

చివరికి 1981 ఫిబ్రవరి 28న పిఎబిసి మేనేజ్‌మెంట్ కమిటీ ఇంకొక తీర్మానం ఆమోదించింది. మేనేజ్‌మెంట్ కమిటీ అనుమతి లేకుండ అధ్యక్షుడు రెవరెండ్ మోజెస్ గారు పవర్ ఆఫ్ అటార్నీలు ఇవ్వడానికి వీలులేదని ఆ తీర్మానం చెప్తుంది. పిఎబిసి నియమావళి ప్రకారం ఆ సంస్థ స్థిరాస్తుల క్రయవిక్రయాలలో సంస్థ తరపున అధ్యక్షుడు కార్యదర్శితోగానీ కోశాధికారితోగానీ కలిసి వ్యవహరిస్తాడు. ఈ ముగ్గురిలో ఏ ఒక్కరికైనా పవర్ ఆఫ్ అటార్నీలు ఇచ్చే అధికారం ఉంటుంది. అయితే ఈ విధంగా జరిగే ప్రతీ అమ్మకం, ప్రతీ కొనుగోలు, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులలో కనీసం ఏడుగురి లిఖితపూర్వక ఆమోదం పొందాలి. అంతేకాక, కంపెనీ ఆడిటర్ల, లేక చార్టర్డ్ అకౌంటంట్ల లిఖితపూర్వకమైన సలహా పొంది ఉండాలి. (ఆర్టికల్ ఆఫ్ అసోసియేషన్, నియమం6) ఈ విధంగా క్రయవిక్రయాలలో అధ్యక్షుడి స్వేచ్ఛపైన సంస్థ నియమావళి కొన్ని పరిమితులు పెట్టినప్పటికీ, రెవరెండ్ మోజెస్‌గారి ద్వారా జరిగే అమ్మకాలను మేనేజ్‌మెంట్ కమిటీ ఆపలేక పోవడం వల్ల తమ అనుమతి లేకుండ అసలు పవర్ ఆఫ్ అటార్నీలే ఇయ్యవద్దని తీర్మానం చేసారు.

అక్కడితో ఆగకుండ మోజెస్‌గారిని అడ్డుకొమ్మంటూ మద్రాసు హైకోర్టులో కేసు దాఖలు చేసారు. రెవరెండ్ మోజెస్ తన ఎస్‌టిబిసి వర్గాన్నే అసలు ఎస్‌టిబిసిగా చలామణి చేసి, ఆ ప్రాతిపదికన పిఎబిసి జనరల్ బాడీ

సభ్యుల జాబితాను నిర్ణయించి జనరల్‌బాడీ నిర్వహించనున్నాడని భయపడి, అతను పిఎబిసి జనరల్‌బాడీని నిర్వహించకుండ నిరోధించమని వీరు మద్రాసు హైకోర్టును కోరారు. అదే విధంగా రెవరెండ్ మోజెస్ ద్వారా జరిగే క్రయవిక్రయాలను ఆపమని కూడ కోరారు. మద్రాసు హైకోర్టు మొదటి విషయంలో స్టే ఇచ్చిందిగానీ రెండవ విషయంలో ఇవ్వలేదు. తదుపరి ఆదేశాల వరకు పిఎబిసి జనరల్ బాడీని ఎవ్వరూ నిర్వహించడానికి వీలులేదని ఆర్డర్ ఇచ్చింది.

రెవరెండ్ మోజెస్ చర్చి ఆస్తుల విక్రయాన్ని కొనసాగించారు. మళ్లీ 1983 ఫిబ్రవరి 16 నాడు మేనేజ్‌మెంట్ కమిటీ ఇంకొక తీర్మానం చేసింది. మేనేజ్‌మెంట్ కమిటీ అనుమతి లేకుండ అధ్యక్షుడుగానీ వేరే ఎవ్వరయినాగానీ ఏడాక్యుమెంట్‌పైనా సంతకాలు చేయడానికి వీలు లేదనేది ఈ తీర్మానం.

అప్పటికి పరిస్థితి ఏమిటంటే ఎస్‌టిబిసి రెండుగా చీలి ఉంది. అందులో మైనారిటీ వర్గం నాయకుడయిన రెవరెండ్ మోజెస్ పిఎబిసి అధ్యక్షుడిగా ఉంటూ ఆస్తుల ఆజమాయిషీ తన చేతిలో పెట్టుకున్నాడు. అమ్మవద్దని పిఎబిసి మేనేజ్‌మెంట్ కమిటీ తీర్మానం చేసినా వినడు. అమ్ముతూనే ఉంటాడు.. పవర్ ఆఫ్ అటార్నీలు ఇయ్యవద్దన్నా వినడు. ఇస్తూనే ఉంటాడు. అది కూడ తన వాళ్లకే ఇస్తాడు.

ఈ పరిస్థితిని సవరించడానికి ఎస్‌టిబిసి జనరల్ కౌన్సిల్‌కు ఎన్నిక జరిపించి, తద్వారా పిఎబిసి సభ్యత్వాన్ని మార్చడం ఒక్కటే మార్గమని భావించిన మెజారిటీ వర్గం నాయకుడు శ్రీ బెంజమన్ సుప్రీం కోర్టుకు పోయి ఎస్‌టిబిసి జనరల్ కౌన్సిల్‌కు ఎన్నిక జరిపించమని అడిగాడు. సుప్రీం కోర్టు మొదట నియమించిన అడ్మినిస్ట్రేటర్ ఈ పని చేయడంలో విఫలంకాగా తరువాత నియమించిన కమిషనర్ రెవరెండ్ విక్టర్ ప్రేంసాగర్ 1983లో ఎస్‌టిబిసి జనరల్ కౌన్సిల్ ఎన్నికలు జరిపించారు. బెంజమిన్ వర్గానికి

మెజారిటీ వచ్చింది. కానీ రెవరెండ్ మోజెస్ సమాంతర జనరల్ కౌన్సిల్‌ను కొనసాగించారు. ఎస్‌టిబిసిలో మెజారిటీ సాధించుకున్న బెంజమిన్ వర్గం, తదనుగుణంగా పిఎబిసిలో కూడ మార్పులు చేసి కొత్త మేనేజ్‌మెంట్ కమిటీని ఎన్నుకోవాలని పట్టుబట్టింది. అయితే 1981లో ఈ వర్గమే మద్రాసు హైకోర్టులో వేసిన కేసు కారణంగా పిఎబిసి జనరల్‌బాడీని ఎవ్వరూ సమావేశపరచకూడదన్న స్టే ఆర్డర్ అమలులో ఉంది. అది ఇప్పుడు వీరికే అడ్డం వచ్చింది. ఆ స్టేని అడ్డం పెట్టుకొని రెవరెండ్ మోజెస్ పిఎబిసి పైన తన ఆధిపత్యాన్ని కొనసాగించారు. దీనితో విసిగిపోయిన బెంజమిన్ వర్గం ఒక సమాంతర పిఎబిసిని వెలకొల్పింది. 1979 సమాంతర ఎస్‌టిబిసితో ప్రారంభం అయిన కథ 1984లో సమాంతర పిఎబిసి దాకా వచ్చింది.

అయితే అదే సంవత్సరం రెవరెండ్ మోజెస్ స్థానంలో రెవరెండ్ ఎస్.కె. బేపారీ అధికార పిఎబిసికి అధ్యక్షుడయ్యాడు. ఈయన బెంజమిన్ అనుచరులు నడుపుతున్న పోటీ పిఎబిసిపైన నెల్లూరు జిల్లా కోర్టులో దావావేసి, వాళ్ళు కంపెనీ ఆస్తుల జోలికి రాకూడదని ఇంజంక్షన్ తీసుకున్నాడు. 1985లో పోటీ పిఎబిసి వాళ్ళు (అంటే బెంజమిన్ వర్గం) మద్రాసు హైకోర్టులో ఒక కంపెనీ పిటిషన్ దాఖలు చేసి రెవరెండ్ బేపారీ అధ్యక్షుడుగా ఉన్న పిఎబిసి కంపెనీ ఆస్తులను ఏరూపంలోను బదలాయించకూడదని ఇంజంక్షన్ తీసుకున్నారు. 1986లో వాళ్ళు మద్రాసు హైకోర్టులో ఇంకొక కంపెనీ పిటిషన్ దాఖలు చేసి, తమదే అసలయిన పిఎబిసి అని కోర్టు ప్రకటించాలని అడిగారు. అంతేకాక, 1979 తరువాత జరిగిన ఆస్తుల అమ్మకాలను, లీజులను కోర్టు పరిశీలించి అందులో ఏవి చెల్లుతాయో, ఏవి చెల్లవో ప్రకటించాలనీ, కంపెనీకి జరిగిన నష్టానికి బాధ్యులెవరో గుర్తించాలనీ, నష్టాన్ని వారి నుండి కంపెనీకి ఇప్పించాలనీ కోరారు. ఇందులో పిటిషనర్ ఒంగోలులోని సమావేశం హైస్కూల్ హెడ్‌మాస్టర్ శ్రీ కొండయ్య.

ఒకరికి వ్యతిరేకంగా ఒకరు వేసుకొన్న ఈ కేసుల ఫలితంగా ఇద్దరూ 1987లో రాజీకి వచ్చారు. అన్ని కేసులూ ఉపసంహరించుకోవాలనీ అప్పటికి జరిగిన అన్ని అమ్మకాలపైన ఆర్బిట్రేటర్ చేత నివేదిక తయారు చేయించాలని నిర్ణయించుకున్నారు. అందరూ కలిసి రెవరెండ్ మోజెస్‌కు సన్నిహితుడయిన రెవరెండ్‌సదానందంను అధ్యక్షునిగా, ప్రతిపక్షం నాయకుడు శ్రీ బెంజమిన్‌ను ప్రధాన కార్యదర్శిగా నియమించి 22 మంది సభ్యులుగల ఒక కొత్త పిఎబిసి జనరల్‌బాడీని 1987 నవంబర్ నెలలో ప్రకటించారు. ఒక కొత్త మేనేజ్‌మెంట్ కమిటీని కూడ ప్రకటించారు. అయితే గతంలో జరిగిన ఆస్తుల పరాయీకరణ గురించి ఆర్బిట్రేటర్ చేత విచారణ జరిపించాలన్న ఒప్పందాన్ని పక్కన పెట్టి తిరిగి 1988లో బెంజమిన్, జి. దేవదానంలకు పిఎబిసి ఆస్తుల క్రయవిక్రయాలకు సంబంధించిన పవర్ ఆఫ్ అటార్నీ (ఒక సంవత్సరానికి) ఇచ్చారు. వాళ్లు ఒంగోలులో బెస్తవారిపేటలో కొన్ని ఆస్తులు అమ్మారు. పాత అమ్మకాలపైన ఆర్బిట్రేటర్ చేత విచారణ జరిపించే బదులు పిఎబిసి సభ్యుల నుండే ఒక స్పెషల్ కమిటీని నియమించి విచారణ జరిపించాలని నిర్ణయించుకున్నారు.

దీనికి వ్యతిరేకంగా శ్రీ కొండయ్య మళ్లీ మద్రాసు హైకోర్టులో కోర్టు ధిక్కారం కేసు వేయగా మద్రాసు హైకోర్టు జస్టిస్ పున్నయ్య గారిని 1989 జూన్ 21న ఆర్బిట్రేటర్‌గా నియమించి 1979 నుండి జరిగిన పిఎబిసి ఆస్తుల విక్రయాలు, లీజులు వగైరాల పైన విచారణ జరపమనింది. పున్నయ్య గారు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో జడ్జిగా రిటైర్ అయ్యారు. ఆయన తన రిపోర్టును 1991 జులై 17న ఇచ్చారు.

పున్నయ్యగారు పిఎబిసిని చర్చి ఆస్తుల ట్రస్టీగా గుర్తించినప్పటికీ, ఆస్తుల విక్రయాలను పరీక్షించేటప్పుడు దానినొక సాధారణ వ్యాపార కంపెనీని చూసినట్టే చూసారు. ట్రస్టీగా అది పాటించవలసిన ప్రమాణాలను లెక్కలోకి తీసుకోలేదు. అది ఒక ట్రస్టీ స్వభావంగల కంపెనీగా తన వ్యవస్థాపక

లక్ష్యాలకు అనుగుణంగా వ్యవహరించిందా లేదా అన్న చర్చలోకి పోకుండ, అమ్మకాలు చేపట్టే పద్ధతికి సంబంధించిన వ్యవస్థాపక నియమాలనూ, అప్పటి మేనేజ్‌మెంట్ కమిటీ తీర్మానాలనూ, వ్యాపార దక్షతకు సంబంధించిన సూత్రాలనూ ప్రమాణంగా తీసుకొని అమ్మకాల తప్పొప్పులను నిర్ణయించారు. ఆయన పిఎబిసి అధిష్టానం పట్ల ఇంత ఉదారంగా వ్యవహరించినప్పటికీ, ఆయన పరిశీలించిన ''73 అమ్మకాలు (లేక లీజుల)లో 47 చెల్లవని అభిప్రాయపడ్డారు.'' వాటినన్నిటినీ పిఎబిసి వెనక్కి తీసుకోవచ్చునని అన్నారు.

'సువార్త ప్రచారం కోసం, సంఘసేవ కోసం' ఉద్దేశించిన ఆస్తులు ఇంతగా దుర్వినియోగం అయ్యాయి. పున్నయ్య గారు పరిశీలించిన ఈ 73 అమ్మకాల ద్వారా విలువయిన పట్టణ ప్రాంత భూములను పొందినవారెవ్వరు? కొందరు ఇళ్ల ఫ్లాట్లకోసం, హోటళ్లు, లేక షాపులు నెలకొల్పడం కోసం కొన్నారు. ఇళ్ల కాలనీలు నిర్మించే వ్యాపార సంస్థలు, ఇతర పెత్తందార్లు కూడ కొన్నారు. ఒంగోలుకు చెందిన శ్రీసాయి మార్కెటింగ్ కాంప్లెక్స్ అనే వ్యాపార సంస్థ, కాకతీయ హౌసింగ్ కాలనీ కమిటీ అనే రియల్ ఎస్టేట్ సంస్థ, వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అనే మరొక సంస్థ కర్నూలుకు చెందిన కోటీశ్వరులు టి.జి. వెంకటేశ్ గుప్త కుటుంబీకులు, జి. పుల్లారెడ్డి, రాజకీయ ఫాక్షనిస్టులయిన ఎస్.వి.సుబ్బారెడ్డి, కె.ఇ.కృష్ణమూర్తి కుటుంబాలు, సికిందరాబాద్‌లోని అమర్ ఎస్టేట్స్, నరసరావుపేటకు చెందిన కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఆక్షన్ అనే స్వచ్ఛంద సంస్థ, నల్గొండకు చెందిన రాజకీయ నాయకులు బండ దామోదర రెడ్డి, చకిలం శ్రీనివాసరావు, బెస్తవారిపేటలో కందుల ఓబులరెడ్డి తదితరులు నిర్వహించిన కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ, వినుకొండలో, కనిగిరిలో, కర్నూలులో, కొందరు అడ్వొకేట్లు కావలిలో, వరంగల్‌లో, వినుకొండలో, క్రిష్టియన్ హౌసింగ్ సొసైటీ పేరు మీద ఉన్న ఇళ్ల సొసైటీలు, ఈ జాబితాలో ఉన్నారు.

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే తాను చెల్లవని ప్రకటించిన 47 అమ్మకాల ద్వారా అన్యాక్రాంతమయిన ఆస్తులను వెనక్కి తీసుకొనే చర్యలను పిఎబిసి ప్రారంభించవచ్చునని వున్నయ్యగారు 1991లో ప్రకటించిన తన ఆర్బిట్రేటర్ రిపోర్టులో చెప్పి అయిదేళ్ళు గడచిపోయినా పిఎబిసి కర్నూలులో ఆ ప్రయత్నమేమి మొదలు పెట్టలేదు. ఇతర జిల్లాల సంగతి ఇంతకంటె భిన్నంగా ఉందనుకోము.

సవివరంగా చెప్పిన ఈ కథ నుండి తీసుకోవలసిన గుణపాఠం ఒకటి ఉంది.

మత సంస్థల వ్యవహారాల నిర్వహణ సాధారణంగా ప్రజాస్వామికంగా ఉండదు. కానీ బాప్టిస్టు క్రైస్తవులది అందుకు భిన్నంగా ప్రజాతంత్ర స్వభావం గల వ్యవస్థ. ఒక్కొక్క చర్చి పరిధిలోని క్రైస్తవులందరూ ఒక 'సంఘం'గా ఏర్పడతారు. ఆ సంఘం బాధ్యులను ఎన్నుకుంటారు. కొన్ని చర్చిలు (సంఘములు) కలిసి ఒక ఫీల్డ్ (పొలము) గా ఏర్పడతాయి. పొలములోని సంఘముల 'రాయబారులు' లేక ప్రతినిధులు ఇతర శాశ్వత సభ్యులు కలిసి పొలము సర్వసభ్య సమావేశంగా ఏర్పడతారు. వాళ్ళు ఎస్‌టిబిసికి తమ ప్రతినిధులను ఎన్నుకుంటారు. ఈ విధంగా ఎన్నికయిన వారు ఇద్దరిద్దరు ఒక్కొక్క సభ్యుడివి అదనంగా నామినేట్ చేస్తారు. వీళ్ళంతా కలిసి ఎస్‌టిబిసి జవరల్ కౌన్సిల్‌గా ఏర్పడతారు. వారు ఒక పాలక మండలిని ఎన్నుకుంటారు. ఆ పాలక మండలి ఎస్‌టిబిసి కర్తవ్యాలయిన 'సువార్త ప్రచారం, పంఘసేవ' లకు సంబంధించిన వ్యవహారాల నిర్వహణ చేపట్టడం కాక పిఎబిసి సభ్యులుగా ఉండి చర్చి ఆస్తులు విర్వహణలో పాలుపంచుకుంటారు.

ఈ వ్యవస్థ సక్రమంగా నడిచి ఎక్కడికక్కడ ఎన్నికలు సకాలంలో జరిగి, ఓటర్ల అభిప్రాయాలను గౌరవించి సంస్థ వ్యవహారాలు నిర్వహించేటట్టయితే ఇది మంచి వ్యవస్థే. వంశపారంపర్యంగా మత సంస్థల పైన పెత్తనం చేసే

మహంత్‌లు, పూజారుల పాలనకన్నా, ప్రభుత్వం నియమించే అధికారుల పాలనకన్నా భక్తుల ప్రమేయం లేకుండ మతసంస్థల పైన పెత్తనం చేసే మతాధిపతుల పాలనకన్నా ఈ ప్రజాతంత్ర వ్యవస్థ మంచిది. హిందువులలోగానీ ముస్లింలలోగానీ ఇతర క్రైస్తవ శాఖలలో (ఆర్‌సిఎం, సిఎస్‌ఐ) గానీ ఇటువంటిది లేదు.

అయితే ఏ ప్రజాతంత్ర వ్యవస్థ అయినా నిర్లక్ష్యం చేస్తే నాశనం అవుతుంది. అవినీతికీ ఆశ్రిత పక్షపాతానికీ బలి అవుతుంది. ప్రయత్నపూర్వకంగా కాపాడుకుంటేనే ప్రజాతంత్ర వ్యవస్థలు నిలుస్తాయి. డబ్బు ఆశ బాప్టిస్టు క్రైస్తవ ప్రజాస్వామాన్ని ధ్వంసం చేసింది. బాప్టిస్టు క్రైస్తవ ప్రముఖులు ఎక్కడికక్కడ గ్రూపులుగా విడిపోయి సమాంతర సర్వసభ్య సమావేశాలు నిర్వహించడం మొదలు పెట్టారు. సమాంతరంగా ఎన్నికలు జరిపించడం మొదలు పెట్టారు. ఒకరిపైన ఒకరు కోర్టులో దావాలు వేసి ఎవ్వరినీ పని చేయనీయకుండ స్టే ఆర్డర్లు తెచ్చుకున్నారు. ఏస్థాయిలోనూ అధికారిక కమిటీ ఒకటి లేని పరిస్థితి ఏర్పడింది. ఈ గందర గోళాన్ని అడ్డంపెట్టుకొని కొంతమంది పవర్ ఆఫ్ అటార్నీలు కమిటీ తీర్మానాలు పుట్టించి చర్చి ఆస్తులు అమ్ముకోసాగారు. బాప్టిస్టు క్రైస్తవులు నూటికి నూరు శాతం దళితులు కావడంవల్ల, అత్యధికంగా పేదలు, నిరక్షరాస్యులు కావడంవల్ల అధికారం చేతిలో ఉన్న కొద్దిమంది ఆటలు నిరాఘాటంగా సాగాయి. చర్చి చేతిలో సువార్త ప్రచారానికీ సంఘసేవకూ లేదా ప్రభుత్వం చేతిలో సామాన్య ప్రజావసరాలకూ ఉపయోగపడగల అత్యంత విలువయిన ఆస్తులు ప్రైవేట్ వ్యక్తుల స్వంత ఆస్తులయ్యాయి. వీరిలో కొందరు అధికారం చేజిక్కించుకొని అక్రమాలకు పాల్పడుతున్న వారి బంధువులు, ఆశ్రితులు కాగా అధికులు స్థానిక హైందవ ఆధిపత్య కుల, పెత్తందారీ వర్గాలకు చెందిన ధనవంతులు బలవంతులు.

ప్రజాజీవితంలో ప్రజాస్వామ్యం నాశనమయితే పెత్తందారీ వర్గాలు ప్రయోజనం పొందుతారనే సాధారణ సూత్రానికి ఇదొక మంచి ఉదాహరణ.

# V

ఇక కర్నూలుకు వద్దాం.

కర్నూలు పట్టణంలోని బాప్టిస్టు క్రైస్తవ ఆస్తులు ఏడు.

(i) కోల్స్ మెమోరియల్ హైస్కూలు ఇది సురక్షితంగానే ఉంది.

(ii) కోల్స్ సెంటినియల్ చర్చి దాని కాంపౌండు ఇది కూడ సురక్షితంగానే ఉంది.

(iii) కాస్ట్ గరల్స్ హైస్కూలు, దాని కాంపౌండ్ స్కూలు వేరే బిల్డింగ్‌లోకి మారిన తరువాత దీనిని డి.సి.సుబ్బన్న అనే న్యాయవాది కౌనుక్కొని కొత్త నిర్మాణం చేపట్టి షాపులకూ, ఇళ్లకు అద్దెకు ఇచ్చాడు.

(iv) 'క్రెష్ హాస్టల్' అనే అనాథబాలల హాస్టలు. ఇది మూత పడింది. కానీ స్థలం సురక్షితంగానే ఉంది.

(v) కోల్స్ మెమోరియల్ బాలుర బోర్డింగ్ మరియు రాక్‌వుడ్ కాంపౌండ్ (దీనినే ఎస్‌టిబిసి కాంపౌండ్ మరియు రాక్‌వుడ్ బంగ్లా కాంపౌండ్ అంటారు) ఇందులో ప్రస్తుతం ఎస్.వి.సుబ్బారెడ్డి తమ్ముడయిన ఎస్.వి.నాగిరెడ్డికి చెందిన ఎస్.వి.చిట్ ఫండ్స్, శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఫైనాన్స్ సంస్థలు నడుస్తున్నాయి. రాక్‌వుడ్ బంగ్లాను కూడ ఎస్.వి.నాగిరెడ్డి లీజుకు తీసుకున్నాడు. అందులో ప్రస్తుతం కర్నూలు పబ్లిక్ స్కూల్ అనే ప్రైవేట్ విద్యాసంస్థ నడుస్తూఉంది. ఇవి కాక కనీసం 17 చిన్న చిన్న అంగళ్ళు, మెకానికల్ షాపులు, ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలు ఉన్నాయి. ఇవన్నీ పారిశ్రామికవేత్త టి.జి. వెంకటేశ్ లీజుకు తీసుకున్న జాగాలోఉన్నాయి. అతనికి అద్దె తెచ్చిపెడుతున్నాయి.

(vi) కోల్స్ ప్రైమరీ స్కూల్, కోల్స్ ఇండస్ట్రియల్ స్కూల్ ప్రస్తుతం రాక్‌వుడ్ మెమోరియల్ స్కూల్ దానికి సంబంధించిన వ్యవసాయ శిక్షణ భూమి, కౌషెడ్, రాక్‌వుడ్ మెమోరియల్ హౌస్ (దీనిని కౌషెడ్ - గోశాల - అంటారు) మిషన్ కాంపౌండ్. ఇందులో నేతి మిఠాయి షాహుకారు జి. పుల్లారెడ్డి కొనుగోలు చేసిన భూమి ఉంది. కొంత భాగం కె.ఇ.కృష్ణమూర్తి సోదరుల ఆస్తి అయింది. అందులో ఒక బేకరీ, లారీ గ్యారేజ్, పాలిష్డ్ స్టోన్ (పాలరాయి) అంగడి, ఒక చెప్పుల షాపు, ఒక ఫాస్ట్ ఫుడ్ సెంటర్ మొదలయినవి వెలిసాయి. కొంతభూమి ఎస్‌టిబిసి కాలేజి అధ్యాపకుల చేతిలోకి పోయింది. అందులో కొంత భాగం విజయవాడకు చెందిన మార్వాడీసేఠ్‌ల ఆస్తి అయి తిరిగి ఈ మధ్యనే ఎస్.వి.నాగిరెడ్డి అజమాయిషీలోకి పోయింది.

(Vii) ఎమిలీ కోల్స్ మెమోరియల్ బాలికల స్కూలు, దాని కాంపౌండ్, ఇసిఎం ఎలిమెంటరీ స్కూలు, గరల్స్ హాస్టల్, స్టాంటన్ బంగలా, శ్మశాన వాటిక. ఇందులో ఇళ్ల ప్లాట్లతోపాటు ఒక పెట్రోల్ పంప్, ఒక క్షవరశాల, ఒక క్యాసెట్ షాపు, ఒక బేకరీ, ఒక హోటల్, ఒక కట్టెల అడితి వెలిసాయి. ఇవి ఉన్నది టి.జి.ప్రసాద్ కొనుక్కున్న భూమిలో. వీరారెడ్డి అనే పబ్లిక్ ప్రాసిక్యూటర్, సుబ్రమణ్యం అనే అడ్వకేట్ల భార్యలకు, ఎస్.వి.నాగిరెడ్డికి ప్లాట్లున్నాయి.

కర్నూలు పట్టణంలోని క్రైస్తవ ఆస్తులు చాలా విలువయినవి. వాటి మొత్తం ఖరీదు ఈరోజు 40 కోట్ల రూపాయల దాకా ఉంటుందని అంచనా. పట్టణ స్థిరాస్తుల వ్యాపారం ఈరోజు మన రాష్ట్రంలో ధనిక వర్గాల ముఖ్యవ్యాపారాలలో ఒకటి. వాళ్ళ కళ్ళు ఈ విలువైన భూమిపైన బిల్డింగులపైన పడడంలో ఆశ్చర్యం లేదు. ఇంక మధ్యతరగతికి ఇళ్ళ ప్లాట్ల

అవసరము చాలా ఉంది. ఈ వ్యాపారాల కోసం, అవసరాల కోసం, చర్చి భూములు క్రమంగా అన్యాక్రాంతం అయిపోతున్నాయి. అంతకు ముందు ఈ భూములలో (ఒక చర్చిని , మిషనరీల నివాసాలను మినహాయిస్తే) అన్నీ విద్యాసంస్థలే ఉండేవి. ఆ విద్యాసంస్థలకు విశాలమైన ఆటస్థలాలు ఆవరణలు ఉండేవి. కొత్తక్లాసులు తెరచినా కొత్తకోర్సులు ఆవిష్కరించినా హైస్కూలును జూనియర్ కాలేజిగా అప్‌గ్రేడ్ చేసినా ఆ విద్యాసంస్థలకు అదనంగా స్థలం అవసరం అవుతుంది. పిల్లలకు మంచి ఆటస్థలాలు కూడ అవసరమే. ప్రభుత్వ గ్రాంట్ పొందే స్కూలుకు 5 ఎకరాల ఆవరణ ఉండాలని విద్యాశాఖ నియమం కూడ ఉంది. ఈ అవసరాలను మించి భూమి ఉంటే ఇంకొక అనాథ శరణాలయమో హాస్టలో నిర్మించడం పిఎబిసి లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుంది. దానికి వనరులు అవసరమయితే వాటిని సేకరించే మార్గాలు పిఎబిసి వెతకవలసి ఉంటుంది. అందుకోసమే కొంత చర్చి ఆస్తిని విక్రయించడం తప్పనిసరి అయితే పూర్తిగా నిరుపయోగంగా ఉన్నదానిని అమ్మవచ్చు అదికూడ ఎందుకు తప్పనిసరి అయిందో, అమ్మగా వచ్చిన డబ్బును విద్యావ్యాప్తి తదితర ట్రస్ట్ లక్ష్యాల కోసం ఏ రకంగా ఖర్చుపెట్టడం జరిగిందో వివరించడం పిఎబిసి కర్తవ్యం అవుతుంది. ఇదంతా కాదని ఈ భూమిని ట్రస్ట్ లక్ష్యాలతో సంబంధం లేకుండ ఇళ్ళ ప్లాట్లుచేసి అమ్మడం, వ్యాపారస్తులకు, ఫాక్షనిస్టులకు విక్రయించడం ట్రస్ట్ లక్ష్యాలకు విరుద్ధమే కాక విలువయిన ప్రజావనరులను దుర్వినియోగం చేయుడం కూడ అవుతుంది. ట్రస్ట్ లక్ష్యాల పట్ల పిఎబిసి నాయకత్వానికి ఆసక్తి లేకపోతే పట్టణ భూపరిమితి చట్టానికి తలఒగ్గి, 'ఈ భూమిని మతవ్యాప్తి, సంఘ సేవాలక్ష్యాల కోసం వినియోగించే ఉద్దేశ్యం మాకు లేదు' అని చెప్పి నిజాయితీగా ప్రభుత్వానికి అప్పగించవలసింది. అది ప్రభుత్వ ఆస్తి అయితే ప్రభుత్వంపైన ఒత్తిడి పెట్టి అది సామాన్యప్రజావసరాల కోసం ఉపయోగపడేటట్టు చూసుకోవడం ప్రజలకు కొంత మేరకైన సాధ్యం అవుతుంది.

దీనికి విరుద్ధంగా చర్చి ఆస్తుల అక్రమ పరాయీకరణ కర్నూలు పట్టణంలో ఇప్పటికే చాలా పెద్ద ఎత్తున జరిగింది. కోర్టు లిటిగేషన్ మధ్యనే జరుగుతూ ఉంది. ఒకరు అమ్మకం మొదలు పెడితే ఇంకొకరు వారిపైన కోర్టులో దావా వేసి 'స్టే' తీసుకుంటారు. స్టే మంజూరు కాగానే తామే అమ్మడం మొదలు పెడతారు. మొదటి పిటీషన్‌లో ప్రతివాది అయిన వాడు ఇప్పుడు తానే వాది అయి తొలుత తన మీద దావా వేసిన వాడిపైన ఇంకొక దావా వేస్తాడు. దానిని అడ్డం పెట్టుకొని తన అమ్మకాలు సాగించుకోవాలని చూస్తాడు. ఈ ప్రహసనం కర్నూలు లో 17 ఏళ్ళుగా సాగుతూ ఉంది.

కర్నూలులో మొట్టమొదట అమ్మకం జరిపింది పిఎబిసియే. 1979 నవంబర్‌లో వాళ్లు 'కాస్ట్ గరల్స్ స్కూల్' బిల్డింగ్‌ను డి.సి.సుబ్బన్న అనే న్యాయవాదికి అమ్మారు. అప్పటికి ఆ స్కూలు నడవడం లేదు. మరుసటి సంవత్సరం మరికొన్ని ఆస్తులు అమ్మడానికి సిద్ధం అయ్యారు. రాక్‌వుడ్ మెమోరియల్ స్కూల్ ఆవరణనూ విశాలమైన ఇసిఎం స్కూలు ఆవరణనూ అమ్మడానికి బేరంపెట్టారని అంటారు. దీనిని నివారించడానికి కర్నూలుకు చెందిన పి.సుదర్శనం, ఎం.ఎస్.జెరెమియా అనే ఇద్దరు బాప్టిస్టు క్రైస్తవులు కర్నూలు సబ్‌కోర్టులో దావా దాఖలు చేసారు. వాళ్లు కర్నూలు పాలము బాప్టిస్టు సంఘముల అభివృద్ధి సమాజము అనే కొత్త సంస్థ ప్రతినిధులుగా ఈ కేసు వేసారు. ఇది 1945లో రిజిష్టర్ అయిన 'పాలము సమాజము' కు పోటీ సంస్థ. బాప్టిస్టు క్రైస్తవ ఆస్తులు ట్రస్ట్ ఆస్తులనీ, 'బాప్టిస్టు క్రైస్తవ సంక్షేమం కోసం, అభ్యున్నతి కోసం, వాటిని ట్రస్ట్ రూపంలో అప్పగించడం జరిగిందనీ, వాటిని అన్యాక్రాంతం చేయడం చట్ట విరుద్ధమనీ వాళ్లు వాదించారు. అవి ట్రస్ట్ ఆస్తులనేది వాస్తవమే కానీ అవి 'బాప్టిస్టు క్రైస్తవుల సంక్షేమం కోసం, అభ్యున్నతి కోసం' అప్పగించిన ఆస్తులు కావు. 'సువార్త ప్రచారం కోసం, సంఘసేవ కోసం అప్పగించిన ఆస్తులు. వాటిని ఇష్టానుసారం అన్యాక్రాంతం చేసే అధికారం పిఎబిసికి లేనట్టే, వాటిని తమ ఉమ్మడి ఆస్తిగా భావించే హక్కు క్రైస్తవులకు కూడ చట్టంలో లేదు. అయితే చట్టం సంగతి

ఎట్లావున్నా, కనీసం వాటిని ట్రస్ట్ లక్ష్యాలకు విరుద్ధంగా బాప్టిస్టు క్రైస్తవులే స్వంతం చేసుకొని ఉన్నా పోనీలెమ్మనుకోవచ్చు. ఎందుకంటే బాప్టిస్టు క్రైస్తవులు నూటికి నూరు శాతం దళితులు. అధికభాగం పేదలు. కానీ ఆ ఆస్తులు ఎక్కువగా చేజిక్కింది దళిత క్రైస్తవులకు కాదు. కోటీశ్వరులు లేక ఫాక్షనిస్టులు అయిన క్రైస్తవేతరులకు వారి ఆశ్రితులకు.

ఏమయితేనేం, పిఎబిసి మొదలు పెట్టిన అమ్మకాలను ఆపడానికి జెరిమియా సుదర్శనంగారలు 1980లో కోర్టులో దావా వేశారు. చర్చి ఆస్తులు బాప్టిస్టు క్రైస్తవుల సంక్షేమం కోసం, అభ్యున్నతి కోసం మాత్రమే ఉపయోగపడాలని వాదించారు. కానీ 1983-84 లో వీళ్లే ఆ ఆస్తులను క్రైస్తవేతరులైన ఫాక్షనిస్టులకూ వ్యాపారస్తులకూ అమ్మడం మొదలు పెట్టారు. 'కర్నూలు పాలము సంఘముల అభివృద్ధి సమాజము' మేనేజ్‌మెంట్ కమిటీ, ఆస్తుల అమ్మకం కోసం ఇద్దరు వ్యక్తులకు పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చింది. ఇచ్చిన మేనేజ్‌మెంట్ కమిటీలోని 9 మందిలో సుదర్శనం ఒకరు. పుచ్చుకున్న ఇద్దిరిలో జెరిమియా ఒకరు. రెండవ పవర్ ఆఫ్ అటార్నీ గ్రహీత శ్రీ కె.ఎం.దేవవరం. మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు రెవరెండ్ బి. శ్యాంరాజు, రెవరెండ్ ఆర్ఆర్‌డి, రెవరెండ్ సజీవరాజు, రెవరెండ్ కె.భాస్కరరావు, రెవరెండ్ యు.రత్నం, ఎం.డేనియల్, ఎస్.ప్రభాకరరావు, ఆర్.కృపానందం, రెవరెండ్ ఎస్ జయకర్ క్రిష్టియన్, పి. సుదర్శనం.

పవర్ ఆఫ్ అటార్నీ పుచ్చుకున్న జెరిమియా, దేవవరంగారులు శరవేగంగా అమ్మకాలు మొదలు పెట్టారు. కె.ఇ.కృష్ణమూర్తి సోదరులు జయచంద్రుడు, ప్రభాకర్, ప్రతాప్‌లకు; ఎస్.వి.సుబ్బారెడ్డి తమ్ముడు ఎస్.వి.నాగిరెడ్డికి; టి.జి.వెంకటేశ్‌కు, ఆయన తమ్ముడు ప్రసాద్‌కు తుంగభద్ర మెషినరీ అండ్ టూల్స్ లిమిటెడ్ కంపెనీకి; జి.పుల్లారెడ్డి కొడుకులు ఏకాంబరరెడ్డి, రాఘవరెడ్లకు; వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి అనే ఇద్దరు తండ్రీకొడుకులకు; కంబిరెడ్డి అనే మరొక వ్యక్తికి, కొంత భూమి అమ్మివేసారు, లేదా లీజుకు ఇచ్చారు.

వీళ్లెవ్వరూ బాప్టిస్టు క్రైస్తవులు కారు. కె.ఇ.సోదరులను మినహాయిస్తే మిగిలిన వాళ్లంతా రెడ్లు, వైశ్యులు, కె.ఇ.వాళ్లు ఈడిగ (వెనుకబడిన) కులానికి చెందిన వారేగానీ కర్నూలు జిల్లాలో ఏరెడ్డికి తీసిపోని దౌర్జన్యకారులు, ఫాక్షనిస్టులు, కోటీశ్వరులు.

జెరిమియ, దేవవరం గారలు ఏరికోరి వీళ్లకే ఎందుకు అమ్మినట్టు? అమ్మదలచుకున్న వాళ్లు కొనుక్కోగల వాళ్లకే అమ్మవలసి ఉంటుంది. కొనుక్కునేంత స్తోమత ఈ వర్గాలకే ఉంది. అదొక కారణం. కానీ అంత కంటే గట్టి కారణం కూడ ఒకటి ఉంది. 'మేము అమ్మగలుగుతామో లేదో చూద్దాం' అని తమ అధికారం పరిధులు (నిజానికి వాళ్లకు ఏ అధికారమూ లేకపోయినప్పటికీ) నిర్ణయించుకోవడానికి అమ్మకం మొదలు పెట్టామని జెరెమియ పౌరహక్కుల సంఘంతో అన్నాడు. అటువంటి ప్రయోగం బలహీనులతో మొదలు పెడితే ప్రయోజనం ఉండదు. గట్టివాళ్లకు అమ్మితేనే వాళ్లు కోర్టు లిటిగేషన్‌కయినా గూండాదాడులకైనా తట్టుకొని తమ కొనుగోలుమా వీరి అమ్మకాన్నీ నిలబెట్టగలరు. వారిని అడ్డం పెట్టుకొని మిగిలిన ఆస్తిని నెమ్మదిగా అన్యాక్రాంతం చేయవచ్చు. తరువాత అమ్మకాన్ని ప్రశ్నించదలచుకున్న వాళ్లు మొదటి కొనుగోలుదార్లతో కూడ తలపడవలసి వస్తుంది కదా! ఏ తప్పుడు పని చేయదలచుకున్నా కె.ఇ.సోదరులకు ఆళ్లగడ్డ ఫాక్షనిస్టులకు అందులో 'ప్రయోజనం' కల్పించేస్తే ఇంక ఆ తప్పుడు పనిని ప్రశ్నించే వాళ్లెవరూ ఉండరు. వాళ్లతో గొడవ పెట్టుకుంటే భూముల సంగతి దేవుడెరుగు ప్రాణాలకే భరోసా ఉండదు.

పిఎబిసికి చర్చి ఆస్తులను కొన్ని పరిమితులకు లోబడి విక్రయించే హక్కయినా ఉంది. అదేదీలేని 'పాలము అభివృద్ధి సమాజం' తనకు లేని అధికారానికి పవర్ ఆఫ్ అటార్నీలు పుట్టించి జెరెమియ, దేవవరం గారల ద్వారా పెద్ద ఎత్తున అమ్మకాలు మొదలు పెట్టే సరికి ఈసారి పిఎబిసి కోర్టుకెక్కింది. అంతకు ముందు (1980లో) పిఎబిసి పైన సూట్ దాఖలు

చేసిన జెరెమియ, సుదర్శనం గారలకు తామే అమ్మకాలు మొదలుపెట్టే సరికి కేసుకొనసాగించాలన్న ఆసక్తి పోయింది. వాళ్ల అనాసక్తి కారణంగా కోర్టు ఆ కేసును 1984 మార్చి 16నాడు కొట్టేసింది. అయితే అదే సంవత్సరం వారిపైన పిఎబిసి కర్నూలు సబ్‌కోర్టులో సూట్ దాఖలు చేసింది. అందులో ప్రతివాదులు పైన పేర్కొన్న 9 మంది 'పాలము అభివృద్ధి సమాజం' మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు వారి నుండి పవర్ ఆఫ్ అటార్నీ పొందిన ఇద్దరు. వారి ద్వారా భూములు, ఇతర ఆస్తులు పొందిన పెద్ద మనుషులు. కర్నూలు బాప్టిస్టు క్రైస్తవ ఆస్తుల లిటిగేషన్ లో వాది ప్రతివాదులు ఈ విధంగా తమ పాత్రలు బదలాయించుకున్నారు.

'కర్నూలు పాలము బాప్టిస్టు సంఘముల అభివృద్ధి సమాజం అనేదానికి బాప్టిస్టు క్రైస్తవ ఆస్తుల పైన ఎటువంటి అధికారం లేదని ఆ సంస్థ మేనేజ్‌మెంట్ కమిటీ ఇచ్చిన పవర్ ఆఫ్ అటార్నీలు చెల్లవనీ, పవర్ ఆఫ్ అటార్నీలు పొందినవారు చేసిన అమ్మకాలు చెల్లవనీ ఈ దావాలో పిఎబిసి వాదించింది తనకు మాత్రమే అధికారం ఉందనింది. అది వాస్తవమే. గానీ పిఎబిసి కి ఉండే అధికారం సంపూర్ణమైనదా లేక పరిమితమైనదా అనేది వేరే ప్రశ్న. ఆ పరిమితి ఏమిటనేది ఇంకొక ప్రశ్న పిఎబిసి తన వ్యవహార నియమావళిని పాటించినంత కాలం అది ఎటువంటి క్రయవిక్రయాలను చేపట్టినా అవి చెల్లుబాటు అవుతాయనేది పిఎబిసి వాదన. ఇది నిజం కాదనీ, ట్రస్ట్ లక్ష్యాలకు అనుగుణంగా ఉండే క్రయవిక్రయాలు మాత్రమే చెల్లుబాటు అవుతాయనీ ఇప్పటికే వివరించి ఉన్నాము. కర్నూలు లో 'పాలము అభివృద్ధి సమాజము' లేక 'పాలము సమాజం' ఇచ్చిన పవర్ ఆఫ్ అటార్నీ గ్రహీతలు చేసిన అమ్మకాలేవీ చెల్లు బాటుకాకపోగా పిఎబిసి స్వయంగా చేపట్టిన ఏ ఒక్క అమ్మకమయినా ట్రస్ట్ లక్ష్యాల వెలుగులో చెల్లుబాటవుతుందా అనేది సందేహాస్పదమే. ట్రస్ట్ లక్ష్యాలను పక్కన పెట్టి కేవలం వ్యవస్థాపక నియమావళిని దృష్టిలో పెట్టుకొని ఒక సాధారణ వర్తక కంపెనీని చూసినట్లే పిఎబిసిని చూడడం, అది చేపట్టిన అమ్మకాలను ఆ ప్రాతిపదికన సమర్థించడం సబబుకాదు.

కేసు పాటికి కేసే, అమ్మకం పాటికి అమ్మకమేనన్నట్లు కర్నూలులో అమ్మకాలు కొనసాగాయి. 'కర్నూలు పాలము బాప్టిస్టు సంఘముల అభివృద్ధి సమాజము' మూతపడింది. దాని స్థానంలో అసలు పాలము సమాజం, అంటే 'కర్నూలు పాలము బాప్టిస్టు సంఘముల సమాజము'రంగములోకి దిగింది. దీని మేనేజ్ మెంట్ కమిటీ నుండి ఒకరి తరువాత ఒకరు పవర్ ఆఫ్ అటార్నీలు పొంది అమ్మకాలు కొనసాగించారు. 1983-84 లో జెరెమియ, దేవవరం గారలు చేపట్టిన అమ్మకం విషయం చూసాము. వాళ్ళు (అప్పటి ధరలలో) 17 లక్షల 5 వేల రూపాయలు విలువ చేసే 34.25 సెంట్లు భూమిని అమ్మడమేకాక ఎస్.వి.నాగిరెడ్డికి టి.జి వెంకటేశ్ కు భూములు, బిల్డింగులు 44 సంవత్సరాలకు లీజుకు ఇచ్చారు.

వీరి తరువాత పవర్ ఆఫ్ అటార్నీ పొందిన వారు రెవరెండ్ డి. జేమ్స్, రెవరెండ్ బి.శ్యాంరాజుగారలు వీరికి పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చిన మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు (శ్రీయుతులు రెవరెండ్ జాకబ్, రెవరెండ్ డి. సజీవరాజు, బి. ఐజయ్య, జి.గిడియోన్, రెడ్డిపోగు శేషన్న, రెడ్డిపోగు విజయసామ్యూల్, రెవరెండ్ యస్. జయకర్ క్రిష్టియన్, రెవరెండ్ సిరిగిరి దేవపాల్ 1985లో ఈ యిద్దరూ అమ్మకాలు చేపట్టారు. జి. పుల్లారెడ్డి చారిటీట్రస్ట్‌కు 82 లక్షలు విలువ చేసే 1.65 ఎకరాలు అమ్మారు. 5సెంట్లు చొప్పున (వెల 2 లక్షలు) అనేక మందికి ఇళ్ళ ప్లాట్లు కోసమని భూములు అమ్మారు. కొనుక్కున్న వారిలో అమ్మిన వారికి పవర్ ఆఫ్ అటార్నీ యిచ్చిన మేనేజ్ మెంట్ కమిటీ సభ్యులందరూ ఉన్నారు! వారితో కలుపుకొని బాప్టిస్టు క్రైస్తవులు మొత్తం 43 మంది ఉన్నారు. ఇందులో అధిక భాగం మళ్ళీ మేనేజ్ మెంట్ కమిటీ సభ్యుల బంధువులు లేక సన్నిహితులే. వీరంతా టీచర్లు లేక చిన్న ఉద్యోగులు. బాప్టిస్టు క్రైస్తవులలో అత్యధికులు నిరక్షరాస్యులు, దరిద్రులు కాగా, కొద్దిమంది మాత్రం కొంచెం చదువు పలుకుబడి హోదా ఉన్నవారు. వీరిలో కొందరు గ్రూపులుగా ఏర్పడి తమకు తాము 'పాలము

సమాజం' మేనేజ్ మెంట్ కమిటీగా ప్రకటించుకొని తమలోనే కొందరికి పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చి తాము, తమ ఆశ్రితులే చర్చి ఆస్తులు కొనుగోలు చేస్తున్నారు. ఈ వ్యవహారాన్ని కాపాడడానికి డబ్బులు సంపాదించు కోవడానికీ వైశ్య వ్యాపారులకూ ఫాక్షనిస్టులకూ పలుకుబడిగల వారికీ ఆస్తులు అమ్మారు, లీజుకు ఇచ్చారు. దీనిని సమర్థించుకోవడానికి, అమెరికన్ మిషనరీలు ఈ ఆస్తులను బాప్టిస్టు క్రైస్తవుల పాలము సమాజానికి అప్పగించి పోయారనీ, పాలము సమాజం మేనేజ్‌మెంట్ కమిటీకి ఈ ఆస్తిపైన అన్ని రకాల హక్కులు ఉన్నాయనీ వాదిస్తున్నారు. ఇందులో ఎంతమాత్రం సత్యం లేదు. అమెరికన్ మిషనరీలు అప్పగించి పోయింది. ఆయా జిల్లా 'పాలము సమాజములకు' కాదు పిఎబిసికి అది కూడ ఒక వ్యాపార కంపెనీగా కాదు. ఒక ట్రస్టీగా. 'సువార్త ప్రచారం, సమాజసేవ' కార్యకలాపాల కోసం ఆస్తులను వినియోగించే బాధ్యత గల ట్రస్టీగా. ఇప్పుడు విద్యావంతులయిన బాప్టిస్టు క్రైస్తవులలోనే కొంత మంది నిజాయితీ పరులు ముందు కొచ్చి చర్చి ఆస్తుల దుర్వినియోగాన్ని ఎదుర్కొనడానికి సిద్ధపడడంతో అన్ని సత్యాలూ బయటి కొస్తున్నాయి.

రెవరెండ్ జేమ్స్, రెవరెండ్ శ్యాంరాజు గార్ల పవర్ ఆఫ్ అటార్నీ 1985 నుండి 1987 దాకా నడిచింది. దాదాపు 80 లక్షలు రూ॥లు విలువగల ఆస్తి అన్యాక్రాంతం అయింది. 1988 లో శ్రీయుతులు ఎం.ఎస్. జెరెమియ పి. దేవరాజ్ లు పవర్ ఆఫ్ అటార్నీ పొందారు. వీళ్ళ ద్వారా బదలాయింపుకు గురయిన 54 సెంట్ల భూమి ఆరుగురికి దక్కింది. అందులో ఒకరు మాత్రమే బాప్టిస్టు క్రైస్తవుడు. ముగ్గురు రెడ్లు వారిలో ఎస్.వి. నాగిరెడ్డి మళ్ళీ ఒకడు. అతను 2.8 లక్షలు ఖరీదు చేసే 5.5 సెంట్ల భూమి పొందాడు. వీరారెడ్డి అనే పబ్లిక్ ప్రాసిక్యూటర్ భార్య, సుబ్రహ్మణ్యం అనే (చనిపోయిన) న్యాయవాది భార్య కూడ చెరి అంతే భూమి పొందారు. దాదాపు అదే దశలో పిఎబిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా

ఉండిన గుండెమడుగుల దేవదానం గారు పిఎబిసి నుండి పవర్ ఆఫ్ అటార్నీ పొంది ఎస్‌టిబిసి కాలేజీ ప్లేగ్రౌండ్స్‌లో 37 సెంట్లు జాగాను ఆ కాలేజీ ప్రిన్సిపాల్ అయిన వూలా న్యూటన్ సోమసుందరంగారి బావమరిది అయిన కె.జోసఫ్ పేరు మీద నంది కొట్కూరు ఫాక్షనిస్టు బైరెడ్డి రాజశేఖర రెడ్డికి బేనామీగా అమ్మే ప్రయత్నం చేసాడు. ఆ స్థలంలో బైరెడ్డి ఒక ఓపెన్ ఎయిర్ బార్ నిర్మించే ప్రయత్నం చేయబోగా జిల్లా స్పోర్ట్స్ అధారిటీ అభ్యంతరం తెలిపింది. బాప్టిస్టు క్రైస్తవులు ఒక గుంపుగా పోయి ఆకట్టడాన్ని కూల్చి నందికొట్కూరు పాలెగాడి ఆక్రమణను ఆపారు. అంతకు ముందు కూడ అదే దేవదానం పిఎబిసి పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్‌గా తమ సంస్థ న్యాయవాది అయిన కె.వి.చలపతిరావు అనే బ్రాహ్మణ వకీలు మామగారయిన తాడిపత్రి నివాసి కె.సుబ్బారావు గారికి రెండు డాక్యుమెంట్ల ద్వారా 47 సెంట్లు లీజుకు ఇచ్చాడు. ఈ సుబ్బారావుకూ పైన పేర్కొన్న కె.జోసెఫ్‌కూ కలిసి ఉమ్మడిగా ఇంకొక 37 సెంట్లు లీజు ఇచ్చారు. ఇది కొత్త లీజుకాదనీ 'పాలము సమాజం' అంతకుముందు ఇచ్చిన లీజు క్రమబద్ధీకరణ అనీ పున్నయ్య గారి రిపోర్టును బట్టి తెలుస్తుంది.

ఈ విధంగా పిఎబిసి, 'కర్నూలు పాలము సమాజము' ఒకరి మీద ఒకరు నెపం పెట్టుకుంటూ అమ్ముకొంటూ ఉంటే వీరిద్దరినీ ఆపడానికి 1991లో ఒక కొత్త ప్రయత్నం మొదలయుంది. ఆ సంవత్సరం పై ఇద్దరినీ ప్రతివాదులుగా పేర్కొంటూ కర్నూలు సబ్ కోర్టులో ఒక సూటు (ఒ.ఎస్ 36/91) దాఖలయింది. దాఖలు చేసింది 'తెలుగు బాప్టిస్టుక్రైస్తవుల ఆస్తుల పరిరక్షణ సంఘం'. అప్పటివరకు ఒకసారి వాదిగా ప్రతివాదిగా కోర్టుముందు నిలబడుతూ మధ్యలో ఆస్తులు అమ్ముకుంటున్న వారంతా ఇప్పుడు ఉమ్మడిగా ప్రతివాదులయ్యారు. వారితో పాటు వారి నుండి ఆస్తులు కొనుక్కున్నవారు కూడ నిలబడ్డారు. ఈ అక్రమాలకు మౌనంగా ఆమోదం పలుకుతున్న మునిసిపల్ రిజిస్ట్రార్ ఆఫీసుల అధికార్లు కూడ ప్రతివాదులయ్యారు. మొత్తం ప్రతివాదుల సంఖ్య 88.

ఈ సూట్ దాఖలు చేయడంకంటె ముందే (1989లో) క్రైస్తవ ఆస్తుల పరిరక్షణ సంఘం వారు క్రైస్తవ ఆస్తులను అమ్మినవారిని వారి నుండి కొనుక్కున్న వారినీ భూమి దురాక్రమణ దారులుగా పేర్కొంటూ హైదరాబాద్‌లోని ల్యాండ్ గ్రాబింగ్ (ప్రొహిబిషన్) కోర్టులో కేసువేసారు. (కేసునెం. 33/89). ఆకేసును ఆకోర్టు 1992లో కొట్టేసింది. వారంతా డబ్బు పెట్టి ఆ ఆస్తులను కొనుక్కున్న వారే తప్ప ఏ హక్కులూ లేని దురాక్రమణ దారులు కారనింది ఆ కోర్టు. ఏదో ఒక హక్కు చూపించి అమ్మినవారి దగ్గరి నుండి ఎంతో కొంత ఇచ్చి కొనుక్కున్నట్టయితే అది 'ఖబ్జా' లేక దురాక్రమణ క్రిందికి రాదనీ, కాబట్టి ల్యాండ్ గ్రాబింగ్ (ప్రొహిబీషన్) కోర్టు పరిధిలోకి రాదనీ ఆ కొనుగోలు పూర్తిగా చట్ట బద్ధంగా జరిగిందా లేదా అని చూసే అధికారం సివిల్ కోర్టులదే తప్ప తనది కాదనీ ఆ కోర్టు అభిప్రాయపడింది. అంత వరకు బాగానే ఉంది. కానీ ల్యాండ్ గ్రాబింగ్ (ప్రొహిబిషన్) కోర్టు అక్కడితో ఆగిపోలేదు. బాప్టిస్ట్ క్రైస్తవ ఆస్తుల యజమాని పిఐబిసియేనన్న వాదనను ఆ కోర్టు ఒప్పుకోలేదు. అది తన ఆస్తేనన్న 'పాలం సమాజం' వాదనను తిరస్కరించలేదు. 1974లో మద్రాసు హైకోర్టులో అమెరికన్ మిషనరీలు దాఖలు చేసిన కంపెనీ విలీన పిటిషన్‌లో తమ ఆస్తినంతా పిఐబిసికి అప్పగించారు కదా అంటే ఆపిటిషన్‌లో 'కర్నూలు పాలము బాప్టిస్టు సంఘముల సమాజాన్ని' వాళ్ళు పార్టీగా చేర్చలేదనీ అందువల్ల ఆ కంపెనీల విలీనాన్ని ఆధారం చేసుకొని ఈ ఆస్తి అంతా పిఐబిసికి చెందుతుందని చెప్పలేమనీ ల్యాండ్ గ్రాబింగ్ (ప్రొహిబిషన్) కోర్టు అభిప్రాయపడింది.

ఇది ఆమోదనీయం కాదు. ఒకరు తమ ఆస్తిని మరొకరికి అప్పగించేటప్పుడు ప్రపంచంలోని అందరిని 'పార్టీ' చేయనవసరం లేదు. ఏవయినా హక్కులు ప్రకటించుకున్న వాళ్లకు చేయవలసి ఉంటుంది. 1974 దాకా ఆ ఆస్తి అమెరికా మిషనరీలదేననడంలో ఎవరికీ సందేహం లేదు. ఆ తరువాత ఎవరిదనేదే ప్రశ్న. అది ముందు నుండి తమ ఆస్తేననీ అమెరికా

మిషనరీలకు దాని పైన హక్కులేదనీ కర్నూలు పాలము సమాజము సహితం ఎప్పుడూ వాదించలేదు. అది మిషనరీలుకొనిన, లేక కట్టించిన ఆస్తేననీ అయితే వాళ్లు దానిని తమకు అప్పగించారనీ పాలం సమాజం అనింది. ఆ అప్పగింతకు సంబంధించిన ఏ కాగితాలూ ఈనాటి దాకా చూపించలేదు. స్థిరాస్తుల బదలాయింపుకు నోటి మాట సరిపోదు. కర్నూలు రెవెన్యూ రికార్డులు వెతికినా పాలము సమాజం పేరు ఎక్కడా లేదు. ఈనాటికీ ఆ ఆస్తులన్నీ రెవెన్యూ రికార్డులలో మిషనరీల పేరు మీదనే ఉన్నాయి. వాటిని తాము ఎవరికి అప్పగించిందీ అమెరికా మిషనరీలు 1974లో మద్రాసు హైకోర్టులో దాఖలు చేసిన కంపెనీ పిటిషన్‌లో స్పష్టం చేసారు. వాళ్లు అప్పగించింది పిఎబిసికి.

మొత్తానికి ల్యాండ్ గ్రాబింగ్ (ప్రొహిబిషన్)· కోర్టు (కొంత సహేతుకంగా, కొంత అహేతుకంగా) కొట్టేసిన కేసు కర్నూలు సబ్‌కోర్టులో ఒఎస్ నెం.36/91 గా ఈనాటికీ కొనసాగుతూఉంది. సబ్‌కోర్టు అమ్మకాలను నిషేధిస్తూ ఇంజంక్షన్ జారీ చేస్తూ, ఆస్తుల పరిస్థితి నివేదిక తయారు చేయడానికి ఒక కమిషనర్‌ను, ఆస్తుల సంరక్షణ కోసం ఒక రిసీవర్‌ను అపాయింట్ చేసింది.

ఈ పాలెగాళ్ళ రాజ్యంలో రిసీవర్‌పని సులభమయినది కాదు. అమ్మకాలు ఆగిపోయినా దురాక్రమణ ఆగిపోలేదు. ఫాక్షనిస్టులే వాటిని ప్రోత్సహిస్తున్నారు. ఆక్రమించుకున్న వాళ్ల దగ్గర వాళ్లు (అది తమ ఆస్తి అయినట్లు) కిరాయి వసూలు చేసుకుంటున్నారు. కోర్టు రిసీవర్ అడ్డంపోతే నీకు దిక్కున్న చోట చెప్పుకోపొమ్మంటున్నారు. విసిగిపోయిన కోర్టు రిసీవర్ జిల్లా కలెక్టర్‌కు 1994 మార్చి 28నాడు రాసిన ఉత్తరం ఈ స్థితికి చక్కగా అద్దం పడుతుంది. కలెక్టర్ తనకు తగిన పోలీసు రక్షణ కల్పించాలని కోరుతూ, ఆయన ఈ విధంగా అన్నాడు.

''ఆస్తులను కోర్టు రిసీవర్‌గా నా స్వాధీనంలోకి తీసుకునే క్రమంలో, చాలా మంది చిన్న చిన్న దురాక్రమణదారులు ఉన్న సంగతి నేను

గమనించాను. ఎస్‌టిబిసి కాలేజి కాంపౌండ్‌లో ఇసిఎం కాంపౌండ్‌లో, రాక్‌వుడ్ కాంపౌండ్‌లో వీళ్ల గుడిసెలు అంగళ్లు ఉన్నాయి. వాళ్లకు ఏ హక్కూ లేదు. వాళ్లను ఎస్.వి.సుబ్బారెడ్డి, ఎస్.వి.నాగిరెడ్డి, కె.ఇ.ప్రతాప్ ప్రోత్సహిస్తున్నారు. వాళ్ల దగ్గర వీళ్లు చట్టవిరుద్ధంగా బాడుగ వసూలు చేసుకొని, వాళ్లకు రక్షణ కల్పిస్తున్నారు. నేను దురాక్రమణదారుల దగ్గరకుపోయి మీరిక్కడ నుండి వెళ్లిపోండి, లేదా కోర్టు రిసీవర్‌నయిన నా దగ్గర ఈ స్థలాలు లీజుకు తీసుకొని నాకు బాడుగ చెల్లించండి అన్నాను. వాళ్లు రెండు పనులూ చేయము పొమ్మంటున్నారు. పైనాయకులు వాళ్లను రెచ్చగొడుతున్నారు. కోర్టు నాకు ఇది వరకు పోలీసు సహాయం ఇప్పించింది. అయితే నేను నాతోబాటు పోలీసులను తీసుకొనిపోయినప్పటికీ వాళ్లు దురాక్రమణదారులను తొలగించడంలో నాకు సహకరించలేకపోయారు. ఈ నాయకులను నొప్పించడానికి పోలీసులు సిద్ధంగా లేరు. గత రెండు సంవత్సరాలుగా నేను ఎంత ప్రయత్నించినా కొద్ది మంది నుండి మాత్రమే బాడుగలు వసూలు చేసుకోగలిగాను. ఇప్పుడు పై ముగ్గురు నాయకుల ప్రోద్బలంతో వాళ్లు కూడ చెల్లించడం మానేసారు. కోర్టు ఆర్డర్ ప్రకారం, దురాక్రమణదారులందరినీ తొలగించి ఆస్తిని స్వాధీనం చేసుకునే అధికారం నాకుంది. దీనికి బలమయిన పోలీసు బందోబస్తు కావాలి. ఎందుకంటే అవతలి వైపు బలవంతులయిన రాజకీయ నాయకులున్నారు.''

కలెక్టర్ ఆయనకు బలమైన పోలీసు బందోబస్తు ఇప్పించనూలేదు ఆయన దురాక్రమణదారులను తొలగించనూలేదు. దురాక్రమణ పెరుగుతూ ఉంది.

కేసు దాఖలు చేసిన తెలుగు బాప్టిస్టు క్రైస్తవ ఆస్తులు పరిరక్షణ సంఘం కోర్టులోపలా, బయటా తన కృషి కొనసాగిస్తూనే ఉంది. 'కర్నూలు పోలము సంఘముల సమాజము' అనే దానికి ఈ ఆస్తులపైన ఏ అధికారంలేదు. ఆ పోలము సమాజం ఇచ్చిన పవర్ ఆఫ్ అటార్నీలు చెల్లవు. ఆ పవర్ ఆఫ్ అటార్నీల ద్వారా జరిగిన అమ్మకాలేవీ చెల్లవు. కర్నూలులో జరిగిన అమ్మకాలలో అత్యధికం ఈ రకంగా జరిగినవే కాబట్టి అవేవీ చెల్లవు. దురదృష్టవశాత్తు వారి పిటిషన్ సాంకేతిక సమస్యలలో చిక్కుకొనిపోయింది.

ట్రస్ట్ ఆస్తులకు సంబంధించిన దావాలు జిల్లా కోర్టులో వేయాలి తప్ప సబ్‌కోర్టులో కాదని ప్రతివాదులు వాదించారు. సబ్‌కోర్టు 1995లో వారి వాదనకు ఒప్పుకొని. పిటిషన్‌ను 'సరయిన కోర్టులో దాఖలు చేయండి' అంటూ వెనక్కి ఇచ్చింది. అయితే పిటిషనర్లు హైకోర్టుకు పోయి ఈ ఆర్డర్‌ను సస్పెండ్ చేయించుకున్నారు. ఈ ఆర్డర్‌పైన తుది తీర్పు వచ్చేదాకా కేసు ముందుకు పోదు.

ఇప్పటికి అమ్మివేయబడిన ఆస్తుల వెల (ఆయా ఆస్తులను అమ్మినప్పటి ధరలో) 2 కోట్ల 26 లక్షలు ఉంటుందనీ, లీజుకు ఇచ్చిన ఆస్తుల కిరాయి సంవత్సరానికి 2 లక్షల రూపాయలు ఉంటుందనీ పిటిషనర్లు అంచనావేసారు. దీని అర్థం ఆ ఆస్తులను అమ్మిన వాళ్ళు అంత మొత్తం సంపాదించుకున్నారని కాదు. వాళ్ళు నిజానికి చాలా చవగ్గా అమ్మినట్టున్నారు. 'అమ్మిన ధర కంటె మార్కెట్ ధర చాలా ఎక్కువ ఉంటుంది' అని బాప్టిస్టు క్రైస్తవ ఆస్తుల పరిరక్షణ సంఘం తన పిటిషన్‌లో పేర్కొనింది. రిజిస్ట్రేషన్ రికార్డుల ప్రకారం 2.26 కోట్ల రూపాయలు విలువచేసే ఈ భూమిని కేవలం 18.73 లక్షలకే అమ్మినట్టు తెలుస్తుంది. రిజిస్ట్రేషన్ కోసం అమ్మిన ధరను తక్కువ చేసి చూపించడం పరిపాటిగానీ, ఇందులో కొంత భాగం నిజంగానే చాలా చవగ్గా అమ్మారు. అప్పటి ఒక అమ్మకందారు మాటలలోనే, 'అప్పటి ధరలలో సెంటు 50 వేలు ఉన్న భూమిని పుల్లారెడ్డికి, కె.ఇ.సోదరులకు 10 వేలకు అమ్మాము'. రిజిస్టర్ చేసింది 7 లేక 8 వేలకు. ఎస్.వి.నాగిరెడ్డికి నెలకు 200/- చొప్పున 44 సంవత్సరాలు లీజుకు ఇచ్చిన రాక్‌వుడ్ బంగ్లాను నెలకు 1000 రూపాయల అద్దెకు ఇచ్చారు. రిజిస్టర్ చేసిన లీజు నెలకు 200 రూపాయలు. దానిమీద ఇప్పుడు ఎస్.వి.నాగిరెడ్డి కర్నూలు పబ్లిక్ స్కూలు యాజమాన్యం నుండి నెలకు 6000 అద్దె పొందుతున్నాడు. తనకు లీజుకు ఇచ్చిన వారికి 1000 కాదు, 200 కాదు, ప్రస్తుతం ఏమీ ఇవ్వడం లేదు! నిజానికి ఈ 'పెద్ద మనుషుల' కు అమ్మిన వాళ్ళు పొందింది చాలా తక్కువ. కె.ఇ.సోదరులకు 14.50 సెంట్ల భూమి 1 లక్ష 50 వేలకు అమ్మానని

అమ్మిన ఆయన అంటుండంగా 2 లక్షల 55 వేలు పెట్టి కొనుక్కున్నామని వాళ్లు అంటున్నారు. ఎంతకు కొన్నారో గానీ ఆ మొత్తాన్ని కె.ఇ.వాళ్లు మళ్లీ వెనక్కు తీసేసుకున్నారు. 'కోర్టులో కేసులున్నాయి కదా కేసులయిపోయిన తరువాత వడ్డీతో సహా కట్టి ఇస్తాములే' అన్నారట. కేసులు అయిపోతే గియిపోతే వీళ్లకు అడిగే ధైర్యం ఉండాలికదా! వాళ్లు మాత్రం ఈ రకంగా ఉద్ధరకు పొందినవిలువయిన భూమిని రకరకాల దుకాణాలకు అద్దెకిచ్చి దర్జాగా డబ్బు చేసుకుంటున్నారు. కోర్టు నియమించిన రిసీవర్ ఆ అద్దెలు తనకు చెల్లించాలని అడగబోతే అతన్ని వట్టి చేతులతో వెనక్కి పంపించారు. ఆయన జిల్లా కలెక్టరుకు పెట్టుకున్న మొర ఇప్పటికే చదివారు కదా! మరి వీళ్లకు అమ్మిన హక్కులు లేని పవర్ ఆఫ్ అటార్నీ గ్రహీతలు సాధించింది ఏమిటంటే తమకు లేని హక్కులు ధృవీకరించుకోవడం. నిజానికి వాళ్లు కోరుకున్నదీ అదే. ఆ బలంతో ఇతరులకు (చిన్న చితక మనుషులకు) మార్కెట్ రేటుకే అమ్ముకోవచ్చు. అందులో కూడ తమ బంధుమిత్ర వర్గాలకు బాగా చవగ్గా అమ్మినట్టున్నారు. తక్కిన వాళ్లకు మాత్రం మంచిరేట్లకు అమ్మారు. ఎంతకు అమ్మినా ఆ డబ్బు ఏ పొలము సమాజం అకౌంట్‌లోకీ పోలేదు. అమ్మిన పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ల స్వంత అకౌంట్‌లోకే పోయింది.

కర్నూలు సబ్‌కోర్టులో ఇప్పుడు ఈ ఆస్తుల బదలాయింపుకు సంబంధించి రెండు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒకటి పిఎబిసి 1984లో వేసిన కేసు. రెండవది కర్నూలు బాప్టిస్టు క్రైస్తవ ఆస్తుల పరిరక్షణ సంఘం 1991లో వేసిన కేసు. ఈ కేసులు ఇప్పట్లో తేలవు. తేలినా అంచెలంచెలుగా సుప్రీంకోర్టుదాకా పోతాయి. అయితే ఒక న్యాయమూర్తి అభిప్రాయం ఇప్పటికే వెలువడింది. ఇది కోర్టు తీర్పుకాదు. జస్టిస్ పున్నయ్య గారి ఆర్బిట్రేషన్ రిపోర్టు. 1979 నుండి జరిగిన అన్ని అమ్మకాల చట్టబద్ధత గురించి విచారించడానికి మద్రాసు హైకోర్టు ఆయనను ఆర్బిట్రేటర్‌గా నియమించిందని చెప్పాము. ఆర్బిట్రేటర్ అభిప్రాయం కోర్టు తీర్పుతో

సమానం కాదు. అయితే వ్యాజ్యంలోని ఇరుపక్షాలకూ అది శిరోధార్యం. అంటే పిఎబిసిలోని ఇరువర్గాలకూ అది శిరోధార్యం. వారు ఆ నివేదికను తప్పనిసరిగా అమలు చేయాలి. అయినా ఇప్పటి దాకా వారు ఆ ప్రయత్నమేమీ చేయలేదు.

కర్నూలులో జరిగిన బాప్టిస్టు క్రైస్తవ ఆస్తుల అమ్మకాన్ని గురించి జస్టిస్ పున్నయ్య వెలిబుచ్చిన అభిప్రాయాన్ని రెండుగా విడగొట్టి చెప్పవచ్చును.

(i) 'కర్నూలు పాలము బాప్టిస్టు సంఘముల సమాజము' ద్వారా (లేక కొంతకాలం దానికి ప్రత్యామ్నాయంగా వెలిసి అమ్మకాలకు నాంది పలికిన 'కర్నూలు పాలము బాప్టిస్టు సంఘముల అభివృద్ధి సమాజము' ద్వారా గానీ) జరిగిన అమ్మకాలలో ఏ ఒక్కటీ చెల్లదు. అన్యాక్రాంతమైన ఆ ఆస్తులన్నిటినీ పిఎబిసి వారు వెనక్కి తీసుకోవడానికి చట్టపరమైన చర్యలు చేపట్టాలి.

(ii) పిఎబిసి ద్వారా జరిగిన అమ్మకాలు, లేదా ఇతరుల ద్వారా జరిగినా పిఎబిసి ఆమోదం పొందిన అమ్మకాలు, చెల్లుతాయి.

ఇందులో (i) గురించి ఇంక చెప్పవలసిందేమీ లేదు. 'పాలము సమాజం' అనే దానికి బాప్టిస్టు క్రైస్తవ ఆస్తులపైన ఏలాంటి అధికారం లేదన్న పున్నయ్యగారి అభిప్రాయం సబబయినదే. పాలము సమాజానికి యాజమాన్య హక్కులే లేనప్పుడు వారు చేపట్టిన అమ్మకాలేవీ చెల్లవు. కాబట్టి కె.ఇ.సోదరులు సర్వేనెం.98/3 లో (రాక్‌వుడ్ మెమోరియల్ హైస్కూల్ కాంపౌండ్‌లో) కొన్ని రకాల అంగళ్లకు అద్దెకిచ్చుకున్న 14.5 సెంట్ల కొనుగోలు చెల్లదు. నేతి మిఠాయి పుల్లారెడ్డి కొడుకులు సర్వేనెం.99/2B-1 లో (కొషెడ్ అని పిలవబడే రాక్‌వుడ్ మెమోరియల్ హౌస్ కాంపౌండ్‌లో) కొనుక్కున్న 5.25 సెంట్ల కొనుగోలు చెల్లదు. ఎస్.వి.నాగిరెడ్డి సర్వేనెంబర్.123లో (అంటే ఇసిఎం స్కూలు ఆవరణలోని గరల్స్ హాస్టల్ పక్కన) కొనుక్కొని ఆటోగ్యారేజి పెట్టించిన 5.50 సెంట్ల కొనుగోలు,

సర్వేనెంబర్.115లో (అంటే ఎస్‌టిబిసి కాంపౌండ్) తీసుకున్న బిల్డింగ్ లీజు, 2900 చదరపు గజములు భూమి లీజు చెల్లవు. ఇందులో ఒక ఎస్‌టిడి బూత్, ఒక ఫాస్ట్ ఫుడ్ అంగడి, జిరాక్స్ షాపు, రెండు మెకానిక్ షాపులు, ఒక ఫోటోల్యామినేషన్ షాపు వగైరా అంగళ్ళు పెట్టించి హాయిగా అద్దె వసూలు చేసుకుంటున్నాడు. పుల్లారెడ్డి ట్రస్ట్ సర్వేనెంబర్.99/2B-1లో (అంటే కొషెడ్ అనిపిలవబడే రాక్‌వుడ్ మెమోరియల్ హాస్ కాంపౌండ్‌లో) కొనుక్కున్న 1.65 ఎకరాల కొనుగోలు చెల్లదు (ఈ భూమిలో ఈ విశ్వ హిందూపరిషత్ నాయకుడు రామాలయం నిర్మించబోతున్నాడన్న వదంతి విని గాభరాపడిన క్రైస్తవులు కొషెడ్‌ను చర్చిగా మార్చి ఆయనకు అడ్డం వచ్చారు. పుల్లారెడ్డికి ఆ భూమి అమ్మిన కె.ఎం.దేవవరంగారే ఈపని చేసారు!.) టి.జి. కుటుంబానికి చెందిన టి.జి. ప్రసాద్ తన తుంగభద్ర మెషీనరీ అండ్ టూల్స్ పేరు మీద సర్వేనెంబర్ 155A లో (అంటే ఇసిఎం స్కూలు ఆవరణలో నరసింగరావు పేటను ఆనుకొని ఉన్నచోట) కొనుక్కొని ఒక బేకరీకి ఒక పళ్ల దుకాణానికి, ఒక పెయింటర్ షాపుకు, ఒక హోటల్‌కు, ఒక స్కూటర్ గ్యారేజికి, ఒక సెలూన్‌కు అద్దెకిచ్చిన 4.25 సెంట్ల కొనుగోలు చెల్లదు. కీ.శే.అడ్వకేట్ సుబ్రహ్మణ్యం భార్య పార్వతీబాయి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీరారెడ్డి భార్య వెంకటసుబ్బమ్మ గారలు సర్వే నెం 123 లో (అంటే ఇసిఎం కాంపౌండ్‌లో) కొనుక్కున్న ప్లాట్ల కొనుగోలు చెల్లదు. అదే కాంపౌండ్‌లో సారాయి కాంట్రాక్టర్ సురేందర్ రెడ్డి లీజుకు తీసుకొని పెట్రోల్‌బంక్ పెట్టుకున్న 31 సెంట్ల లీజు చెల్లదు.

చట్టవిరుద్ధంగా అన్యాక్రాంతం అయిన ఈ ఆస్తిని వెనక్కి తీసుకోవడానికి తగు చర్యలు చేపట్టవలెనని జస్టిస్ పున్నయ్యగారు 1991లోనే సూచించినా పిఎబిసి ఇప్పటికి అటువంటి ప్రయత్నమేదీ మొదలు పెట్టలేదు. ఇప్పటికి ఆ భూమి 12 సంవత్సరాలుగా తమ అనుభవంలో ఉంది కాబట్టి ఒక వేళ పిఎబిసి స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నం చేసినా తాము వైదొలగబోయేది లేదని కె.ఇ. సోదరులలో ఒకరు పౌరహక్కుల సంఘంతో అన్నారు. ఈ

వాదన ప్రైవేట్ వ్యక్తుల ఆస్తులకు వర్తిస్తుంది కానీ ట్రస్ట్ ఆస్తులకు వర్తించదు. ట్రస్ట్ ఆస్తిని ఎన్నేళ్ళు అనుభవించినా దానిపైన హక్కులు పుట్టవు.

ఇంక (II) కు వద్దాము. పిఎబిసికి బాప్టిస్టు చర్చి ఆస్తులపైన యాజమాన్య హక్కు ఉందన్న పున్నయ్యగారి అభిప్రాయం సహేతుకమయినదే. అయితే పిఎబిసిది స్వతంత్ర యాజమాన్యం కాదు. అదొక ట్రస్టీ మాత్రమే. అమెరికన్ మిషనరీలు పిఎబిసిని ఒక ట్రస్టీ స్వభావంగల కంపెనీగా నెలకొల్పి చర్చి ఆస్తులను అప్పగించారు. 'సువార్త ప్రచారం, సంఘసేవ అనే ద్వివిధ లక్ష్యంగల ట్రస్ట్‌గా వారు తమ ఆస్తిని పిఎబిసికి అప్పగించారు. ఈ కంపెనీ వ్యవస్థాపక లక్ష్యాలను పైనచూసాము. ఆస్తులను కొనుక్కోవడం, పెంచుకోవడం దాని ప్రధాన లక్ష్యాలలో ఉన్నాయిగానీ, ఆస్తులను అమ్ముకోవడం, లీజుకు ఇవ్వడం దాని అనుబంధ లక్ష్యాలలో మాత్రమే ఉన్నాయి. అంటే ప్రధాన లక్ష్యాలయిన 'సువార్తప్రచారం, సమాజసేవ'లకు అనుబంధంగా వాటికోసం జరిగే అమ్మకాలు మాత్రమే చెల్లుతాయి. వేరేవి చెల్లవు. అమ్మకంలో సంస్థ తన వ్యవస్థాపక నియమాలను పాటించినట్లయితే అది చెల్లుతుందన్న పున్నయ్యగారి అభిప్రాయం సరయినది కాదు. వ్యవస్థాపక నియమావళిని పాటించవలసిందే. అయినప్పటికీ ఆ అమ్మకం వ్యవస్థాపక లక్ష్యాలకు అనుబంధంగా, అనుగుణంగా, ఉంటేనే చెల్లుతుంది. అమ్మకానికి సంబంధించిన నిర్ణయాలన్నీ నియమబద్ధంగా తీసుకున్నప్పటికీ, అది సంస్థ లక్ష్యాలకు తోడ్పడే అమ్మకం కాకపోతే చెల్లదు. పున్నయ్యగారి ఆర్బిట్రేషన్ రిపోర్టులో ఈ దృష్టిలోపించింది.

ఉదాహరణకు టి.జి.వెంకటేశ్ ఎస్‌టిబిసి కాంపౌండులో (సర్వే నెం 115 లో) తీసుకొన్న 2.34 ఎకరాల లీజును పరిశీలిద్దాం. దీనిని ఆయన లీజుకు తీసుకున్నది 'పాలము అభివృద్ధి సమాజం' పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ల నుండి. అయితే 1984 లో పిఎబిసి కర్నూలు సబ్‌కోర్టులో దావా దాఖలు చేసేసరికి టి.జి వెంకటేశ్ ఆలోచనలో పడినట్లున్నారు. తాను చేసిన కొనుకోలు చట్ట విరుద్ధం అని ఆయనకు అర్థం అయింది. కాబట్టి ఆయన

పిఎబిసి ద్వారానే తన కొనుగోలును క్రమబద్ధం చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. చట్టం కాపాడలేని ఆస్తులను బాంబులు కాపాడతాయని నమ్మడానికి ఆయన ఫాక్షనిస్టు కాదు. ఆయనతో పాటు చట్ట విరుద్ధంగా భూములు పొందిన కె.ఇ. సోదరులు, ఎస్.వి.నాగిరెడ్డి బహుశా ఆ ధీమాతోనే తమ కొనుగోలును క్రమబద్ధీకరించుకునే ప్రయత్నం చేయలేదు. టి.జి.వెంకటేశ్ ప్రయత్నించాడు. పిఎబిసి కూడ వెంటనే కనికరించి తాము కోర్టులో వేసిన దావాకు విరుద్ధంగా తామే అతని కొనుగోలును క్రమబద్ధీకరించారు. 'చర్చి ఆస్తులను సంరక్షించాలన్న ఆసక్తి ఉన్న కర్నూలు క్రైస్తవులను (వారెవరో!) సంప్రదించి ఈ నిర్ణయం తీసుకున్నాం' అని పున్నయ్యగారి ముందు పిఎబిసి బాధ్యులు చెప్పారు. పున్నయ్యగారు ఒప్పేసుకొని, చట్టవిరుద్ధంగా ఆ భూమి అన్యాక్రాంతం అయినప్పటికీ పిఎబిసి దానిని ఆ తరువాత క్రమబద్ధీకరించింది కాబట్టి టి.జి.వెంకటేశ్ తీసుకున్న లీజు చెల్లుతుందని తీర్మానించారు. తాడిపత్రికి చెందిన కె. సబ్బారావు తీసుకున్న లీజును కూడ ఇదే కారణంగా పున్నయ్యగారు సమర్థించారు. ఇది నిజానికి మరీ అభ్యంతరకరమైన వ్యవహారం. 'పాలము సమాజం' చేసిన అమ్మకాలు, ఇచ్చిన లీజులు, చెల్లవంటూ పిఎబిసి కర్నూలు సబ్‌కోర్టులో వేసిన కేసును వాదిస్తున్న న్యాయవాది కె.వి. చలపతిరావు ఈ సుబ్బారావు గారు ఆయన మామగారు. తమ వకీలు మామగారు తీసుకున్న లీజును మాత్రం పిఎబిసి అదే సమయంలో క్రమబద్ధీకరించింది. ఇది కూడ, 'చర్చి ఆస్తులను సంరక్షించాలన్న ఆసక్తి ఉన్న కర్నూలు క్రైస్తవుల' సలహామేరకే కాబోలు!

పున్నయ్యగారి అభిప్రాయం సరైనదేనా?

అది పిఎబిసి స్వంత ఆస్తి అయితే ఈరకమైన క్రమబద్ధీకరణ చెల్లుతుంది. స్వంత ఆస్తిని దొంగలకైనా దానం చేసుకోవచ్చు. కానీ ఆ ఆస్తికి పిఎబిసి ట్రస్టీ మాత్రమే. దానిని హక్కులేని వాళ్లు అక్రమంగా అమ్మేస్తే ఆ

తరువాత ట్రస్టీ అయిన పిఎబిసి దానికి ఆమోదముద్ర వేయవచ్చునా? ఆ అమ్మకం తన చేతుల మీదుగానే జరిగినట్టు ఒక కల్పన సృష్టించ వచ్చునా? ట్రస్ట్ ఆస్తిని పిఎబిసి అమ్మాలంటే అది తన ప్రధాన లక్ష్యాలయిన 'సువార్త వ్యాప్తి, సంఘసేవ'లకోసం అవసరం అయి ఉండాలి. లేదా దానికి అనుబంధంగా జరగాలి. కేవలం మంచి ధర పలుకుతుందనో, ఇప్పట్లో ఆ ఆస్తిని ఉపయోగించబోవడం లేదనో చెప్పి అమ్మివేయడానికి వీలులేదు. ఈ నిర్ణయానికి మేనేజ్‌మెంట్ కమిటీలో 7 మంది సమ్మతిఉండాలి. సంస్థ ఆడిటర్ లిఖితపూర్వక ఆమోదం ఉండాలి. ఇవన్నీ అమ్మకానికి ముందే ఉండాలి. అమ్మిన తరువాత కాదు. ఎవరో దొంగతనంగా అమ్మేసిన తరువాత రెండేళ్లకో మూడేళ్లకో ఆ అమ్మకానికి మేనేజ్‌మెంట్ కమిటీ ఆమోదముద్ర వేయడం 'ట్రస్టీ' అనే భావనను అభాసుపాలు చేయడం అవుతుంది. ఆ అమ్మకం ట్రస్ట్ లక్ష్యాల కోసం 'అవసరం' అని ట్రస్టీకి ఎప్పుడు తెలిసినట్టు? ఎవరో దొంగతనంగా అమ్మేసిన తరువాత రెండేళ్లకా? 'కర్నూలులోని క్రైస్తవులను మేము సంప్రదించాము. వాళ్లంతా టి. జి.వెంకటేశ్‌కు, కె.సుబ్బారావుకు లీజుకు ఇవ్వడం సరయినదే అన్నారు' అని వాళ్లంటే కోర్టు నమ్మవలసిందేనా? ఆ క్రైస్తవులు ఎవరు? వాళ్లతో సంప్రదింపులు ఎప్పుడు జరిగాయి?

ఇది అవినీతిని అక్రమార్జననూ క్రమబద్ధం చేయడం తప్ప వేరే ఏమీకాదు. 'పాలము సమాజము' అనే దానికి బాప్టిస్టు క్రైస్తవ ఆస్తులపైన హక్కేమీ లేదనే విషయం ఈ మధ్య కాలంలో ప్రచారం కావడంతో కర్నూలుకు చెందిన మిగిలిన కొనుగోలుదార్లు కూడ పిఎబిసి బాధ్యులను పట్టుకొని ఒక దశాబ్దం క్రింద తాము అక్రమంగా కొనుక్కున్న ఆస్తులను శాస్త్రోక్తంగా తిరిగి పొందుదామని ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తున్నది. పిఎబిసి పెద్దలు పున్నయ్యగారి అభిప్రాయాన్ని అడ్డం పెట్టుకొని ఆ తప్పుడు పని మరొకసారి చేయరని ఆశిస్తాము. తమ యాజమాన్యంలో ఉన్న ఆస్తులకు

తాము ట్రస్టీలు మాత్రమేనన్న స్పృహ వారిలో ఏమాత్రం ఉన్నా ఆ పని చేయరు.

రాక్‌వుడ్ మెమోరియల్ స్కూల్ కాంపౌండ్‌లో ఎస్‌టిబిసి కాలేజి అధ్యాపకులు 15 మందికి పిఎబిసి ప్లాట్లు అమ్మడాన్ని పున్నయ్య గారు వివరంగా చర్చించి సమర్థించారు. ఈ భూమిలో ఎక్కువభాగం మళ్ళీ రెండుసార్లు చేతులు మారి ఇప్పుడు ఆళ్లగడ్డ పాలెగాళ్ల చేతిలోకి వచ్చింది. కాబట్టి దీని విషయం కొంచెం చర్చించారు. ఆ 15 మంది అధ్యాపకులకు ఎస్‌టిబిసి కాలేజీ జీతాలు బకాయిపడింది. 1978లో కాలేజి ప్రభుత్వ గ్రాంట్ కోసం అర్జీపెట్టుకున్నప్పుడు అధ్యాపకులకు బకాయిపడిన జీతాలు ఈయవలసివచ్చింది. అప్పుడు కాలేజీ కరస్పాండెంట్ అధ్యాపకులకు నచ్చజెప్పి మొత్తం 6 లక్షల రూపాయలకు ఆ 15 మందికి బాండ్స్ ఇచ్చారు. అవి మూడు సంవత్సరాల తరువాత 'మెచ్యూర్' కాగా ఆ అధ్యాపకులు కోర్టుకు పోయి ఆర్డర్ తెచ్చుకున్నారు. అప్పుడు కాలేజీని కాపాడడానికి పిఎబిసి రంగంలోకి దిగి అధ్యాపకులకు ప్లాట్లు ఇచ్చి రుణం తీర్చుకోవాలని నిర్ణయించింది. మేనేజ్‌మెంట్ కమిటీ చేసిన ఈ తీర్మానం, ప్రకారం రాక్ వుడ్ మెమోరియల్ స్కూలు కాంపౌండ్‌లోని 1.05 ఎకరాల భూమి (సర్వే నెంబర్లు 98/4, 99/2లలో) వారికి ఇవ్వడం జరిగింది.

ఎస్‌టిబిసి కాలేజ్ ఒక విద్యాసంస్థ కాబట్టి, దానిని కాపాడడం కోసం ఈ అమ్మకం అవసరమయింది. కాబట్టి ఇది పిఎబిసి లక్ష్యాలకు అవసరమైన అమ్మకమేనని పిఎబిసి పున్నయ్య గారి ముందు వాదించింది. అమ్మినది నిరుపయోగంగా ఉన్న 'వ్యవసాయ భూమి' అని చెప్పింది. పున్నయ్య గారు ఒప్పేసుకున్నారు. తన రిపోర్టులో ఒకటికి రెండు సార్లు ఈ అమ్మకాన్ని ప్రస్తావించి అది సబబేనని ఆయన చెప్పారు.

నిజానికి అది 'వ్యవసాయ భూమి' కాదు. స్కూలు భూమే. స్కూలులో వ్యవసాయ పారిశ్రామిక శిక్షణ పాఠ్యాంశాలు తీసేసిన తరువాత ఆ భూమి రాక్‌వుడ్ మెమోరియల్ స్కూలు ఆవరణలో భాగంగా ఉంది. స్కూలు ఆవరణగానే జిల్లా విద్యాశాఖ రికార్డులలో అది నమోదయివుంది. ఒక స్కూలుకు ప్రభుత్వ గ్రాంట్ రావాలంటే కనీసం 5 ఎకరాల ఆవరణ (ఆటస్థలం వగైరా అవసరాల కోసం) ఉండాలని విద్యాశాఖ నియమాలు చెప్తాయి. ఈ భూమితో కలుపుకునే రాక్‌వుడ్ మెమోరియల్ స్కూలుకు 5 ఎకరాల ఆవరణ ఉంది. ఉంది కాబట్టే ఆ స్కూలుకు ప్రభుత్వ గ్రాంట్ వస్తూవుంది. ఇప్పుడు అన్యాక్రాంతం అయిన 1.05 ఎకరాలు తీసేస్తే రాక్‌వుడ్ మెమోరియల్ స్కూలుకు ప్రభుత్వ గ్రాంట్ రాకూడదు. విద్యాశాఖ పట్టించుకోకపోవడం వల్ల ఇంకా వస్తూ ఉంది.

ఎస్‌టిబిసి కాలేజి బాప్టిస్టు క్రైస్తవ ట్రస్ట్ బాధ్యత అయినట్టే రాక్‌వుడ్ మెమోరియల్ స్కూలు కూడ దాని బాధ్యతే. మొదటి సంస్థను కాపాడడానికి రెండవ సంస్థకు వచ్చే గ్రాంట్‌ను సంక్షోభంలో పడేయడం సబబేనా? గ్రాంట్ సంగతి అటుంచి, పిల్లల ఆట స్థలాన్ని అన్యాక్రాంతం చేయడం సబబేనా? రేపు ఆ స్కూలులో కొత్త క్లాసులు తెరచినా ఎక్కువ మంది పిల్లలను తీసుకున్నా ఆ స్కూలుకు భూమి అవసరంకాదా? ఎస్‌టిబిసి అధ్యాపకుల బాకీ తీర్చడానికి వేరే మార్గం ఉండలేదా? అప్పటికి పిఎబిసి వద్ద నగదు నిల్వలు లేవా? అప్పటికే రాష్ట్రంలో చాలా చోట్ల చాలా భూమిని పిఎబిసి అమ్మివుంది. ఆ డబ్బులో కొంత చెల్లించి ఉండవచ్చును కదా? అసలు ఆ డబ్బును ఏ అవసరాల కోసం వినియోగించినట్టు? ఈ లెక్కలు పరిశీలించకుండ, కాలేజీ అధ్యాపకులకు స్కూలు కాంపౌండ్‌లో ప్లాట్లు ఇచ్చేయడం తప్ప గత్యంతరంలేదని పిఎబిసి నిర్ణయిస్తే న్యాయమూర్తులు ఒప్పుకోవలసిందేనా?

ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించినదీ లేనిది సహేతుకంగా చూపించకుండ ఎస్‌టిబిసి లెక్చరర్లకు అప్పగించిన ఆ భూమి కనీసం ఆ పంతుళ్ల చేతిలోనయినా మిగలలేదు. 1.05 ఎకరాలలో 67 సెంట్లు వాళ్లు ఒక 'గుంతకల్ పార్టీ' కి అమ్ముకున్నారు. 13.40 లక్షలకు (సెంటు 20 వేల చొప్పున) అమ్మామని అంటున్నారు. కానీ రెవెన్యూ రికార్డులలో ఆ భూమి ప్రస్తుతం విజయవాడకు చెందిన సేవారాం హరేరాం, ఆనంద్ రాంచంద్, గిరిధర్‌లాల్ హరేరాం, అమర్‌లాల్ హరేరాం అనే మార్వాడీల పేరు మీద ఉంది. మరి వీళ్లే ఆ 'గుంతకల్ పార్టీ' యో లేక వాళ్ల నుండి వీళ్లు కొన్నారో లేక ఒకరు మరొకరికి బేనామీలో తెలీదు. కథ అక్కడితో ఆగిపోలేదు. ఈ సంవత్సరం (1996) జనవరి నుండి ఎస్.వి.నాగిరెడ్డి, అతని అన్న (రాష్ట్ర వ్యవసాయశాఖామాత్యుడు) కొడుకు ఎస్.వి.మోహన్‌రెడ్డి, ఆ భూమి తమదేనంటూ ఆక్రమించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. విజయవాడ మార్వాడీలు వీళ్లకు అమ్మారో, లేక దానిని తమ స్వాధీనంలోకి తీసుకోవడానికి ఈ ఆళ్లగడ్డ పాలెగాళ్ల అండ అవసరం అనిపించి సహాయం కోరారో తెలీదు. మొత్తానికి కాలేజీ అయ్యవార్లకిచ్చిన భూమిలో మూడింట రెండువంతులిప్పుడు ఎస్.వి.నాగిరెడ్డి పరం అయింది.

అయితే ఈ భూమిని స్వాధీనపరచుకొని ఇళ్ల ప్లాట్లకు గుర్తుగా రాళ్లు పాతడానికి ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో ఎస్.వి. మోహన్ రెడ్డి ప్రయత్నించగా, క్రైస్తవ ఆస్తుల పరిరక్షణ సంఘం వాళ్లు వివిధ స్కూళ్ళ విద్యార్థుల నాయకులు గుంపుగా పోయి ఆ రాళ్లను పీకేసారు. ఎస్.వి. మోహన్‌రెడ్డి కొందరు మనుషులను తీసుకొచ్చి ఘర్షణకు దిగాడు. విద్యార్థులను కొట్టి తరిమారు. ఈ దాడి జరిగేటప్పుడు అక్కడ పోలీసులు కూడ ఉన్నారు. అయిన ప్పటికీ ఆనాటి నుండి ఈనాటి దాకా ఆదాడికి పోలీసులు కేసునమోదు చేయలేదు. దాడి చేసినవారిని అరెస్టు చేయలేదు. అది ఎస్. వి వాళ్ల భూమి కాబట్టి ఆ భూమిలోకి చొరబడిన వాళ్లను

తరిమివేయడంలో తప్పు లేదనీ వాదించడానికి ఆస్కారంలేదు. ఎందుకంటే ఆనాడు ఆభూమి రెవెన్యూ రికార్డులలో మిషనరీల పేరుమీద ఉంది. అది తమ చేతిలోకి మారిందని చూపించడానికి ఎస్.వి. నాగిరెడ్డి, మోహన్‌రెడ్డి దగ్గర ఆధారాలేవీలేవు. తరువాతి కాలంలో రెవెన్యూ రికార్డులలో మిషనరీల స్థానంలో విజయవాడ మార్వాడీ సేఠ్‌ల పేర్లు ఎక్కాయి. అంతే తప్ప ఆ భూమిని స్వాధీన పరచుకోవడానికి సకల ప్రయత్నాలు చేస్తున్న ఆళ్ళగడ్డ పాలెగాళ్లకు హక్కులున్నట్టు లిఖిత పూర్వకమైన దాఖలాలేవీ లేవు.

వాళ్ల దగ్గర ఏవైనా దాఖలాలున్నా విజయవాడ సేఠ్‌ల దగ్గర కొన్నట్టు గానీ వారి ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నట్టుగానీ అసలు తొలినాడు పిఎబిసి ఆ స్కూలు భూమిని ఎస్‌టిబిసి లెక్చరర్లకు అమ్మడమే వివాదాస్పదం కాబట్టి వీళ్ల హక్కులకు బలం లేదు. ఆ తొలినాటి అమ్మకం చెల్లుతుందా లేదా అనేది కర్నూలు సబ్‌కోర్టులో నడుస్తున్న సూట్‌లో తేలవలసి ఉంది. ఆసూట్‌లో కొత్త అమ్మకాలపైన కోర్టు స్టే ఇచ్చింది. అయినప్పటికీ రాక్‌వుడ్ మెమోరియల్ స్కూలుకు చెందిన ఈ భూమిలో ప్లాట్లు వేసి అమ్మడానికి లేఅవుట్ మంజూరు చేయించుకునేప్రయత్నం ఎస్.వి. వాళ్లు చేస్తూనే ఉన్నారు. వాళ్లను కాదనే ధైర్యం కర్నూలు జిల్లా అధికారయంత్రాంగానికి ఉన్నట్టు ఇప్పటివరకు దాఖలాలు లేవు. ఈ ఆళ్లగడ్డ పాలెగాళ్లు అసలే బాంబుల రాజులు. పైగా ఈ మధ్య కాలంలో ఈ జిల్లా రాజకీయాలలో వీళ్లదే పైచేయి అయింది. ఆళ్లగడ్డ ఎంఎల్‌ఏ గా ఉన్న భూమానాగిరెడ్డి ఈ మధ్యనే నాలుగు లక్షలు మించిన మెజారిటీతో నంద్యాల ఎంపీగా ఎన్నికయ్యాడు. అతని మామగారు ఎస్.వి.సుబ్బారెడ్డి రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి. ఈ కుటుంబం ముఖ్యమంత్రికి ప్రస్తుతం సన్నిహితులనేది అందరికీ తెలుసును. అయినప్పటికీ భయపడకుండ వీళ్ల ఆక్రమణను అడ్డుకొనడానికి కంకణం కట్టుకున్న కొద్దిమంది బాప్టిస్టు క్రైస్తవులను అభినందించక తప్పదు.

# VI

అయితే ఇప్పుడు ఏమి జరగవలసి ఉంది? అన్యాక్రాంతం అయిన ఈ భూములన్నిటినీ ఆక్రమణదారుల నుండి వెనక్కి తీసుకోవలసి ఉంది. కొత్తగా చర్చి భూములు అన్యాక్రాంతం కాకుండా కట్టుదిట్టం చేయవలసి ఉంది. అన్యాక్రాంతం అయివ భూములకు సంబంధించి రెండు కేసులు కర్నూలు సబ్‌కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. ఒకటి పిఎబిసి 1984లో వేసిన కేసు. ఇంకొకటి బాప్టిస్టు క్రైస్తవ ఆస్తుల పరిరక్షణ సంఘం 1991లో వేసిన కేసు. రెండూ సివిల్ సూట్లే. పున్నయ్యగారు తన ఆర్బిట్రేటర్ రిపోర్టులో చెల్లవని ప్రకటించిన అమ్మకాలలో అన్యాక్రాంతమయిన భూములను వెనక్కి తీసుకోవడానికి పిఎబిసి 'తగుచర్యలు చేపట్టవచ్చును' అన్నారు. పిఎబిసి ఆపని ఇప్పటిదాకా చేయలేదు. ఒకవేళ చేయదలచినా అది కూడ సివిల్ సూట్ల రూపంలోనే ఉండవలసి ఉంటుంది. కానీ మొదట్లో చెప్పినట్టు, కోట్లాది రూపాయల విలువగల ఈ ఆస్తులను సివిల్ సూట్ల ద్వారా కాపాడడం జరిగేపని కాదు. అది 'ఇసుమున తైలమ్ముతీయడం' వంటిపని. ఒకవేళ అది జరిగినా, కొత్తగా పిఎబిసి పెద్దలు చర్చి ఆస్తులను అన్యాక్రాంతం చేయరని నమ్మకం ఏమిటి? వాళ్లలో వాళ్లకు తేడాలు ఉండడం వల్ల అమ్మకాలు మందగించినాయిగానీ లేకపోతే ఇంకెంత ఆస్తి ఈపాటికి పాలెగాళ్ల చేతిలోకీ, షాహుకార్ల చేతిలోకీ పోయేదో!

మిషనరీలు అప్పగించిన ఆస్తిని 'సువార్త ప్రచారం, సమాజసేవ' అనే లక్ష్యాల కోసం వినియోగించే ఆసక్తి పిఎబిసికి ఉంటే అవి ఆ లక్ష్యాల కోసమే ఉపయోగపడాలి. కానీ సువార్త ప్రచారం సంగతేమోకానీ సమాజసేవ చేయాలన్న ఆసక్తి బాప్టిస్టు క్రైస్తవ ప్రముఖులలో లోపించిందనేది స్పష్టంగా ఉంది. ఈ సంక్షోభానికి మూల కారణం అదే. అటువంటప్పుడు మిషనరీలు నిర్దేశించిన లక్ష్యాల కోసం ఉపయోగించని భూమిని ప్రభుత్వం స్వాధీనం


చేసుకొని సామాన్య ప్రజాప్రయోజనాల కోసం వినియోగించాలి. పట్టణ భూపరిమితి చట్టంలో ఈ అవకాశం ఉంది. లేదా, అవి బాప్టిస్టు క్రైస్తవ చర్చి ఆస్తులు కాబట్టి బాప్టిస్టు క్రైస్తవుల ఉమ్మడి ప్రయోజనాల కోసం వాటిని ఉపయోగించాలన్న వాదనను ప్రభుత్వం ఆమోదించేటట్టయితే ఆపని చేయవచ్చు). బాప్టిస్టు క్రైస్తవులు అధికంగా పేద దళితులు కాబట్టి దీనికి ఎవరూ పెద్దగా అభ్యంతరం చెప్పరు.

పిఎబిసి చేతిలోనే ఈ ఆస్తులు ఉండేటట్టయితే అవి మళ్ళీ మళ్ళీ అన్యాక్రాంతం కాకుండ చూడడం ఎట్లా అనే ప్రశ్న వస్తుంది. నిజానికి సంఘం-సమాజం-సమావేశం అనే మూడంచెల ప్రజాస్వామ్య నిర్మాణం సక్రమంగా నడిచినట్టయితే ఈ ప్రశ్నే తలెత్తదు. బాప్టిస్టు క్రైస్తవ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించి ఏలోపాలు లేకుండ నడపడం అన్నిటికంటె ఉత్తమమయిన పరిష్కారం. కానీ దురదృష్టవశాత్తు, పౌరహక్కుల సంఘం ఈ విషయాన్ని చర్చించిన వారిలో ఏ ఒక్కరూ అది సాధ్యం అవుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేయలేదు. క్రింది నుండి మీదిదాకా ఎక్కడికక్కడ ఎప్పటికప్పుడు ఎన్నికలు నిర్వహించి బాప్టిస్టు క్రైస్తవ వ్యవహారాలను ప్రజా స్వామికంగా నిర్వహించడం ఇప్పట్లో జరిగేపని కాదని అందరూ అంటున్నారు. అయితే ఈ ఆస్తులను ఒక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అయిన పిఎబిసి చేతిలోనే ఉంచితే వీటిని కాపాడడం కష్టం. ఆ కంపెనీ తన ట్రస్టీ లక్ష్యాన్ని అతిక్రమించి వ్యవహరించినప్పుడల్లా సివిల్ కోర్టులలో దావాలు వేసి దానిని నిరోధించాలంటే అది జరిగేపని కాదు.


అప్పుడు వక్ఫ్ బోర్డు వంటి బోర్డును నెలకొల్పి చర్చి ఆస్తులను దానికి అప్పగించడం ఒకటే మార్గం. ఆ బోర్డులో దానికి ప్రభుత్వ అధికారులతో బాటు ఎస్‌టిబిసి ప్రతినిధులు కూడ ఉంటారు. అది గాడి తప్పి ప్రవర్తిస్తే ప్రభుత్వం జోక్యం చేసుకోగలుగుతుంది. కోర్టులు ప్రభుత్వానికి తగు ఆదేశాలు ఇవ్వగలుగుతాయి. ఆ బోర్డు ఆస్తుల నిర్వహణలో ట్రస్టీగానే వ్యవహరించేటట్టు చూడడం కొంచెం సులభం అవుతుంది.

వక్ఫ్ బోర్డుల ఏర్పాటు ముస్లిం సంప్రదాయానికి విరుద్ధం కాదు కాబట్టి అది సాధ్యం అయింది. కానీ, క్రైస్తవ సంప్రదాయంలో అటువంటి వ్యవస్థలేవీ లేనప్పుడు ఈ పని చేయడం మైనారిటీల మత సంప్రదాయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం అవుతుందికదా అనవచ్చు. దీని చట్టపరమైన తప్పొప్పుల నిర్ధారణలోకి మేము పోవడం లేదు. అయితే వక్ఫ్ బోర్డు వంటి బోర్డు ఏర్పాటు చేసి క్రైస్తవ ఆస్తుల సంరక్షణను దానికి అప్పగించాలన్న మా సూచనను మేము బాప్టిస్టు క్రైస్తవులతో చర్చించినప్పుడు అది మంచి ఆలోచనే అని దాదాపు అందరూ అన్నారు. బాప్టిస్టు క్రైస్తవులందరూ సహకరిస్తే ఆ బోర్డు ఏర్పాటు ప్రభుత్వానికి కష్టతరం కాదు.

ఏమయినా నివారణ చర్యలు, సంస్కరణ చర్యలు త్వరలో చేపట్టకపోతే క్రైస్తవ ఆస్తులలో మిగిలేదేమీ ఉండదు. అవి క్రైస్తవ మతానికి దక్కవు, మిషనరీలు గణనీయంగా చేసిన విద్యావైద్య రంగాల ప్రజాసేవకు దక్కవు. సామాన్య ప్రజాప్రయోజనాలకు దక్కవు. డబ్బులున్న వాళ్లు, బాంబులున్నవాళ్లు, దౌర్జన్యం చేయగల వాళ్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాటిని స్వంతం చేసుకుంటారు.




EDUCATIONAL INSTITUTIONS, BELONGS TO THE AMERICAN BAPTIST FOREIGN MISSION SOCIETY




EDUCATIONAL INSTITUTIONS, BELONGS TO
THE AMERICAN BAPTIST FOREIGN MISSION SOCIETY